fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 37 సంచిక : 49 | విజయవాడ, సోమవారం 19 ఫిబ్రవరి 2018 | 12 +12 పేజీలు వెల : 4.00



ఇరాన్‌లో ఘోర విమాన ప్రమాదం

66 మంది మృతి

టెహ్రాన్ : ఇరాన్ దక్షిణ ప్రాంతంలో ఆదివారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అందులోని 66 మంది ప్రయాణీకులు మరణించారు. మృతుల్లో ఒక చిన్నారితో సహా అరవై మంది ప్రయాణీకులు, ఆరుగురు సిబ్బంది వున్నారు. ఇరాన్‌కు చెందిన సెమీ ప్రైవేట్ వైమానిక సంస్థ 'ఎన్‌అసమన్ ఎయిర్‌లైన్స్'కు చెందిన ఈ ఎటిఆర్ 72 తరహా విమానం మిగతా 9లో

హోదా, విభజన హామీల సాధనకు

ఐక్య కార్యాచరణ

రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయం



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు ఐక్యంగా ఆందోళనలు నిర్వహించాలని పలువురు వక్తలు వెల్లడించారు. దీనికోసం ఐక్య కార్యాచరణ రూపొందించారు. ఆదివారం ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఐవి ప్యాలస్‌లో నిర్వహించింది. ప్రత్యేకహోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో వామపక్షాలు, వైఎస్సార్ కాంగ్రెస్, మిగతా 3లో



హోదా కోసం పోరాడని రాజకీయ పార్టీలు భూ స్థాపితం అవుతాయి
-చలసాని శ్రీనివాస్, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు



రాష్ట్ర ప్రయోజనాలకోసం ఇప్పటికే ఉద్యమిస్తున్నాం. పోరాడే శక్తులతో కలిసి నడవడానికి సిద్ధమే
-కొలుసు పార్ధసారధి, వైసిపి అధికార ప్రతినిధి



హోదా ఇప్పుడు రాకపోతే ఎప్పటికీ రాదు
-కొణతాల రామకృష్ణ, ఉత్తరాంధ్ర చర్చావేదిక అధ్యక్షులు



రాష్ట్రానికి అన్యాయం జరిగితే నరేంద్రమోడీ, చంద్రబాబులే మొదటి ముద్దాయిలు
-పి. మధు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి



అప్రమత్తంగా లేకపోతే ప్రత్యేకహోదా కనుమరుగవుతుంది
-రఘువీరారెడ్డి, పిసిసి అధ్యక్షులు



హోదా విషయంలో చంద్రబాబు రాష్ట్ర ప్రజలను గందరగోళ పరుస్తున్నారు
- కె. రామకృష్ణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి



హోదా ఇస్తామన్న హామీని విస్మరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే
-పోతిన మహేశ్, జనసేన నాయకుడు



ప్రత్యేక హోదా సాధించడానికి విద్యార్థులు కదలాలి. ఈ సారి ప్రజలదే గెలుపు కావాలి
- శివాజీ, సినీ నటుడు



కేంద్రం మెడలు వంచి హోదా సాధించాలి
- జగదీశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ నేత



కేంద్రంపై ఒత్తిడి తెచ్చేలా పోరాటాన్ని ఢిల్లీ స్థాయికి చేర్చాలి
- పోతిన వెంకట రామారావు, ఆప్

బిజెపి అధ్యక్షుడిపై తిరుగుబాటు

చంద్రబాబు వద్ద తాకట్టు పెట్టారని నిరసన

మంత్రి సర్దిచెప్పినా పట్టించుకోని నాయకులు

బిజెపి రాష్ట్ర సమావేశంలో వాగ్వివాదం

బయటపడ్డ గ్రూపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిజెపిలో తిరుగుబాటు మొదలయ్యింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు తీరుపై పలు జిల్లాలకు చెందిన నాయకులు తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. బిజెపిని చంద్రబాబు కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని, తాము కష్టపడి నిర్మించిన పార్టీని నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని తీవ్రస్థాయిలో మిగతా 3లో

బహిరంగ చర్చకు సిద్ధమే

చంద్రబాబుకు వీర్రాజు సవాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏపీ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు చంద్రబాబు వస్తే తామూ సిద్ధమేనని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఏపి అభివృద్ధి పై మిత్రపక్షంగా పిలిపించి మాట్లాడే అవకాశం మిగతా 3లో

టిడిపి కలిసి వస్తే..

అవిశ్వాస తీర్మానం

వైసిపి అధినేత వైఎస్ జగన్




కందుకూరులో జరిగిన భారీ బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి-కందుకూరు

తెలుగుదేశం పార్టీ కలిసి వస్తే నరేంద్ర మోడీ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెడతామని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెప్పారు. ప్రకాశం జిల్లా కందుకూరు పట్టణంలో ఆదివారం జరిగిన ప్రజా సంకల్ప యాత్ర సందర్భంగా జరిగిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం ఏప్రిల్ 6న వైసిపి లోక్‌సభ సభ్యులు పదవులకు రాజీనామా చేస్తారని ప్రకటిస్తే అలా కాదని, కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ మిగతా 3లో

మరొకరు పరార్



విక్రమ్ కొఠారి

నీరవ్ మోడీ తరహాలో మరో లూటీ

ఐదు బ్యాంకుల కన్సార్టియంకు రూ.800 కోట్లు ఎగవేత

ప్రముఖ పెన్నుల తయారీ సంస్థ రోటోమ్యాక్ స్కామ్

ఆచూకీ లేని యజమాని కొఠారి

కాన్పూర్ : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంకు రు.11,360 కోట్ల కుంభకోణం వెలుగు చూసిన కొద్దిరోజులకే అదే తరహాలో బ్యాంకులను లూటీ చేసిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రముఖ పెన్నుల తయారీ సంస్థ అయిన రోటోమ్యాక్ మాతృ సంస్థ యాజమాన్యం ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి రూ.800 కోట్ల మేర రుణాలు తీసుకుని విదేశాలకు పారిపోయినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ కంపెనీ యజమాని విక్రమ్ కొఠారి ఐదు ప్రభుత్వ రంగ బ్యాంకుల అధికారులతో కుమ్మక్కై నియామాలను కాలరాసి దాదాపు రు.800 కోట్లకు పైగా రుణం తీసుకున్నారు. అలహాబాద్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులు కొఠారికి రుణాలు ఇచ్చే విషయంలో తమ సొంత మిగతా 9లో



ప్రశాంతంగా ముగిసిన త్రిపుర పోలింగ్ 8

79 శాతం పోలింగ్ : ఇసి

10 శాతం ఇవిఎంల మోరాయింపు

ఒంటిమిట్ట చెరువులో

5 మృతదేహాలు



9

ఒంటిమిట్ట చెరువులో లభ్యమైన అయిదు మృతదేహాలు

ఎర్రచందనం కూలీలని అనుమానం?

పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో ఘటన!

వ్యక్తమవుతున్న పలు అనుమానాలు

విచారించి వాస్తవాలు వెల్లడిస్తాం : ఒఎస్‌డి

జెఎఫ్‌సిలో ఉప కమిటీలు

పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి, హైదరాబాద్ బ్యూరో

జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ (జెఎఫ్‌సి)లో ఉప కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. వివిధ అంశాలపై ఈ ఉప కమిటీలు పని చేస్తాయని, కమిటీల వివరాల్ని త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశాల్లో చర్చలు పారదర్శకంగా జరిగాయని పేర్కొన్నారు. చర్చల్లో పాల్గొన్నవారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఉద్యమం
కడపలో
ఆదివారం
జరిగిన
ఒపిడిఆర్
17వ రాష్ట్ర
మహాసభల్లో
మాట్లాడుతున్న
హైకోర్టు
విశ్రాంత
న్యాయమూర్తి
బి.చంద్రకుమార్

ప్రత్యామ్నాయం కావాలి

- ప్రజాస్వామ్య ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాలి
- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్

ప్రజాశక్తి - కడప

దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన సాగడం లేదని, ప్రజలకు, రైతులకు, దళితులకు, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే ప్రత్యామ్నాయం తప్పక కావాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఒపిడిఆర్ 17వ రాష్ట్ర మహాసభ స్థానిక జడ్జి సమావేశ హాలులో ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. అవినీతిపరులను, దొంగల్ని తరిమి కొట్టాలంటే ప్రజాస్వామ్య ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు, పేదలు, దళితులు, బడుగు బలహీనవర్గాలు, మైనార్టీల పక్షాన పాలక ప్రభుత్వాలు పనిచేయడం లేదని చెప్పారు. కార్పొరేట్ కనుసన్నల్లో ఈ ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను నిట్టనిలువునా దోచుకుంటూ, బ్యాంకులను కొల్లగొడుతూ వేల కోట్ల రూపాయలు దోచుకుంటున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణను కాపాడుకోలేకపోతే దేశం పూర్తిగా దొంగల పాలవుతుందన్నారు. కార్యక్రమంలో ఒపిడిఆర్ నాయకులు, సభ్యులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



రాయలసీమలో పెరుగుతున్న వేడి

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో కోస్తాతో పోలిస్తే రాయలసీమలో ఒకట్రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఆదివారం నంద్యాలలో 36, కర్నూలులో 35.7, కడప, అనంతపురంలో 35, తిరుపతిలో 33.3 డిగ్రీలు నమోదైంది. కోస్తాలో జంగమహేశ్వరం, నందిగామలో 35 డిగ్రీలు మిగతా చోట్ల 30 నుండి 33 డిగ్రీల మధ్యలో నమోదయ్యాయి. రాత్రిపూట చలితీవ్రత కొనసాగుతోంది. మరో నాలుగైదు రోజులు రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. లక్ష్యద్వీప్ నుండి తూర్పు మధ్య అరేబియా వరకు అల్పపీడన ద్రోణి కర్నాటక, దక్షిణ మహారాష్ట్ర తీరానికి ఆనుకుని కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. దక్షిణ కర్నాటక పరిసరాలపై ఆవర్తనం కొనసాగుతోంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

1. 6వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సిపిఎ) భారత ప్రాంతీయ సదస్సు ఎక్కడ జరిగింది?
2. గ్రామీణ మహిళలకు తక్కువ ధరకు శానటరీ ప్యాడ్‌లను కోసం మహారాష్ట్ర ప్రారంభించిన పథకం?
3. జాతీయ ఆరటి పళ్ల ఉత్సవం ఎక్కడ జరుగుతుంది?
4. రంగనది డ్యామ్ ఏ రాష్ట్రంలో ఉంది?
5. అత్యధిక వయస్సులో టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచిన ఆటగాడు?

సమాధానాలు 7లో

తిట్టుకుంటున్నా మిత్రపక్షాలమే

- ఇదీ టిడిపి, బిజెపి వ్యవహారం
- చర్చలకూ సిద్ధమని రెండు పార్టీల ప్రకటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రత్యేక హోదా విషయంలో కొద్దికాలంగా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నప్పటికీ తాము మిత్రపక్షాలమేనని రెండు పార్టీల నాయకులూ ప్రకటిస్తున్నారు. ఒకరిపై ఒకరు మీడియాపరంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నప్పటికీ చర్చలకు పిలిస్తే తాము సిద్ధమేనని రెండు పార్టీల నాయకులూ ప్రకటించారు. తాము మిత్రపక్షంగానే ఉన్నామని శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకాశం జిల్లాలో జరిగిన సదస్సులో ప్రకటించారు. ఇప్పటికీ మిత్రపక్షంగానే ఉన్నామని, కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చించేందుకు చంద్రబాబు పిలిస్తే వెళ్లేందుకు తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు సిద్ధంగా ఉన్నారని బిజెపి ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్ ఆదివారం ప్రకటించారు. దీంతో రెండు పార్టీలూ ప్రజలను మోసం



చేస్తున్నాయనే విషయం తేలిపోయిందని పలువురు విశ్లేషకులు విమర్శిస్తున్నారు. బడ్జెట్ కేటాయింపు విషయంలో కొద్దికాలంగా టిడిపి, బిజెపి నాయకులు వ్యక్తిగతంగా తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటున్నారు. చంద్రబాబు ఆస్తి ఎలా వచ్చిందో చెప్పాలని బిజెపి నాయకులు, హామీలిచ్చి కేంద్రం మోసం చేసిందని టిడిపి నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగి రాజకీయంగానూ గందరగోళం సృష్టించారు. అటు కేంద్రంలో టిడిపి ఎంపిలు మంత్రులుగా, రాష్ట్రంలో బిజెపి ఎమ్మెల్యేలు మంత్రులుగా కొనసాగుతున్నారు. క్యాబినెట్ సమావేశాలకూ హాజరవుతున్నారు. పరిపాలన విషయంలోనూ సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. పైకి మాత్రం విరుద్ధ ప్రకటనలు చేస్తూ కొద్దికాలంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. శని, ఆదివారాల్లో రెండు పార్టీల నాయకులు చేసిన ప్రకటనలతో వారి దొంగ వ్యవహారం బయటపడిందని పలువురు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వారి సంబంధాలు అలాగే ఉండాలని, ప్రజలు మాత్రం ఆందోళనలు చేయాలని కోరడం వ్యక్తిగత ప్రయోజనాలను కాపాడుకోవడంలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కొద్దికాలంగా రెండు పార్టీల నాయకులు చేసుకుంటున్న విమర్శలన్నీ వ్యక్తిగతంగానే ఉన్నాయని, రాష్ట్ర ప్రయోజనాల అంశంపైగానీ, హోదా, విభజన హామీలపైగానీ లేవని అంటున్నారు. తాడోపేడో తేల్చుకుంటామంటూనే మిత్రపక్షాలని చెప్పడం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. బహిరంగంగా తిట్టుకుంటున్నా తాము మిత్రపక్షాలమేనని ఎమ్మెల్సీలు, మాధవ్, సోము వీర్రాజు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కంభంపాటి హరిబాబు, టిడిపి అధ్యక్షులు చంద్రబాబు వ్యాఖ్యానించడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది.

విశాఖ సిఐఐ సదస్సుకు 40 దేశాల ప్రతినిధులు

ప్రజాశక్తి-జిల్లాపరిషత్ (విశాఖ)

విశాఖ వేదికగా ఈ నెల 24 నుండి 26వ తేదీ వరకు జరగనున్న పెట్టుబడుల భాగస్వామ్య సదస్సు (సిఐఐ) ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదివారం విశాఖ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో భౌగోళికంగా, వాతావరణపరంగా అద్భుతంగా ఉన్నందున ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అందరూ ఆసక్తి చూపిస్తున్నారని చెప్పారు. ఈ సదస్సుకు 14 దేశాల నుండి వాణిజ్య మంత్రులు, 40 దేశాలకు చెందిన వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. అతిథులకు భోజన, వసతి, పర్యాటకం, ప్రోటోకాల్ అంశాల్లో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. గత రెండు సదస్సుల ద్వారా 876 ప్రాజెక్టులకు గానూ రూ.11 వేల కోట్లు పెట్టుబడులుగా వచ్చాయని, వీటి ద్వారా 22 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయని వివరించారు. ఆ సదస్సుల్లో ఒప్పందం కుదుర్చుకున్న ప్రాజెక్టుల్లో 47 శాతం గ్రౌండింగ్ అయినట్లు పేర్కొన్నారు. 2018 సదస్సులోనూ ఎక్కువగా పరస్పర ఒప్పందాలు (ఎంఒయు) జరిగేలా చూస్తున్నామని వివరించారు.



ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఆర్థిక మంత్రి యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో ఆదివారం రైవస్ కాలువపై వంతెన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ప్రజలకు ఉపయోగ పడే విధంగా రైవస్ కాలువపై రూ. 5.40 కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రంలో రూ.25 వేల కోట్ల రూపాయల లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ అభివృద్ధే ధ్యేయంగా సిఎం చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రూ.5 వేల కోట్లతో చేపడుతున్నామన్నారు. గన్నవరం నియోజకవర్గంలో రైవస్ కాలువ వంతెనతో పాటు బ్రహ్మలింగం చెరువు అభివృద్ధి పనుల్ని రూ.12 కోట్లతో చేపడతామన్నారు.

ఎన్టీఆర్ వంతెనగా నామకరణం : దేవినేని

ఎన్టీఆర్ జయంతి రోజైన మే 28న వంతెనను ప్రారంభించే విధంగా చర్యలు చేపడతామని జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. దీనికి ఎన్టీఆర్ వంతెనగా నామకరణం చేస్తామన్నారు. రైతుల కోరిక మేరకు బుడమేరు, ఏలూరు కాలువలపై కూడా రెండు వంతెనలను త్వరలోనే నిర్మిస్తామన్నారు. బ్రహ్మలింగం చెరువు పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామన్నారు. జల వనరుల శాఖ ద్వారా రాష్ట్రంలో రూ.51,867 కోట్లతో పలు ప్రాజెక్టులను చేపడుతున్నామని మంత్రి తెలిపారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే కృష్ణా డెల్టాలో రెండు, మూడు పంటలు పండించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపి కొనకళ్ల నారాయణ, గన్నవరం ఎమ్మెల్యే వంశీ మోహన్, కృష్ణా జిల్లా కలెక్టర్ బి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడేందుకు

విశాల ఐక్య వేదిక

- దీనిపై జాతీయ మహా సభల్లో చర్చిస్తాం
- సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం

ప్రజాశక్తి, హైదరాబాద్ బ్యూరో

మతోన్మాద బిజెపి, సంఘ్‌పరివార్ నుంచి దేశాన్ని కాపాడేందుకు జాతీయ స్థాయిలో విశాల ఐక్య వేదిక ఏర్పాటు చేస్తామని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి తెలిపారు. ఎన్నికలకు సంబంధం లేకుండా.. వామపక్ష, ప్రజాతంత్ర, మేధావులు, లౌకికవాదులతో కలిసి వేదిక ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ వేదిక ద్వారా రాజ్యాంగాన్ని పరిరక్షించడంతో పాటు మతోన్మాదుల్ని ఎదుర్కొని, దేశాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. ఐక్య వేదిక ఏర్పాటుపై ఏప్రిల్ 26 నుంచి కేరళలోని కొల్లంలో జరిగే పార్టీ జాతీయ మహాసభల్లో చర్చిస్తామన్నారు. మహాసభలలో రాజకీయ తీర్మానంపై చర్చలో పార్టీ సభ్యులు తమ తమ అభిప్రాయాల్ని స్వేచ్ఛగా చెప్పవచ్చన్నారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆదివారం సిపిఐ తెలంగాణ నేత పల్లా వెంకటరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అమెరికా తరహా ఆర్థిక, సామాజిక అసమానతలకు మన దేశం ప్రతిరూపంగా మారుతోందని ఆందోళన వ్యకం చేశారు. మోడీ సర్కారు అవలంబిస్తున్న విధానాల కారణంగా దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. ఆర్థిక, రాజకీయ ప్రత్యామ్నాయ విధానాలకు వామపక్ష పార్టీలే కీలకమన్నారు. సమస్యల ప్రాతిపదికన వామపక్షాలుగా కలిసే ఉద్యమిస్తున్నామన్నారు. పోరాటాలు వేరు, ఎన్నికల ఎత్తుగడలు వేరు అని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎవరు ఎవరితో కలిసి వెళ్తామనేది అప్పుడు నిర్ణయిస్తామన్నారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడంతో పాటు, నల్ల ధనాన్ని వెనక్కి తెస్తానని చెప్పి గత ఎన్నికల్లో మోడీ గెలిచారన్నారు. మోడీ అధికారంలోకొచ్చాక అంబానీ, ఆదానీ ఆస్తులు పెరిగాయే తప్ప, సామాన్య ప్రజల స్థితిగతులు మారలేదన్నారు. ఈ సందర్భంగా పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణాన్ని ప్రస్తావించిన ఆయన, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. వ్యాపారవేత్త నీరవ్ మోడీ కేంద్రంగా జరిగిన దోపిడీని తమ పాలనలో జరగలేదని బిజెపి తప్పించుకుంటోందన్నారు. నీరవ్ మోడీ అవినీతిపై రెండేళ్ల క్రితమే ఫిర్యాదు వచ్చినా, చర్యలు తీసుకోకుండా అతడు పారిపోయే అవకాశాన్ని కల్పించారని ఆరోపించారు. మోడీ, నీరవ్ మోడీ కలిసి దావోస్‌లో ఎలా ఫొటో దిగారని ప్రశ్నించారు. పిఎన్‌బి కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బిజెపి



అధికారంలోకొచ్చాక ఆ పార్టీ మద్దతుతో ఆర్థిక నేరస్థులు పెరిగారన్నారు. విజయ్‌మాల్యా, లలిత్‌మోడీ, ఇప్పుడు నీరవ్‌మోడీ ఈ దేశం నుంచి పారిపోయారన్నారు. రాఫెల్ ఫైటర్ల కొనుగోలుపై వస్తున్న అవనీతి ఆరోపణలపై బిజెపి సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు.

పొత్తులపై ఆచితూచి అడుగేస్తాం...

కర్నాటక ఎన్నికలపై మాట్లాడుతూ పొత్తులపై ఆచితూచి వ్యవహరిస్తున్నామన్నారు. గత ఎన్నికలు ముగియగానే బిజెపితో జనతాదళ్ కలిసి వెళ్లిన సంగతిని గుర్తు చేస్తూ పై విధంగా వ్యాఖ్యానించారు. పొత్తులపై జనతాదళ్ నేత కుమారస్వామి తమతో చర్చలు జరుపుతున్నారని, అయితే కాంగ్రెస్, బిజెపికి వ్యతిరేకంగా ఉంటానని స్పష్టంగా హామీ ఇస్తేనే.. జనతాదళ్‌తో కలిసి వెళ్తామని సురవరం స్పష్టం చేశారు. తెలంగాణలో కొత్తగా ఏర్పడిన బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్‌ఎఫ్)తో కలిసి పని చేస్తారా.? అని ప్రశ్నించగా తక్షణ సమస్యలపై వామపక్షాలుగా కలిసే పోరాటాలు చేస్తున్నామని, ఎన్నికల సమయంలో పొత్తుల అంశంపై నిర్ణయాలుంటాయని ఆయన స్పష్టం చేశారు.

నేడు పోగొండ రిజర్వాయర్ ప్రారంభం

మంత్రి దేవినేని ఉమా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయ గూడెం మండలం చింతలగూడెంలో రూ. 129 కోట్లతో నిర్మించిన పోగొండ రిజర్వాయర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ప్రారంభించను న్నట్లు జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వ రావు తెలిపారు. దీని ద్వారా దాదాపు 4 వేల ఎకరాల్లో భూములు స్థిరీకరణలో కొస్తాయన్నారు. విజయవాడ జలవనరులశాఖ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ జలాశయం వల్ల గిరిజన రైతులకు సాగు, తాగునీరు అందించడంతోపాటు ఆయకట్టు స్థిరీకరణకు ఉపయోగపడు తుందన్నారు. వచ్చే డిసెంబర్, జనవరి నాటికల్లా పోలవరం గేట్లు పూర్తి చేసే లక్ష్యంతో పనులు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు జైరామ్ రమేష్ నాలుగేళ్ల తర్వాత తమకు ముడుపు లందాయని మాట్లాడటం ఆయన బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమన్నారు.

ప్రత్యేకం

భవానీ ద్వీపంలో 'సీల్' అక్వేరియం

- ఏర్పాటుకు టర్కీ కంపెనీ ఆసక్తి
- పర్యాటక శాఖ ప్రతిపాదన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మొట్ట మొదటిసారి సీల్ (సీ లయన్) అక్వేరియం ఏర్పాటు కానుంది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. విజయవాడ భవానీ ద్వీపంలో సింగపూర్ తరహాలో సీల్ అక్వేరియంను ఏర్పాటు చేయడంతో పాటు సీల్ ప్రదర్శనలను నిర్వహించేందుకు టర్కీకి చెందిన ఓ కంపెనీ ఇప్పటికే పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో చర్చలు జరిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.9 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టేందుకు టర్కీ కంపెనీ ముందు కొచ్చింది. తొలుత భవానీ ద్వీపంలో డాల్ఫినేరి యాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ భావించింది. గోవాలో డాల్ఫినేరియం ఏర్పాటును ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అనిమల్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్‌తో పాటు పలు సంస్థలు వ్యతిరేకిం చడంతో పాటు వాతావరణ పరిస్థితుల రీత్యా డాల్ఫిన్లకు సరైన వాతావరణం రాష్ట్రంలో లేకపోవ డంతో డాల్ఫినేరియం ఏర్పాటును పర్యాటక శాఖ రద్దు చేసుకుంది. ఇతర ప్రాంతాలలో సీల్ అక్వేరి యానికి అవసరమైన పరిస్థితుల్ని అధ్యయనం చేశాక రాష్ట్రంలో సీల్ అక్వేరియాన్ని ఏర్పాటు చేయాలని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. సీల్ అక్వేరియం ఏర్పాటుకు సమస్యలు కూడా తలెత్తే అవకాశం లేదని భావిస్తున్నారు. సీల్ ప్రదర్శనలను నిర్వహించేం దుకు వీలుగా సంబంధిత సంస్థ నిపుణులతో పాటు శిక్షకులను కూడా రాష్ట్రంలో నియమించుకోనుంది. సీల్ అక్వేరియం ప్రతిపాదన ఇప్పటికే ముఖ్యమంత్రి వద్దకు చేరినట్లు సమాచారం. ముఖ్యమంత్రి నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే ఈ ప్రాజెక్టు పనులను చేపట్టనున్నారు. పర్యాటక శాఖ నిర్ణయంతో రాష్ట్రంలో తొలిసారిగా సీల్ (సీ లయన్) భవానీ ద్వీపంలో కనువిందుచేయనున్నాయి. భారత చరిత్ర, సంస్కృతిని అధ్యయనం చేసి స్థానిక అంశాల్ని ఇతివృత్తాలుగా తీసుకుని భవానీ ద్వీపాన్ని అభివృద్ధి చేయాలని ఇటీవల నిర్వహించిన పర్యాటక, వారసత్వ బోర్డు సమావేశంలో సిఎం చంద్రబాబు సూచించడంతో పాటు పర్యాటక ప్రదేశాల్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.



'సీల్' గాథ ఇదే...

సీ లయన్‌గా పిలిచే సీల్‌లో మొత్తం ఏడు జాతులున్నాయి. వాటిలో ఒక జాతి ఇప్పటికే అంతరించిపోయినట్లు గుర్తించారు. ఉత్తర, దక్షిణార్థ గోళాల్లో సీల్‌లు నివసిస్తాయి. ఉత్తర అట్లాంటిక్ మహా సముద్రంలో వీటి జాడ అత్యంత ఎక్కుగా కనిపిస్తుంది. సీల్‌లు సగటున 20 నుంచి 30 సంవత్సరాల జీవిత కాలాన్ని కలిగి ఉంటాయి. మగ కాలిఫోర్నియా సీల్ 300 కిలోల బరువు, ఎనిమిది అడుగుల ఎత్తు వరకూ ఉంటుంది. ఆడ కాలిఫోర్నియా సీల్ 100 కిలోల బరువు, ఆరు అడుగుల ఎత్తు ఉంటుంది. సీల్ జాతిలో అత్యంత పెద్దదైన స్టెల్లర్స్ సీల్ వెయ్యి కిలోల వరకూ బరువు ఉండటంతో పాటు పది అడుగుల వరకూ ఎత్తు పెరుగుతుంది. సీల్‌లు తమ శరీర బరువులో ఐదు నుంచి ఎనిమిది శాతం బరువున్న ఆహారాన్ని ఒకే సారి తీసుకోగలవు.

వైద్య ఆరోగ్యానికి ఒక్క శాతమేనా?

- ఈ సారైనా కేటాయింపులు దక్కేనా
- జిఎస్‌డిపిలో 4 శాతమైనా వెచ్చించాల్సిందే
- 2 శాతం కేటాయిస్తామన్న ప్రభుత్వ హామీ ఏమైనట్టు?
- మూడేళ్లలో కేటాయింపులు అంతంతమాత్రమే



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ముందుగా వారు వైద్యఆరోగ్యానికి వెచ్చించే ఖర్చులు తగ్గాలి. ప్రభుత్వం ఆమేరకు వైద్యఆరోగ్య రంగానికి ఎక్కువ నిధులు కేటాయించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి)లో 4 శాతం నిధుల్ని వైద్యఆరోగ్య రంగానికి కేటాయించాలి. కాని ఇప్పటివరకు మన రాష్ట్రంలో అందులో సగం కూడా నిధుల్ని కేటాయించలేదు. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా ఈ రంగానికి జిఎస్‌డిపిలో 4 శాతం నిధులు కేటాయించాలని పలువురు వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదల, వైద్యుల కొరత వంటి సమస్యలున్నాయి. వాటితోపాటు వ్యాధి నివారణకు ఎక్కువ శాతం నిధులు కేటాయించాలంటున్నారు. జిఎస్‌డిపిలో కనీసం 2 శాతం నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అది అమలుకు నోచుకోలేదు. ఆరోగ్యానికి కేటాయింపులు ఎక్కువగా ఉంటే దాని ప్రభావం జిఎస్‌డిపి పై ఉంటుందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ఎక్కువసేపు పనిచేయగలుగుతారని అభిప్రాయపడుతున్నారు. అంటే పరోక్షంగా ఆరోగ్య రంగ ప్రభావం స్థూల ఉత్పత్తి పై ఉంటుంది. కాని ప్రభుత్వం మాత్రం వైద్యఆరోగ్యాన్ని రాబడి లేని రంగంగా పరిగణిస్తూ, అవసరమైన నిధుల్ని కేటాయించడంలేదు. గత బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య శాఖ రూ 12,700 కోట్లు ప్రతిపాదించగా దాదాపు రూ 7,020 కోట్లు ఆమోదించారు. చివరకు రూ.6,200 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపులు చూస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువలో కనీసం ఒక శాతం కూడా లేదు.

2015-16లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ.4,90,134 కోట్లు ఉంటే వైద్యఆరోగ్య రంగానికి రూ 5,069 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. అంటే జిఎస్‌డిపిలో దాదాపు ఒక్క శాతమే నిధులు కేటాయించారు 2016-17లో జిఎస్‌డిపి రూ 5,47,021 కోట్లు కాగా వైద్య రంగానికి రూ 6,103 కోట్లు (1.1 శాతం) కేటాయించారు. గతేడాది జిఎస్‌డిపి అంచనాలు రూ 7,68,546 కోట్లు కాగా బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ 6,200 కోట్లు (0.8 శాతం) కేటాయించారు. అంటే ఈ మూడేళ్లలో వైద్య ఆరోగ్య రంగానికి బడ్జెట్ కేటాయింపులు జిఎస్‌డిపిలో ఒక్క శాతానికి మించి ఇవ్వలేదు.

ఆరోగ్యం కంటే వైద్యానికే ప్రభుత్వ ప్రాధాన్యత

ప్రజల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడాలంటే ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్యం, నివారణపై ప్రభుత్వం ఎక్కువగా వెచ్చించాలి. కానీ ప్రభుత్వం కేటాయించే బడ్జెట్ మాత్రం వీటికి భిన్నంగా ఉంటోంది. వ్యాధుల నివారణ, ఆరోగ్యానికంటే ప్రభుత్వం వైద్యానికే ఎక్కువగా కేటాయిస్తోంది. దీనివల్ల ప్రజలకు ఆరోగ్య సేవల బీమా సదుపాయం అందుతోంది. వాటితో ప్రయివేటు ఆస్పత్రులు, ఇన్సూరెన్స్ కంపెనీలే ఎక్కువ లాభం పొందుతున్నాయి. ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వసతుల్ని మెరుగుపర్చేందుకు, వైద్యుల కొరతను భర్తీ చేసేందుకు ఎక్కువ నిధుల్ని కేటాయించాలని పలువురు వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాటితోపాటు నివారణకు కూడా ప్రాధాన్యతనివ్వాలని కోరుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు మెరుగుపడాలి

" రాష్ట్రంలో ఎక్కువ శాతం జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారు. అక్కడ వైద్యసేవలు మాత్రం పట్టణాల్లో కంటే అధ్వానంగా ఉంటున్నాయి. అక్కడ ఆరోగ్య కేంద్రాల్ని పటిష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. ఆమేరకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధుల్ని కేటాయించాలి. అలాగే రోగాల బారిన పడకుండా ఉండేందుకు శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం అందించే ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చాలి

-డి.సుధాకర్,
జన స్వాస్థ్య అభియాన్
ఏపి బడ్జెట్ కమిటీ కో ఆర్డినేటర్

సిక్కోలు సంబరాల లోగో అవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే సిక్కోలు సంబరాల లోగోను కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జాయింట్ కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు కలెక్టరేట్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆర్థిక సహాయంతో జిల్లా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక కళాకారులకు ప్రాధాన్యత ఇస్తూ వారితో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకూ కళా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.



ఆవిష్కరణ

శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 23 నుంచి సిక్కోలు సంబరాల లోగోను ఆదివారం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, తదితరులు

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఎంఎల్‌ఎ ఆగ్రహం

మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్న ఎంఎల్‌ఎ అనుచరులు

ప్రజాశక్తి - తాళ్లరేవు (తూర్పుగోదావరి)

ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ద్వారా కోరింగ బయోడైవర్సిటీ సెంటర్ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రికలో ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు పేరు లేకపోవడంతో ఆయన అనుచరులు అటవీశాఖమంత్రి సిద్దా రాఘవరావు కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం కోరంగిలో కేంద్ర ప్రభుత్వం, యుఎన్‌డిపి నిధులు రూ.80 లక్షలతో నిర్మించిన కోరింగ బయోడైవర్సిటీ కేంద్రాన్ని నిర్మించింది. ఆహ్వానపత్రికలో ఎంఎల్‌ఎ సుబ్బరాజు పేరు పెట్టలేదు. ఈనేపథ్యంలో ఆదివారం కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి కాన్వాయ్‌ను అనుచరులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ప్రొటోకాల్ ఉల్లంఘించిన ఫారెస్టు అధికారులపై ఎంఎల్‌ఎ సుబ్బరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈసందర్భంగా మంత్రి రాఘవరావు, శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఎంఎల్‌ఎతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘించిన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు.

హోదాపై రాజీలేని పోరాటం

- ప్రత్యేక హోదా సాధన సమితి రౌండ్‌టేబుల్‌లో వక్తలు
- ఇంటి దొంగకు తాళాలిచ్చి కాపాడమన్నట్లుంది
- త్యాగాలకు మారుపేరు కమ్యూనిస్టులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా రాకపోవడంలోనూ, విభజన హామీలు అమలు కాకపోవడంలోనూ అన్యాయం చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని నరేంద్ర మోడీయేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న నష్టానికి వారే బాధ్యత వహించాలని, మొదటి ముద్దాయిలు వారేననీ అన్నారు. దీనికి వ్యతరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని నిర్ణయించారు. ప్రత్యేక హోదా, విభజన హక్కుల సాధన సమితి ఆధ్వర్యాన ఆదివారం విజయవాడలోని ఐవిప్యాలెస్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.



హోదాకోసం పోరాడకపోతే భూస్థాపితమే

హోదా కోసం పోరాడని రాజకీయ పార్టీలు భూస్థాపితమవుతాయి. రాష్ట్రం నష్టపోయిందని, ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడు కేవలం రాజకీయ లబ్ధికోసమే బిజెపిని విమర్శిస్తున్నాడు. అదే సమయంలో కేంద్రంలో తన మంత్రులను కొనసాగిస్తున్నాడు. హోదా కోసం జరిగే పోరాటంలో అధికార తెలుగుదేశం పార్టీ కూడా కలిసి రావాలి.

- ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్

రాష్ట్ర హక్కుల గురించి మాట్లాడలేదు

చంద్రబాబు రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం 2008, 2012లో రెండుసార్లు కేంద్రానికి లేఖ రాసిన చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్‌కు ఏం కావాలో కూడా అడగకుండా, ఇప్పుడు రాష్ట్ర ప్రజల్ని మభ్య పెడుతున్నాడు. ఇంటి తాళాలను దొంగకే అప్పగించి ఇంటిని కాపాడమన్నట్లు ఇప్పుడు రాష్ట్ర ప్రజల పరిస్థితి ఉంది. పచ్చి అబద్ధాలు చెబుతున్నాడు. తనకేమీ తెలియదని ప్రజలను మోసం చేస్తున్నాడు.

- వైసిపి నాయకులు కొలుసు పార్థసారథి

ఇప్పుడు రాకపోతే ఎప్పటికీ రాదు

'ప్రత్యేక హోదా ఇప్పుడు రాకపోతే ఇక ఎప్పటికీ వచ్చే అవకాశం లేదు. హోదా పోరులో ఎటువంటి రాజీ పడాల్సిన అవసరం లేదు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించిన హోదా విషయంలో అందరూ కలిసి ఐక్యంగా పోరాడాలి. బుందేల్ ఖండ్ వంటి చిన్న ప్రాంతాలకు వేలకోట్లు రూపాయల ప్యాకేజీ ప్రకటించారు. రాయలసీమ, ఉత్తరాంధ్రల్లో వెనుకడిన ప్రాంతాలకు రూ.50 కోట్లు కూడా విడుదల చేయడం లేదు.

- ఉత్తరాంధ్ర చర్చావేదిక అధ్యక్షులు కొణతాల

హోదాను కనుమరుగు చేసే ప్రయత్నాలు

విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదాను కనుమరుగు చేసే ప్రయత్నాలు వేగంగా జరుగుతున్నాయి. దీనిపై రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై టిడిపి, బిజెపి నాయకులు తాము ఇప్పటి వరకు పొరపాటుపడ్డామని గ్రహించి తమతో ఐక్యంగా ఉద్యమించాలి. టిడిపికి రాష్ట్ర ప్రయోజనాలు అవసరం లేదు. కేవలం అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు ఉంటే సరిపోతుందన్నట్లుగా వ్యవహరిస్తోంది. రాష్ట్ర భవిష్యత్ కోసం బిజెపి, టిడిపియేతర పార్టీలు ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నా కలిసి వచ్చేందుకు, మద్దతిచ్చేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉంది. ఎనిమిదోతేదీన జరిగిన బంద్ తన చిన్నప్పుడు కూడా జరగలేదు. ఎప్పుడూ బంద్ జరగని హిందూపురంలో బంద్ జరిగింది. వామపక్షాల పోరాటానికి ప్రజలు మద్దతిచ్చారు. అందువల్లే బంద్ విజయవంతమైంది. ఇక ముందు వామపక్షాలు చేసే కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ పరంగా పూర్తి మద్దతు ఉంటుంది

..- పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి

చంద్రబాబు, మోడీదే బాధ్యత

రాష్ట్రానికి టిడిపి, బిజెపి తీరని అన్యాయం చేస్తున్నాయి. నాలుగేళ్లుగా మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నా ఇప్పటికీ విభజన హామీల అమలుకు నోచుకోలేదు. హోదా ఇచ్చేందుకు, హామీలు అమలు చేసేందుకు బిజెపి సిద్ధంగా లేదు. దీనికి చంద్రబాబునాయుడు, మోడీ బాధ్యత వహించాలి. వారే మొదటి ముద్దాయిలు. నాలుగేళ్ల తరువాత చంద్రబాబు ఏమీ తెలియనట్లు మరో స్వతంత్ర పోరాటమంటూ ప్రజలను మోసం చేస్తున్నాడు. కనీస బాధ్యత లేకుండా, ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ అంటే చంద్రబాబు సొంత ఆస్తిగా మాట్లాడుతున్నాడు. వ్యక్తిగతంగా వ్యవహరిస్తూ ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాడు. రాష్ట్రానికి జరిగే నస్టానికి వారే బాధ్యత వహించాలి.

-సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

హోదా విషయంలో ప్రజలు గెలవాలి

అన్ని విషయాల్లోనూ రాజకీయ పార్టీలే గెలుస్తున్నాయి. ఈసారి ప్రత్యేక హోదా విషయంలో ప్రజలు గెలవాలి. హోదా ఉద్యమంలో విద్యార్థులూ భాగస్వాములవ్వాలు కావాలి. పార్లమెంట్‌ను స్తంభింప చేయాలి. కమ్యూనిస్టు పార్టీలు త్యాగానికి గుర్తు. వారికి ప్రజలు రుణపడి ఉంటారు. వారికి చేతులెత్తి నమస్క రిస్తున్నా. కాంగ్రెస్ పార్టీ కూడా అంతో ఇంతో దేశానికి సేవ చేసింది. ఏమీ చేయని పార్టీ ఏదైనా ఉందంటే అది కేవలం బిజెపి మాత్రమే. రాష్ట్రానికి ఎవరైనా మేలు చేయాలనుకుంటే దానికి ఇదే సరైన సమయం.

-సినీ హీరో శివాజీ

ప్రభుత్వం చెప్పేవన్నీ అబద్ధాలే

ప్రత్యేక హోదా విషయంలో ప్రభుత్వం చెబుతున్నవన్నీ అబద్ధాలే. ఈ ఉద్యమాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలి. యూనివర్శిటీల్లో దీనిపై సదుస్సులు నిర్వహించాలి. అలా చేయడం ద్వారా ప్రభుత్వం చేస్తున్న మోసాల్ని అందరికీ వివరించినట్లవుతుంది. ఉపాధ్యాయ రంగం బలంగా ఉంది. అందులోకి కూడా ప్రత్యేక హోదా అంశాన్ని తీసుకెళ్లాలి.

-మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

శాసనమండలిలో లేవనెత్తుతాం

హోదా అంశాన్ని శాసనమండలిలో లేవనెత్తుతాం. ప్రజల తరఫున చర్చిస్తాం. ప్రత్యేక హోదా కోసం జరిగే పోరాటానికి ఎమ్మెల్సీలుగా తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం. చట్టసభల్లోనూ దీన్ని లేవనెత్తడం ద్వారా ప్రభుత్వాలు చేస్తున్న మోసాల్ని ప్రజలకు వివరిస్తాం.

-ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

బిజెపి, టిడిపికి బుద్ధిచెప్పాలి

టిడిపి, బిజెపికి తగిన బుద్ధిచెప్పాలి. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారం వెలగబెడుతున్న పార్టీలు ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తున్నాయి. దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

-న్యూడెమోక్రసీ నాయకులు పొలారి, రామారావు

అబద్ధాలకు పరాకాష్ట

అబద్ధాలను పరాకాష్టకు తీసుకెళ్లారు. 20 రోజులుగా ప్రజలను మోసం చేస్తున్నారు. పచ్చి మోసకారులుగా మారారు. ప్రజలకు జరిగిన అన్యాయాలను రాష్ట్ర వ్యాప్తంగా వివరించాలి.

-ఎంఎల్ పార్టీ నాయకులు హరినాథ్

ఢిల్లీస్థాయిలో ఉద్యమం

కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీస్థాయిలో ఉద్యమం నిర్వహించాలి. దీనికి తమ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది. దీన్ని అంత తేలికగా తీసుకోకూడదు. గతంలోనే అనేక మోసాలు చేశారు. అయినా ప్రజలు సహనం పాటించారు. చూస్తూ ఊరుకుంటే ప్రజలు క్షమించరు.

-అమ్‌అద్మీ పార్టీ నాయకుడు పోతిన రామారావు

పోరాటాలకు సంపూర్ణ మద్దతు

ప్రత్యేక హోదా కోసం జరిగే పోరాటాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం నాయకుడు కృష్ణాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నాయకులు ఆమరయ్య తెలిపారు. అనేక పార్టీలు రాజీనామా విషయాన్ని ముందుకు తీసుకొచ్చిన నేపథ్యంలో ఉద్యమాన్ని వేగవంతం చేయాల్సిన అవసరముందని వారు పేర్కొన్నారు.

-ఎపిజెఎఫ్, ఎపిడబ్ల్యుజెఎఫ్

తెలివిగా మోసగిస్తున్నారు

మోడీ, చంద్రబాబు తెలివిగా ప్రజలను మోసం చేస్తున్నారు. ఇద్దరూ అధికారం పంచుకుంటూనే బయట నాటకాలాడుతున్నారు. దీన్ని బయటపెట్టాలి.

-లోక్‌సత్తా పార్టీ నాయకుడు బాబ్జి

బిజెపిని తరిమికొట్టాలి

బిజెపిని దేశం నుండి తరిమికొట్టాలి. ఏకపక్ష నిర్ణయాలతో ప్రజలను మోసం చేయడంలో బిజెపి ముందుంది. హోదా ఇవ్వకపోతే రాష్ట్రం నుండి, దేశం నుండి బిజెపిని తరిమికొట్టాల్సిన అవసరముంది.

-ముస్లిం లీగ్ నాయకులు అన్సారీ

కొవ్వొత్తులతో నిరసన

అలాగే లారీ యజమానుల సంఘం రాష్ట్ర నాయకులు వై.వి.ఈశ్వరరావు, ఎంసిపిఐయు నాయకులు, డివైఎఫ్ఐ నాయకుడు సూర్యారావు, పిడిఎస్‌యు నాయకుడు రవిచంద్ర, వికెపి పార్టీ నాయకుడు విద్యాసాగర్, నవతరం పార్టీ నాయకుడు కృష్ణారావు తదితరులు మాట్లాడారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు.

ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నాడు

ప్రత్యేక హోదా విషయంలో ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు గందరగోళానికి గురి చేస్తున్నాడు. తొలుత ప్రత్యేక హోదా పాట పాడాడు. తర్వాత ప్యాకేజీ అని దానికీ కట్టుబడి లేడు. రాష్ట్ర విభజన విషయం తనకు చెప్పకుండా చేశారని చంద్రబాబు ప్రకటించడం విడ్డూరంగా ఉంది. రాష్ట్ర విభజన చేయాలని రెండుసార్లు లేఖలిచ్చిన చంద్రబాబు ఇప్పుడు అబద్ధాలాడుతున్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయం వచ్చింది. పోరాటం చేయడం ద్వారానే అది సాధ్యమవుతుంది.

-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కేంద్రం మెడలు వంచాలి

కేంద్రం మెడలు వంచే విధంగా పోరాటాన్ని ఉధృతం చేయాలి. ప్రత్యేక హోదాను సాధించుకోవాలి. హోదా పోరాటానికి సమాజ్‌వాదీ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుంది. ఉత్తరప్రదేశ్ మాజీ సిఎం అఖిలేష్‌యాదవ్ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

- సమాజ్‌వాదీ నాయకులు జగదీష్‌యాదవ్

మోడీ మాట నిలబెట్టుకోవాలి

ఏపీ అభివృద్ధి చెందాలంటే ప్రత్యేకహోదా ఇవ్వాలని వెంకన్న సాక్షిగా చెప్పిన ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్ర ప్రజలందరినీ నమ్మించి మోసం చేశారు. విభజన హామీని విస్మరించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. ఐదుకోట్ల మంది ఆకాంక్ష అయిన హోదాపై కేంద్ర, రాష్ట్రాలు వేర్వేరు ప్రకటనలు చేస్తూ గందరగోళం సృష్టిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల్ని పక్కనపెట్టి అవాస్తవాలు ప్రకటిస్తున్నాయి. హోదా, విభజన హామీల విషయంలో టిడిపి, బిజెపి ఆడుతున్న నాటకంపై నిజానిజాలను త్వరలోనే పవన్‌కళ్యాణ్ బయటపెడతారు.

-జనసేన నాయకులు పోతిన మహేష్

మొదటి పేజీ తరువాయి

టిడిపి కలిసి వస్తే.. అవిశ్వాస తీర్మానం

పెట్టాలని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సలహా ఇస్తున్నారని.. ఆయన సలహా పాటించడానికి కూడా తాము సిద్ధమేనని అన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రతిపాదనకు 54 మంది ఎంపిల సంతకాలు అవసరమని, తమ పార్టీకి ఐదుగురు లోక్‌సభ సభ్యులే ఉన్నారని చెప్పారు. తమ ఎంపీలను చంద్రబాబు రూ.20 కోట్లు, రూ.30 కోట్లు ఇచ్చి కొనుగోలు చేశారని, అందువల్లే తమకు అవిశ్వాస తీర్మానానికి సరిపోయినంత మంది లేరని చెప్పారు. అందువల్ల పవన్ కళ్యాణ్ తమ భాగస్వామి అయిన చంద్రబాబును కూడా ఒప్పిస్తే ఇద్దరం కలిసి అవిశ్వాస తీర్మానం పెడతామని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తే తమ పార్టీ సభ్యులు మద్దతిస్తారని చెప్పారు. అలా కాక తమ పార్టీ సభ్యుల ప్రతిపాదనకు తెలుగుదేశం పార్టీ సభ్యులు మద్దతు పలికినా తమకు అంగీకారమేనని చెప్పారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ తీరు తెన్నులను జగన్ తీవ్రంగా దుయ్యబట్టారు. ఆయన చంద్రబాబుకు పార్టనర్ అన్నారు. చంద్రబాబు తాన అంటే పవన్‌కళ్యాణ్ తందాన అంటారని చెప్పారు. నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా విషయాన్ని చంద్రబాబు మరిచిపోయారని, ప్రత్యేక ప్యాకేజీ అద్భుతంగా ఉందని అన్నారని చెప్పారు. రాష్ట్రానికి నరేంద్ర మోడీ ఎంతో చేశారని కితాబులు ఇచ్చారని, ఎన్నికలు రాబోతున్న తరుణంలో డ్రామాలు మొదలు పెట్టారని విమర్శించారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఇప్పుడు మాట్లాడుతున్న చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న మంత్రులు క్యాబినెట్ సమావేశంలో బడ్జెట్‌కు ఎలా ఆమోదం తెలిపారని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రానికి అనేక ఉపయోగాలు జరుగుతాయన్నారు. ఇన్‌కంట్యాక్స్, జిఎస్‌టి, ఇతర ట్యాక్సులు రాష్ట్రానికి ఉండవన్నారు. దీంతో పరిశ్రమలు ఈ రాష్ట్రంలో పెట్టడానికి వ్యాపారులు ముందుకొస్తారని పేర్కొన్నారు. ప్రత్యేక ప్యాకేజీలో ట్యాక్సులు వసూలు చేయకుండా ఉండే వెసులుబాటంటూ ఏమీ లేదని చెప్పారు. రాష్ట్ర విభజన సందర్భంలో పది సంవత్సరాలు కాదు 15 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఆంధ్రాకి కావాలని రాజ్యసభలో వెంకయ్య నాయుడు అడిగారని గుర్తు చేశారు. బిజెపి నాయకులు మాట తప్పితే ప్రశ్నించాల్సింది పోయి వారికి శాలువాలు కప్పి సత్కరిస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం మార్చి 5 నుంచి వివిధ రూపాలలో వైసిపి ఎంపిలు ఢిల్లీలో పొరాటం చేస్తారని, ఏప్రిల్ 6న బడ్జెట్ సమావేశం చివరి రోజు పదవులకు రాజీనామా చేస్తారని ప్రకటించారు. సభలో ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి,. వైవి.సుబ్బారెడ్డి, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తూమాటి మాధవరావు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమే

చంద్రబాబుకు ఉందన్నారు. ఆదివారం విజయవాడలోని ఓ ప్రయివేటు హోటల్‌లో బిజెపి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం వీర్రాజు విలేకరులతో మాట్లాడుతూ ఏపీ అభివృద్ధిపై స్క్రిప్ట్ చదవాల్సిన అవసరం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబుకు లేదని, అది టిడిపి వాళ్లకే అలవాటన్నారు. వారు చదివిన దానిలోనే ప్రశ్నిస్తే తిరిగి జవాబు చెప్పలేరన్నారు. బిజెపి నేతలు అవినీతిపరులు కాదని, అభివృద్ధిని కోరుకునేవారని చెప్పారు. రాష్ట్రం విడిపోవడంవల్లే అభివృద్ధి జరిగిందన్నారు. ఏపీకి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తోందన్నారు. ఢిల్లీ లాంటి అభివృద్ధిని రాష్ట్రానికి అందించామన్నారు. హుదూద్ తుఫానుతో దెబ్బతిన్న విశాఖ నగరానికి కేంద్రం నిధులివ్వడం వల్లే బాగుపడిందన్నారు.

విమర్శలకు సమాధానమివ్వాలి : కంభంపాటి

రాష్ట్రానికి చాలా చేసినా బిజెపి పై విమర్శలు చేస్తున్నారని, వాటికి గట్టిగా సమాధానమివ్వాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు అన్నారు. ఆదివారం విజయవాడలో బిజెపి రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారంతో పనిచేస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.

విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామని, చట్టంలో చెప్పనివి కూడా కొన్ని చేశామని పేర్కొన్నారు. కేంద్రం ఏపీకి ఏంచేసిందో ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు సూచించారు. సమావేశం మధ్య విరామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రం రాష్ట్రానికి లక్ష కోట్ల విలువగల ప్రాజెక్టుల్ని మంజూరు చేసిందన్నారు. రాజధాని డిజైన్లు ఖరారు కాకుండానే అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.2500 కోట్లు ఇచ్చిందన్నారు. ప్రత్యేక హోదా వల్ల వచ్చే అదనపు 30 శాతం నిధుల్ని కూడా రాష్ట్రానికి ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక లోటు సుమారు రూ.20 వేల కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రైల్వేజోన్ ఏర్పాటుపై పలు అభ్యంతరాలొచ్చాయన్నారు. కడప ఉక్కు కర్మాగారం పై త్వరలోనే ప్రకటన చేస్తామన్నారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ బాబు, మంత్రి కామినేని శ్రీనివాస్, ఎంపి గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు, సీనియర్ నాయకులు పురంధేశ్వరి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో జరిగిన అంశాలపై విలేకరులకు వివరిస్తామని చెప్పిన బిజెపి నేతలు, విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పేదిలేదన్నారు.

బిజెపి అధ్యక్షుడిపై తిరుగుబాటు

మండిపడ్డారు. పార్టీని ఇబ్బంది పెట్టొద్దని దండాలు పెట్టారు. కొద్దిసేపు అరుపులు కేకలతో సమావేశం దద్దరిల్లిపోయింది. బిజెపి రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం ఐలాపురం కన్వెన్షన్ సెంటర్లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతుండగా బిజెపి నాయకుడు లక్ష్మీపతిరాజు మాట్లాడుతూ నాయకత్వం తీరుపై మండిపడ్డారు. రాష్ట్రంలో పార్టీని ఇబ్బందులు పెడుతున్నారని, పార్టీని రక్షించాలని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ప్రాపకం కోసం పాకులాడుతున్నారన్నారు. పదవుల్లో ఉన్న వారు వాటిని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారే తప్ప, పార్టీ కోసం పనిచేయడం లేదన్నారు. పలు జిల్లాలకు చెందిన నాయకులు కూడా ఆయనకు జత కలిశారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. ఎమ్మెల్సీలు మాధవ్, మంత్రి మాణిక్యాలరావు తదితరులు జోక్యం చేసుకుని వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. అయినా స్పందించలేదు. మాజీ మంత్రి పురంధరేశ్వరి కూడా నేరుగా జోక్యం చేసుకున్నా నాయకులు వినలేదు. పైగా అసహనం వ్యక్తం చేసిన నాయకులపై హరిబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇష్టం వచ్చినట్లు చేసుకుపోతే కుదరదని, పార్టీకి కట్టుబడి ఉండాలన్నారు. కిందిస్థాయి నాయకత్వం పార్టీకి కట్టుబడే ఉందని, పైస్థాయిలో నాయకులే టిడిపితో అంటకాగుతున్నారని ఆయన పేర్కొన్నారు.

కిందిస్థాయిలో తమను మాట్లాడనివ్వడం లేదని, ఇలాగైతే ఎలాగని వారు ప్రశ్నించారు. చివరకు విష్ణుకుమార్‌రాజు జోక్యం చేసుకోవడంతో వారందరూ శాంతించారు. అయితే తిరగబడ్డ నాయకత్వానికి సోము వీర్రాజు నాయకత్వం వహిస్తున్నారని, ఓ సామాజికవర్గానికి చెందిన నాయకులందరికీ హరిబాబు నాయకత్వం వహిస్తున్నారని, బిజెపి నేతలు సమావేశం అనంతరం వ్యాఖ్యానించారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడి తీరుపై తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు అవకాశం కల్పిస్తున్నారని, బిజెపి చేసిందేమిటో తమకూ చెబితే మాట్లాడేందుకు అవకాశముంటుందని పలువురు తెలిపారు.

హోదా, విభజన హామీల సాధనకు ఐక్య కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

జనసేన, కాంగ్రెస్, లోక్‌సత్తా, ఆప్, సమాజ్‌వాద్ పార్టీ, నవతరం పార్టీ, ఇండి యన్ యూనియన్ ముస్లింలీగు, ఉత్తరాంధ్ర చర్చావేదిక, బార్ కౌన్సిల్, లారీ ఓనర్స్ అసోసియేషన్స్, రైతుసంఘం, విసికె పార్టీలతో పాటు ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, విద్యార్థి, యువజన సంఘాలు, పలు ప్రజాసంఘాల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి, బిజెపి కలిసి రాష్ట్రాన్ని మోసం చేస్తున్నాయని, దీన్ని ఐక్యంగా ఎదుర్కోవాలని ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు నిర్ణయించారు. దీనికోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించారు.

నేటి నుండి రౌండ్‌టేబుల్ సమావేశాలు

మార్చి ఒకటో తేదీన గుంటూరులో ప్రత్యేక హోదా విభజన హామీలపై సదస్సు నిర్వహించాలని, ఈనెల 19 నుండి మార్చి ఒకటోతేదీలోపు అన్ని జిల్లా కేంద్రాల్లోనూ రౌండ్‌టేబుల్ సమావేశాల్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నెల 21న విజయవాడలో ఉద్యమాల గీతాలను ఆవిష్కరించనున్నారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మార్చి ఒకటోతేదీలోపు యూనివర్శిటీల్లో విద్యార్థులతో ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు అంశంపై సదస్సులు నిర్వహించాలని నిర్ణయించారు. మార్చి 2,3,4 తేదీల్లో జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో దీక్షలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దీనిలో అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. మార్చి5 నుండి ఢిల్లీలో పార్లమెంటు ముందు నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. దీంతోపాటు వివిధ సంఘాలు, పార్టీలు ఇచ్చిన ఆందోళనలకు ఉమ్మడిగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు.

పలు సంఘాలకు మద్దతు

ఈనెల 19న ఒంగోలులో ఎపిజెఎఫ్ నిర్వహించనున్న దీక్షకు, అలాగే ఈనెల 19 నుండి 28 వరకు కాంగ్రెస్ ఆత్మగౌరవ దీక్షలకు, 21న ఎపిడబ్ల్యుజెఎఫ్ నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి, 25న చెన్నైలో ఎపిజెఎఫ్ నిర్వహించనున్న అవగాహనా సదస్సుకు మద్దతు ప్రకటించారు. 28న కర్నాటకలో ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అవగాహనా సదస్సుకూ మద్దతిచ్చారు.

దీంతోపాటు మార్చి ఒకటోతేదీన వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న కలెక్టరేట్ల ముందు ధర్నాకు మద్దతిచ్చారు. మార్చి 4న విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యాన విశాఖబీచ్‌లో నిర్వహించనున్న కొవ్వొత్తుల ర్యాలీ, మార్చి5 నుండి 10 వరకు ఢిల్లీలో జరిగే పార్లమెంటు ముట్టడి, అదేరోజు ఢిల్లీలో వైసిపి నిర్వహించే ధర్నా కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. మార్చి 6,7 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో చేపట్టిన దీక్షకు, 8న నిర్వహించనున్న చలో పార్లమెంటుకూ మద్దతిచ్చారు. మార్చి 17న వికెసి పార్టీ అమలాపురంలో నిర్వహించనున్న చలో అమలాపురం కార్యక్రామనికి, ఏప్రిల్ 20న రాజమండ్రిలో జరిగే బహిరంగసభకూ ఐక్యంగా మద్దతు ప్రకటించారు.

జల్లికట్టులో అపశృతి

ఎద్దు పొడిచి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వికోట

మండల పరిధిలోని చింతమాకులపల్లిలో ఆదివారం నిర్వహించిన జల్లికట్టులో అపశృతి చోటుచేసుకుంది. జల్లికట్టులో గాయపడిన వ్యక్తి మృతి చెందడంలో గ్రామంలో విషాదం నెలకొంది. స్థానికుల కథనం మేరకు.. చింతమాకులపల్లి గ్రామస్తులు ఆదివారం జల్లికట్టును నిర్వహించారు. గోనుమాకులపల్లికి చెందిన మునెప్ప(65) ఎద్దుల పండగను ముగించుకొని వెళ్తుండగా ప్రమాదవశాత్తూ ఓ ఎద్దు మునెప్పను గాయపరిచింది. చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం కుప్పం మెడికల్ కళాశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మునెప్ప మృతి చెందాడు. మృతిచెందిన మునెప్పకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అదేవిధంగా తమిళనాడుకు చెందిన సురేష్(40)కు కూడా గాయాలయ్యాయి. పండగ పూట గ్రామంలో ఇటువంటి సంఘటన చోటుచేసుకోవడంతో విషాదం నెలకొంది.

కడప జిల్లాలో ఘోర అగ్ని ప్రమాదం

అగ్నికి ఆహుతైన 200 గొర్రెపిల్లలు

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా కత్తులూరులో ఆదివారం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. చేను గట్టుకు అగ్గి పెట్టడంతో గాలికి గొర్ల దొడ్డి అంటుకుంది. ఈ ప్రమాదంలో రెండు వందల గొర్రె పిల్లలు అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు ఎనిమిది లక్షల నష్టం వాటిల్లిందని తెలిపిన గొర్రె పిల్లల యజమానులు వాపోయారు. బాధితులు వేంపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్నిగుండంలో పడి ఇద్దరికి గాయాలు


ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని వీరభద్రస్వామి దేవస్థానం ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రమాదవశాత్తు ఇద్దరు మహిళలు పడి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా వీరభద్రస్వామి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా రథోత్సవం, మహానైవేద్యం, అగ్నిగుండం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అగ్నిగుండంలో నడిస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మొక్కుబడి ఉన్న భక్తులు అగ్నిగుండంలో నడిచేందుకు పోటీలు పడతారు. ఈ క్రమంలోనే అగ్నిగుండంలో నడిచేందుకు భక్తులు పోటీపడ్డారు. ఎక్కువ మంది అగ్నిగుండంలోకి దిగారు. వీరిలో రాయచోటి టౌన్ కొత్తపేటకు చెందిన రామాంజులమ్మ, పాత రాయచోటికి చెందిన లక్ష్మీదేవి ఉన్నారు. అయితే ఎక్కువ మంది ఉండడంతో వీరు వేగంగా నడుస్తూ అదుపు తప్పి కిందపడ్డారు. సమీపంలో ఉన్న ఇద్దరు పోలీసులు వీరిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అప్పటికే మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామాంజులమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు తిరుపతికి తరలించారు.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 19 ఫిబ్రవరి 2018



మారుతున్న కాలానికి అనుగుణంగా సాహిత్యమూ మారాలి. పాతకాలపు సాహిత్య పద్ధతులకే కట్టుబడి ఉండడమంటే- అది సమాజానికి ద్రోహం చేయటమే!

– కొడవటిగంటి కుటుంబరావు



నవ్వ లేని పువ్వు

రంగు రంగుల పువ్వులు తెచ్చి
ఒడిలో కుమ్మరించాడతడు
ఏమిటన్నట్లు అతడి కళ్లలోకి చూసిందామె
తలలో పెట్టుకోమన్నట్టు స్పష్టత
కనిపించింది ఆ చూపులో ..

తలలో తురుముకుంటాను సరే
ఆప్యాయంగా నా తలనెప్పుడైనా నిమిరావా?
నా కళ్లలో భావాలను చదవగలిగావా?
కంటి చివరి తడిని స్ప శించావా ?
ఎన్నో ప్రశ్నలు ఆమె మదిలో ...

గుండె తడిని పంచుకోలేని బంధాలు
తృటిలో తెగిపోతాయని తెలియదనుకుంటా
తనకై త్యజించిన చిన్న చిన్న కోర్కెలు
మరెన్నో ఆశలు .. ఆశయాలు
తన కోసం మానసికంగా మరణించిన క్షణాలవి!

ఆ క్షణంలో ఒడిలో పువ్వులన్నీ
తనని ఎగతాళి చేసినట్టనిపించింది
ఒక్క ఉదుటున లేచి ఆ పువ్వులన్నింటినీ
తాను కొలిచే దైవానికి అర్పించుకుంది
రాతిబొమ్మలా నిలబడిపోయాడు అతడు
జీవితంలో తొలిసారి మనసు చెప్పిననట్టు విన్నానన్న
ఆనందంతో ఆమె కళ్లు ..!

– వైష్ణవిశ్రీ
8074210263



అలజడి

సహచరుడా! గమనించు
కాలంలో ఓ అలజడి!
తరతరాల జాతిగీతి
గానంలో ఓ అపశృతి!

వేకువ ఝాముల్లోనే
వికృత తీతువు కూతలు!
పగలే నక్కల ఊళలు
తుళ్లిపడిన పనివేళలు!
సహచరుడా! గమనించు

చెమటపూల పరిమళాలు
చెరిపేసే ప్రయత్నాలు!
నీ జీవన సౌందర్యం
దగ్ధం చేసే వ్యూహం!
చిత్రంగా పూర్వీకుల
వేల గొంతులోని జీర!
కాళ్లకు తడి అంటకుండ
కదులుతున్న ద్రోహధార!
సహచరుడా! గమనించు

నిర్మించిన పరిశ్రమన
అర్పించిన నీ శ్రమనూ..
పెద్దనోట్ల రద్దీలో
పలికే వేలం పాట!
సహచరుడా! గమనించు

కమ్ముతోంది 'పగ'మబ్బు,
చూడూ! కార్మికవాడను..
కుటుంబాల నెత్తిమీద,
కాలిపోతోంది నీడ!
సహచరుడా! గమనించు..

ఇంటిముందు రుణమేదో!
దారుణ సంభాషణ!!
వంటగదిలో శవమేదో!
కాలుతున్న వాసన!!
సహచరుడా! గమనించు

పరాధీన అవుతున్న
పబ్లిక్ సెక్టారు తల్లి!
కన్నీటితో రాస్తున్నది
కడసారిగా ఒక లేఖ!!
సహచరుడా! గమనించు..


నగదు రహిత చెల్లింపులు!
నల్లడబ్బు మళ్లింపులు!
షేర్ల మార్కెట్లలోన,
బార్లా తెరిచిరి తలుపులు!
సహచరుడా! గమనించు

యంత్రాల గొంతుల్లో
ఏవేవో, వెక్కిళ్లు
సైరన్ మోగకముందే
బిగిస్తున్న పిడికిళ్లు!
సహచరుడా! గమనించు

– నల్లి ధర్మారావు
73968 16430

జీవితంలోంచే కథ పుడుతుంది!

ప్రసిద్ధ కథా రచయిత పెద్దిబొట్ల సుబ్బరామయ్య



కథ ఎలా పుడుతుంది? అనే ప్రశ్నకు ఓ పెద్ద కథ అంత జవాబు ఉంటుంది. కథ రాయడం అంటే అదొక ప్రసవ వేదన పడడం లాంటిదే! ఒక రచయిత మస్తిస్కంలో కొన్ని వందల వేల ఆలోచనలు సంఘర్షిస్తూ ఉంటాయి. ఆ సంఘర్షణలోంచి ఒక కథగా మారటం రచయితకు పెద్ద ప్రక్రియే! అనేక జీవిత పార్శ్వాలను ఎన్నో అద్భుతమైన కథలను అందించారు ప్రముఖ రచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య. అభ్యుదయ చింతనతో తనకు తెలిసిన మధ్యతరగతి జీవితంతోపాటు, బాధ్యతాయుతంగా తాను పరిశీలించిన కింది తరగతి జీవితాలను కూడా కథలుగా మలిచారు. విజయవాడలో విశ్రాంత జీవితం గడుపుతున్న ఆయన ప్రజాశక్తి అక్షరం ముచ్చటించింది. ఆ కబుర్ల సమాహారం ఇది.

సంభాషణ

పెద్దిబొట్ల సుబ్బరామయ్య రచించిన ప్రతి కథలోనూ విజయం దగ్గరకు వెళ్లి చేజార్చుకున్న నిర్భాగ్యులు, చేతికందినా అది అనుభవించే లోపు కాలం చేసిన అభాగ్యులూ, మంచి మనసున్నందున బాధపడే మనుషులూ, విధి చేతికి చిక్కిన అమాయక ప్రజలువంటి పాత్రలే మనల్ని పలకరిస్తుంటాయి. ఆయన కథలన్నీ పాఠకులు పరకాయ ప్రవేశం చేసి చదివించేలా ఉంటాయి. అందుకే తాను మధ్య తరగతి ప్రజలకు దగ్గరయ్యానంటారాయన. సమాజం ఎలా ఉంది?

సమాజంలోని మనుషులు ఎలా ఉన్నారు? ఏఏ సంబంధాలూ మార్పులూ ఏఏ పరిణామాలకు దారి తీస్తున్నాయి? రచయిత ఇవన్నీ నిశితంగా పరిశీలించాలని చెబుతారు సుబ్బరామయ్య. కథ మన చుట్టూ ఉన్న జీవితం నుంచే వస్తుందంటారాయన. మనం రోడ్డుమీద వెళుతుంటే అక్కడ ప్రమాదం జరిగిందనుకుందాం. ఆ సంఘటనా స్థలంలో కొందరు చూసిచూడనట్లు వెళతారు. మరికొందరు అయ్యో! అంటూ వెళతారు. కానీ ఇంకొందరు దగ్గరుండి ఏమి జరిగింది అని పరిశీలించి చూస్తారు. అలాంటి వారే కథా రచయిత అవుతారంటారాయన. ఒక సంఘటనను తాను అనుభవించి, మెరికల్లాంటి పదాలతో ఇతరులు కూడా అనుభవించేలా చేస్తారో వారే కథా రచయితగా విజయం పొందుతారంటారు. ఇంకా ఆయన మాటల్లో ...

మొదటి కథ ఇలా ...

విజయవాడలో మా ఇంట్లో అద్దెకుండే వారి ఇంటికి చుట్టాలమ్మాయి వచ్చింది. ఆమెకు చీర పెట్టడం కోసం మా అమ్మ దగ్గర 20 రూపాయలను అప్పుగా తీసుకొని గడువు పెట్టింది. ఆ గడువు ముగిసేలోపు మరొకరి దగ్గర రుణం తీసుకొని అమ్మకు తిరిగిచ్చింది. వాళ్లకు తీర్చడం కోసం ఇంకొకరి దగ్గర అప్పు తీసుకుంది. అలా ఆమె చివరకు మరలా కొద్ది రోజుల్లోనే అమ్మ దగ్గరకు 20 రూపాయల బదులు కోసం వచ్చింది. నాకు ఆమె చేసే పని చాలా గమ్మత్తుగా అనిపించింది. వెంటనే పెన్ను, పేపరు తీసుకొని ఆమె ఏదైతే చేసిందో దానినే కథలా రాశా. ఆ కథకు 'చక్రనేమి' అని పేరు పెట్టా. అది 1959లో ఆంధ్రపత్రికలో ప్రచురితమయ్యింది. అదే నా మొదటి కథ.

కాలేజీ రోజుల్లో నేనూ, నా స్నేహితుడు కలిసి ఒకే రూమ్‌లో ఉండేవాళ్లం. ఒకరోజు అతను సామాను తీసుకొనివచ్చి ఆతృతగా ఇంగువ అంటే ఏమిటో తెలుసా? అని అడగ్గా తెలియదని చెప్పా. తర్వాత పై చదువుల కోసం చెరో ఊరు వెళ్లాం. ఆరేళ్ల తర్వాత ఒక పెళ్లిలో కలిశాం. నన్ను చూడగానే 'ఇంగువ' అంటే ఏమిటో తెలిసిందా.. అని అడిగాడు. ఇన్నేళ్లయినా ఇంకా అది గుర్తుందా.. నేను మరచిపోయా.. అందుకే తెలుసుకోలేదు అన్నా. మరలా రెండేళ్ల తర్వాత ఒకరోజు అనుకోకుండా ట్రైన్‌లో కలిశాం. అప్పుడు కూడా 'ఇంగువ' అంటే తెలిసిందా! అని అడిగాడు. అప్పటికీ నాకు తెలియదు. దీంతో ఇంగువ అంటే ఏమిటో తెలుసుకోవాలనే తపనే నా కథావస్తువుగా మారి 'ఇంగువ' కథ రాశా.

అలా పది, పదిహేను కథలు రాసిన తర్వాత 'నీళు' కథ రాశా. నా స్నేహితుడు ఒకాయన ఉద్యోగం వెతుకులాటలో ఉన్న ఒకతనికి మాఇంట్లో ఆతిథ్యం ఇవ్వమని ఒంగోలు నుంచి పంపారు. అప్పట్లో ఒంగోలులో నీళ్ల ఎద్దడి తీవ్రంగా ఉండేది. మాకు విజయవాడలో నీళ్లు పుష్కలంగా ఉండేవి. నీళ్లకోసం వారు పడే పాట్లు గురించి నాకు అతను తరచుగా చెప్తుండేవాడు. ఒకరోజు మేం ప్రకాశం బ్యారేజీ దగ్గరకు వెళ్లినపుడు మా మధ్య జరిగిన సంభాషణ నుంచి వచ్చిందే నీళ్ల కథ. ఆ కథకు నాకు మంచిపేరు వచ్చింది. అప్పట్లో అందరూ నన్ను 'నీళ్ల సుబ్బరామయ్య' అని పిలిచేవారు. ఆ కథ చదివిన విశ్వనాథ సత్యనారాయణగారు నీవు ఎప్పటికైనా మంచి స్థాయిలోకి వస్తావని ఆశీర్వదించారు.

ఒకరోజు నేను దారిన వెళుతుంటే– ఒక తమిళ అమ్మాయి భర్త శవం దగ్గర కూర్చుని ఏడుస్తోంది. ఆమెకు భాష రాదు. నా అనేవాళ్లు లేరు. అలాంటి స్థితిలో ఒక వ్యక్తి ఆమెకు తన ఇంటిలో ఆశ్రయమిచ్చి, వాళ్ల పుట్టింటి వారు వచ్చిన తర్వాత ఆమెను అప్పగించారు. ఆ సంఘటనలో నుంచి వచ్చిందే 'ముసురు' కథ.

సాహిత్యేతర విషయాలు ఎక్కువగా మాట్లాడటానికి కారణం?

నాకు తెలుగుతో విడదీయరాని అనుబంధం ఉంది. అయినా సాహిత్యేతర విషయాలే ఎక్కువగా మాట్లాడడం అలవాటు. నా చుట్టూ జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధి, టెక్నాలజీ పేరుతో జరిగే విధ్వంసకాండను విస్మరించి పాతకాలం విషయాలను ఎలా చెప్పగలను? నేటి సమాజంలో సగటు మనిషి ఎన్నో ఇబ్బందులు పడుతున్నాడు. అభివృద్ధి పేరుతో అపార్ట్‌మెంట్ కల్చర్ వచ్చింది. ఒకప్పుడు మనుషులు దూరంగా ఉండేవారు. వారిమధ్య ప్రేమానురాగాలు ఉండేవి. నేడు మనుషులు దగ్గరైనా వారి మధ్య దూరాలు పెరిగిపోయాయి. మానవ సంబంధాలు ఎక్కడ కనుమరుగవుతాయోనని ఆందోళన చెందుతున్నా.

మీ కథలపై విమర్శలను ఎలా స్వీకరించారు?

కొందరు నావి ఏడుపుగొట్టు కథలని విమర్శించారు. నా కథలన్నీ విషాదంతోనే ముగుస్తాయని, సుబ్బరామయ్య ఉత్సవ వైభవం వైపు చూడరన్నవాళ్లు కూడా ఉన్నారు. అందుకు కొన్ని కారణాలున్నాయి.. నాకు ఐదేళ్ల వయస్సున్నప్పుడు మా నాన్న లంక కోడేరులో రైల్వే స్టేషన్ మాస్టారుగా పనిచేస్తున్నారు. అక్కడ పోర్టర్ పెద్ద కొడుకు రాముడు, నేను మంచి స్నేహితులం. ఒకరోజు ఇద్దరం రైల్వేట్రాక్ పక్కన నడుస్తున్నాం. గేదెలు అక్కడున్న కాలువ అవతలికి వెళ్లాయి. 'నేను తోలివస్తా.. నీవు ఇక్కడే ఉండు' అని చెప్పి ఆ అబ్బాయి వెళ్లాడు. రాత్రయినా రాలేదు. కాలువంతా వెతికిన తర్వాత వాళ్ల నాన్న చేతులకే అతని శవం దొరికింది. అది నా మనస్సులో అలాగే ముద్రపడిపోయింది. మా నాన్న హఠాన్మరణం చెందగా, మరికొన్ని నెలలకే అన్న, పినతల్లి ఇలా ఆత్మీయులంతా దూరమయ్యారు. నా కథలు విషాదంతో ముగియడానికి ఇవి కూడా కారణాలు కావొచ్చు.

భావి తరాలకు మీరేమి చెబుతారు?

మన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి, ఆ సంఘటనలను తమవిగా చేసుకోవాలి. అవే సంఘటనలను ఇతరులు వారివిగా భావించేలా రాయగలగాలి. అలా రాస్తేనే కథా సాహిత్యానికి అర్థం. ప్రజల్లో నెలకొనిఉన్న అసంతృప్తే మన కథలకు కథా వస్తువు. ప్రస్తుతం రచయితల్లో కూడా చీలికలు వచ్చాయి. కొందరు స్త్రీవాద కవిత్వం, మతాలకు సంబంధించిన కవిత్వం అంటూ రాస్తున్నారు. మరికొందరు ఉద్యమ కథలను రాస్తున్నారు. ఇంకొందరైతే అశ్లీలాన్ని ప్రజల్లోకి పంపుతున్నారు. ఇది చాలా బాధాకరమైన విషయం.

లయోలా కాలేజీతో మీ అనుబంధం?


లయోలా కాలేజీతో నా అనుబంధం మాటల్లో చెప్పలేను. 1956లో నేను ఆ కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా చేరాను. నలభై సంవత్సరాలు అక్కడే పనిచేశాను. ఆ కాలేజీ క్యాంపస్ అంటే నాకు చాలా ఇష్టం.

సుబ్బరామయ్య తల్లితండ్రులు కృష్ణశాస్త్రి. తల్లి వెంకట సుబ్బమ్మ. తండ్రి రైల్వే స్టేషను మాస్టర్‌గా పనిచేసేవారు. డిసెంబరు 15, 1938న ఆయన గుంటూరులో జన్మించారు. ఒంగోలులో విద్యాభ్యాసం చేశారు. కళాశాల విద్యను విజయవాడ ఎస్ఎస్ఆర్ అండ్ సివిఆర్ కాలేజీలో చదివారు. ఆ కాలంలోనే ప్రముఖ రచయిత విశ్వనాథ సత్యనారాయణ గారితో అనుబంధం ఏర్పడింది.

సంభాషణ : స్వర్ణలత నూకరాజు

తోటమాలి పెంచిన పుస్తకాల తోట

పుస్తకం



మా గుంటూరు రాజధాని కాక పూర్వం నుంచి ఇక్కడ కొచ్చిన మిత్రులు 'మీ ఊళ్లో చూడ్డానికే మున్నాయి?' అని అడిగి తే ఏమీ లేవని చెప్పటానికి చాలా బిడియంగా ఉండేది. 'పలుకు లమ్మ తోటమాలి' అనే పుస్తకం చూశాక ఇంత బాగా తెలిసిన వ్యక్తి, ఆయన ఇల్లు గుర్తు రాకపోవడం సిగ్గనిపిస్తుంది. పైగా అలా అడిగిన వారంతా సాహిత్య ప్రియులు, పుస్తక నేస్తాలే!

పుస్తకాలకు సంబంధించిన క్రియల్లో అంటే రాయటం, చదవటం, సేకరించటం, దాయటం లాంటి విషయాల్లో దాయ టమే సంక్లిష్టమైంది. వందల నుంచి 10 వేల లోపు పుస్తకా లుండే వారు మనలో చాలామంది ఉంటారు. మా జిల్లాలో ఒక ప్రముఖ వ్యక్తి ఇంట్లో పుస్తకాలకు చెదలపడితే వాళ్లావిడ 'అమ్మయ్య దరిద్ర మొదిలింద'ని సంతోషపడటం చూశాను. తరిమెల నాగిరెడ్డి గారి పేరుతో అనంతపురంలో గ్రంథాలయం పెడుతుంటే అప్పటికి నా దగ్గరున్న కొన్ని వేల పుస్తకాలు, పత్రికలు వారికి విరాళంగా ఇచ్చాను. ఇక్కడ కూడా నాగిరెడ్డి గారి మీద ప్రేమ కన్నా మా అమ్మ బాధ వదిలించుకోవటం మొగ్గు చూపిందేమో అని ఇప్పుడు అనుమానం వస్తుంది.

ఇలాంటి వాతావరణంలో లక్ష పుస్తకాలు మూడు, నాలుగు లక్షల కటింగ్స్ సేకరించి దాయగలగటం ఒక సాదాసీదా గృహస్థుకు సాధ్యమైందంటే నమ్మటమే కష్టం. అందులోనూ ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఉద్యోగం బదిలీ అయినప్పుడల్లా ఇంట్లోని తట్టా బుట్టలతోపాటు ఈ పుస్తకాల కట్టలు తరలిం చటం అనూహ్యంగా ఉంది. ఈ విషయంలో తోటమాలి లంకా సూర్యనారాయణతో పాటు వారి సహచరి వరలక్ష్మి , ఇతర కుటుంబ సభ్యులూ అభినందనీయులు.

తెలుగు రాష్ట్రాల్లో వ్యక్తిగత గ్రంథాలయాలు పెద్దవిగా కలిగివున్న వారి పేర్లు గతంలో ఓ నాలుగైదు చెప్పేవారు. వారు ఆరుద్ర, నార్ల వెంకటేశ్వరరావు, సినీనటులు కొంగర జగ్గయ్య, సివిఎన్.ధన్ (విద్యావేత్త, గుంటూరు), లంకా సూర్యనారాయణ (గుంటూరు). ఇందులో ఆరుద్ర గారిది హైదరాబాద్‌లోని సుంద రయ్య విజ్ఞాన కేంద్రానికి, నార్ల గారిది హైదరాబాద్‌లోని తత్వశాస్త్ర పరిశోధనా కేంద్రానికి చేరగా జగ్గయ్య గారిది మద్రాసులోనూ, ధన్ గారిది గుంటూరులోనూ ఉన్నాయి. వీటన్నింటితో పోల్చుకుంటే లంకా సూర్యనారాయణ గారి సేకరణలో ఒక విశిష్టత ఉంది. ఆయనో సామాన్య ప్రభుత్వ ఉద్యోగి, తరుచూ ఒక ఊరి నుంచి మరో ఊరికి బదిలీ అవుతూ లక్షకు పైగా పుస్తకాల్ని, 4 లక్షల కటింగ్స్, అనేక జర్నల్స్‌ని తమ తట్టాబుట్టల్లో భాగం చేయటం ఒక అపూర్వ విషయంగా కన్పి స్తుంది. పైగా ఇందుల్లో ఒక్కటి కూడా సొంత జేబుని ఉపయో గించకుండా సేకరించినది లేదు. సంగ్రహించినవి లేవు. చదువు కొని ఇస్తానని ఉంచుకున్నవి లేవు. భగవద్గీత 500 రకాలు, భాగవతం 300, భారతం 100, రామాయణం 500, నవ్య కవితా సంకలనాలు 3000, శతకాలు 1500, జీవిత చరిత్రలు 5000... ఈయన సేకరణలో మచ్చుకు కొన్ని వివరాలివి.

ఇలాటి అపురూప సేకరణ గావించిన గొప్ప వ్యక్తికి వారి కుటుంబ సభ్యులు, మిత్రులు గావించిన అభినందన ఈ పుస్తకం. మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో వెలువరించిన 'పలుకులమ్మ తోటమాలి' అనే ఈ పుస్తకం 51 వ్యాసాల సంకలనం. ఇందులో ఆయన్ను గురించి 3 కవితలు, మరో 10 చిన్న వ్యాసాలు ఉన్నాయి. మిగిలిన 38 వ్యాసాలు సాహిత్య, సామాజిక రంగంలో అత్యంత విశిష్టమైన శ్రీశ్రీ, శ్రీ రమణ, సత్యం శంకరమంచి, నార్ల, సి.సుబ్బారావు, తిరుమల రామచంద్ర, కాటూరి, జరుక్‌శాస్త్రి, నండూరి రామమోహనరావు లాంటి వారు రాసినవి ఉన్నాయి. ఈ వ్యాసాల్లో సుల్తాన్ బజార్‌లోని వెంకటరావు హోటల్లో, గౌలిగూడలోని సుబ్బారావు హోటల్లో దోసె అణా, చాయ్ అణా, పుస్తకం అణా బోర్డుల్ని, అణా గ్రంథమాలని, 1468లో బెనారస్‌లో ముద్రించిన తొలి కాగితం పుస్తకాన్ని తెలుసుకోవచ్చు. కృష్ణయ్యర్ బాదం హల్వాతిన్న భోక్తల గురించి, ఘూర్జరీతోడి, లాచరీతోడి, భూపాల్‌తోడి రాగాల్ని ఆస్వాదించవచ్చు. లంకా సూర్యనారాయణ 'బతుకు కల్లు పాక' కావటాన్ని భార్గవి, కప్పురపు విడెమై, అట్లతద్దె గోరింట లా ఎర్రగా పండటాన్ని శ్రీరమణ దర్శించారు, పరిశోధకులకు 'కంకులకున్న తంగెడి జన్నుగా, పండిన పెరటి కల్పకం'లా ఉంటుందని శెట్లం చంద్రమోహన్ భావించారు. చెళ్లపిళ్ల గారి ఉపన్యాస ధోరణిని చలవ పందిళ్లు కప్పించినట్లు, చల్లగాలి విసిరినట్లు పన్నీటి జల్లులు కురిసినట్లు మనోరంజకంగా, వసంత వినువీధుల్లో తిప్పి తీసుకొచ్చినట్లు కాటూరి అభివర్ణన పాఠకులపై పన్నీరు జల్లు కురిపిస్తాయి. ఈ పుస్తకం చదివిన వారు లంకా గారి వ్యక్తిత్వం గురించి, ఆయన స్థాయి గురించి ఒక అవగాహన కొస్తారు. లంకా సూర్యనారాయణది గుంటూరు జిల్లా పెద్ద గొట్టిపాడు. సెంట్రల్ ఎక్సయిజ్‌శాఖలో 1956లో చేరి 1952లో ఉద్యోగ విరమణ గావించారు. వెల్దుర్తి, బనగాన పల్లి, తాడిపర్తి, గిద్దలూరు, అలంపూర్, హైదరాబాద్, ఏలూరు, గుంటూ రుల్లో పనిచేశారు. సినిమాల్లో, సీరియల్స్‌లో కనపడే మంచి కుటుంబాల్లాంటి కుటుంబం వీరిది. చివరకు వీరి పుస్తకాలతో గుంటూరు వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కట్టించిన అన్నమయ్య గ్రంథాలయం ఏర్పరిచారు. వీరి దగ్గరున్న గ్రంథాలకు పరిమితమై కనీసం వంద పరిశోధనా పత్రాలతో డాక్టరేట్‌లు పొందవచ్చు. ఇంత కృషి తర్వాత కూడా ఆదివారం ఆయన్ని పట్టుకోవాలంటే గుంటూరు పేవ్‌మెంట్లపైన సెకండు హ్యాండ్ పుస్తకాలమ్మే దుకాణాల దగ్గర వెతుక్కోవాల్సిందే. పూర్వం లాగా గుంటూరు శంకర విలాస్ సెంటర్, విజయవాడ గాంధీనగర్ పేవ్‌మెంట్లు, హైదరాబాద్ కోఠి ఆంధ్రా బ్యాంకు వీధి సెకండ్‌హ్యాండ్ పుస్తకాల దుకాణాలైతే ఉంటున్నాయి కాని అక్కడ అన్నీ విద్యా ర్థుల టెక్ట్స్ పుస్తకాలే తప్ప గతం లాగా అపురూప పుస్తకాలు మచ్చుకైనా దొరకటం లేదు. అయినా సంవత్సరానికి ఒకటో ఆరో దొరికే పుస్తకాల కోసం లంకా గారి లాంటి విక్రమార్కులు ప్రయత్నిస్తూనే ఉంటారు. ఆయన కృషిని సమగ్రంగా ఆవిష్కరించిన పుస్తకం ఇది. 241 పేజీల రాయల్ డెమ్మీ బైండింగ్‌తో, ఇంకా అనేక చిత్రాలతో అందంగా అచ్చయిన ఈ పుస్తకం లిమిటెడ్ కాపీలు విశా లాంధ్రలోనూ, కావాలనుకున్నవారు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయం నుంచీ పొందవచ్చు.

– చెరుకూరి సత్యనారాయణ
9848664587

సమాచారం

కొలకలూరి సాహిత్య పురస్కారాలు- 2018

2018 సంవత్సరానికిగానూ కొలకలూరి సాహిత్య పురస్కార విజేతలను ప్రకటించారు.

1. కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం : అంకం లింగమూర్తి ('అమ్మ- నాన్న' నాటికల సంపుటి రూ.10,000), జీడి గుంట రామచంద్రమూర్తి (మూడు నాటికలు' నాటికల సంపుటి రూ.5,000).

2. కొలకలూరి భాగీరథి కవితా పుర స్కారం : ఈతకోట సుబ్బారావు (కాకిముద్ద, కవితా సంపుటి రూ.10,000), అడిగోపుల వెంకటరత్నం (ముందడుగు' కవితా సంపుటి రూ.5,000). ఈ పురస్కారాలు ఈ నెల 26న సాయంత్రం 6 గంటలకు తెలుగు విశ్వవిద్యా లయం, హైదరాబాద్, ఎన్‌టిఆర్ కళా ప్రాంగ ణంలో జరిగే సభలో ప్రదానం చేస్తాము.

– కొలకలూరి మధుజ్యోతి
94419 23172

25 నుంచి 'వెయ్యి కవితల పండుగ'

స్వచ్ఛంద సేవాసంస్థ తెలుగు లోగిలి ఛైర్మన్ డాక్టర్ పేర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, సాహితీవేత్త బిక్కి కృష్ణ సారధ్యంలో, మల్లెతీగ కలిమిశ్రీ సమన్వయంలో ఈనెల 25, 26, 27 తేదీల్లో కృష్ణా జిల్లా అవనిగడ్డలోని బాలికోన్నత పాఠశాలలో 'సహస్ర కవిసమ్మేళనం – వెయ్యి కవితల పండుగ' జరగనుంది. పేర్లు నమోదు చేసు కున్న కవులందరికీ ఏర్పాట్లు పూర్తి చేశాం. అందరం కలిసి ఆహ్లాదకర వాతావరణంలో, ప్రకృతి రమణీ యతల మధ్య కవితల పండుగ జరుపుకుందాం. హాజరైన కవులందరికీ భోజన, రవాణా సదుపా యాలను ఏర్పాటు చేస్తోంది 'తెలుగు లోగిలి'.

– కలిమిశ్రీ

సలీం సాహిత్యంపై జాతీయ సదస్సు

ఈ నెల 22, 23 తేదీల్లో కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో 180 సెమినార్ హాల్లో ప్రసిద్ధ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పుస్కార గ్రహీత శ్రీ సయ్యద్ సలీం సాహిత్యంపై జాతీయ సదస్సు జరుగుతుంది. యోగి వేమన విశ్వవిద్యాల యం తెలుగుశాఖ, శశిశ్రీ స్మారక సమితి సంయు క్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. భారతీయ సమాజం మరింత ప్రజాస్వామ్య దేశంగా రూపుదిద్దు కోవా లన్న ఆకాంక్షతో సలీం తమ రచనల్లో సామా జిక, వైజ్ఞానిక, అంశాలను నిక్షిప్తం చేసి సాహిత్య సృష్టి చేస్తున్నారు. ఆయన సాహిత్యాన్ని రాయలసీమ ప్రాంత వాసులకు పరిచయం చేయాలన్న సంకల్పంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ తాప్పెట రామప్రసాదరెడ్డి, 94405 31520
ఎస్.మస్తాన్ వలి, 97040 73044

ప్రజాశక్తి
jeevanapageps@gmail.com
జీవన the fa
JEEVANA

లెహంగా చందమామలు



చిట్టితల్లులకు రోజుకో కొత్త మోడల్ డ్రెస్‌లు వస్తున్నాయి. షార్ట్స్, జీన్స్, లెగ్ఇన్స్ ఇలా ఎన్నో రకాలు. వాటన్నిటిలో లెహంగాల అందమే అందం. కానీ ఎన్ని రకాలు వచ్చినా పార్టీకి కానీ, ఫంక్షన్స్‌లలో పిల్లలు లెహంగా వేసుకుంటే ఎంతో అందంగా కనపడతారు. లెహంగా అందం లెహంగాదే. అంతలా అకట్టుకుంటాయి. ఈ లెహంగాలు. వీటిలో చాలా వెరైటీలు వస్తున్నాయి. సిల్క్ క్లాత్‌మీద నెట్ వర్క్, కుందన్స్, బీడ్స్‌తో డిజైనర్లు తయారుచేస్తున్నారు. వీటిని ధరిస్తే మన పాపాయిలూ చందమామల్లా మెరిసి పోవడం ఖాయం.

ఫేస్‌బుక్ మిత్రుల పూనికతో అంధురాలికి ఆవాసం

ఎప్పుడూ ఫేస్‌బుక్‌లో ఉండేవారంటే కొంతమందికి చాలా చులకనభావం. ఏం ఫేస్‌బుక్ రా...! అస్తమానం అదేనా..? వేరే పనేం లేదా..? అని దెప్పి పొడుస్తుంటారు. అయితే అందరి సంగతేమోకానీ వీరు మాత్రం అందుకు భిన్నం. ఫేస్‌బుక్‌లో విహరించడమే కాదు, ఆపదలో ఉన్న వారికి సహాయం చేస్తామని కూడా ఈ ఫేస్‌బుక్ యూజర్లు నిరూపించారు. అవును, మీరు విన్నది నిజమే. తాముండే ప్రాంతంలో ఈ ఫేస్‌బుక్ యూజర్లు అంతా కలిసి ఏకంగా చూపులేని ఓ వద్ధురాలికి ఇల్లు కట్టించారు. అంతేకాదు, స్థానిక పోలీస్ అధికారి సహాయంతో ఆమె ఇంటికి గృహ ప్రవేశం చేయించారు. ఆ అధికారి హామీతో వృద్ధురాలికి ఆర్థిక సహాయం కూడా అందించారు. ఇంతకీ ఆ వ ద్ధురాలు ఎవరు? ఏమిటీ ఆ విశేషమంటారా? ఇదిగో చదవండి..!





ఆ వృద్ధురాలి పేరు మందపెల్లి గౌరక్క. తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం రాజారం గ్రామంలో నివాసం ఉంటోంది. ఆమె భర్త పేరు రాజలింగు. అయన కొన్ని నెలల కిందటే చనిపోయాడు. దీంతో అతనికి వచ్చే వేయి రూపాయల పెన్షన్ ఆగిపోయింది. దీంతో గౌరక్క కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఆదుకునే వారు లేరు. పూట తిండికి కూడా నోచుకోలేదు. దీనికి తోడు అంధురాలు కావడంతో ఇక ఆమె పడ్డ ఇబ్బందులను మాటల్లో చెప్పలేం. ఉన్న ఒక్క కొడుకు ఎప్పుడో చనిపోవడంతో అతని భార్య.. అంటే.. గౌరక్క కోడలు ఆమెను వదిలిపెట్టి, పిల్లల్ని తీసుకుని వేరే దగ్గర నివాసం ఉంటోంది. ఈ క్రమంలో గౌరక్క భర్తతో ఉండగా, ఇప్పుడు అతను కూడా మృతి చెందాడు. దీంతో బతుకుపోరులో గౌరక్క ఒంటరిదైపోయింది. కూతురు ఉన్నా ఆమె మానసిక వికలాంగురాలు.

అయితే గౌరక్క పరిస్థితి గురించి వివరిస్తూ, ఆమెను ఆదుకోవాలని ఫేస్‌బుక్‌లో రేణికుంట రమేష్ అనే ఓ స్థానిక వ్యక్తి పోస్టు పెట్టాడు. దీంతో అతని స్నేహితుల జాబితాలో ఉన్న చాలామంది ఫేస్‌బుక్ యూజర్ల నుంచి స్పందన వచ్చింది. వారంతా 1.10 లక్షల రూపాయల వరకు చందాలు వేసుకున్నారు. మిగతా కొంత మొత్తాన్ని సేకరించారు. అలా సమీకరించిన సొమ్ముతో గౌరక్కకు ఓ ఇల్లు కట్టించారు. ఆ ఇంటిని జిల్లా ఎస్పీ అనంత శర్మతో గృహ ప్రవేశం చేయించారు. ఆ సందర్భంలో ఆయనతో హామీ తీసుకున్నారు. గౌరక్కకు కావల్సిన ఆర్థిక సహాయం అందిస్తానని అనంతశర్మ మాటిచ్చి, కొంత సాయం చేశారు. ఈ క్రమంలో గౌరక్కకు దూరంగా ఉంటున్న ఆమె కోడల్ని కూడా తీసుకువచ్చారు. ఆమె గౌరక్కతోపాటు ఆ ఇంట్లో ఉండేందుకు అంగీకరించింది. ఫేస్‌బుక్ అనేది కేవలం కాలక్షేపం కబుర్లు చెప్పుకోవడానికి మాత్రమే కాదు, ఇలా ఆపదలో ఉన్న వారికి సహాయం కూడా అందిస్తుందని, దీనికీ సామాజిక ప్రయోజనం ఉందనీ రుజువైంది. ★




వాష్‌రూమ్‌పై శ్రద్ధ పెట్టండి!

ఇంట్లో ఉండే అన్నిగదులూ ఎలా ఉన్నా బాతురూం శుభ్రతపై మాత్రం ప్రత్యేక శ్రద్ధ అవసరం. బాత్‌రూం, టాయ్‌లెట్‌లో క్రిమికీటకాలు ఉండటానికి ఎక్కువ ఆస్కారం ఉంది. అందువల్ల వాటిని నియంత్రించడానికి బాత్‌రూం క్లీనింగ్‌కు ఓ ప్రణాళిక చాలా అవసరం. టాయ్‌లెట్‌ని డిసయిఫెక్ట్‌డ్ క్లీనర్‌తో శుభ్రం చేస్తే మంచిది. టాయ్‌లెట్ బ్రష్‌ను ఉపయోగించిన తరువాత దానిని శుభ్రంగా కడిగి, శుభ్రమైన ప్రదేశంలో ఉంచాలి. బాత్‌రూములో షవర్, సింక్‌ను ఉపయోగించిన తరువాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ఈ సీజన్‌లో షవర్ లోపలి భాగం నాచుపట్టే సూచనలు ఉన్నాయి. అందువల్ల షవర్‌ని ఉపయోగించపోయినా, ఎప్పటికప్పుడూ దాన్ని శుభ్రం చేస్తూ ఉండాలి. టూత్‌బ్రష్‌ని ఉపయోగించిన తరువాత దాన్ని శుభ్రంగా కడిగి, ఖాళీ ప్రదేశంలో పెట్టడం మంచిది. దీన్ని ప్రతి మూడు నెలలకోసారి మారుస్తూ ఉండాలి. తడి టవల్స్‌లో నూ బాక్టీరియా ఉంటుంది. అందుకే టవల్‌ను ప్రతి రెండు మూడు రోజులకోసారి ఉతకటం మంచిది. అనారోగ్యంతో ఉన్న వారి టవల్స్‌ను ఇతరులు ఉపయోగించకూడదు. వారికి ప్రత్యేకంగా ఓ టవల్‌ను కేటాయించాలి. దానిని శుభ్రపరచి బాగా ఆరిన తరువాతే ఉపయోగించాలి. బాత్‌రూమును ఉపయోగించిన తరువాత ఎగ్జిస్టింగ్ ఫ్యాన్‌ను ఉపయోగించాలి. సబ్బుతో మాత్రమే కడగడం వల్ల బ్యాక్టీరియా ఉంటుంది. వేడినీళ్లలో డిటర్జెంట్ వేసి కడగాలి. దీంతో బాత్‌రూము శుభ్రంగా ఉంటుంది. క్లీన్ చేసిన తర్వాత, బాత్‌రూం కొంత సమయం తలుపు తెరిచి ఉంచడం మంచిది. గాలివస్తూ ఉంటుంది కాబట్టి ఎటువంటి వాసన రాదు. ఎరియ్ ఫ్రెషనర్, కొవ్వొత్తులు లాంటి వస్తువులని బాత్‌రూంలో ఉంచకపోవడమే మంచిది. ఎందుకంటే వాటివల్ల గాలి కాలుష్యమూ అయ్యే ప్రమాదం ఉంది. ★



మీ కోసం



కత్తిపీటకు ఉప్పు రాయడం వల్ల అది పదునుగా తయారవుతుంది.


జీవన సౌరభం

కాలాన్ని వృధా చేయడమంటే మనల్నిమనం దోపిడీ చేసుకోవడమే.

బజాజ్ అవెంజర్ 180 స్ట్రీట్ !

బజాజ్ ఆటో సంస్థ సరికొత్త అవెంజర్ 180 స్ట్రీట్ బైకును మార్కెట్‌కు పరిచయం చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా అందిన సమాచారం ప్రకారం మరికొన్ని వారాల్లో పూర్తిస్థాయిలో ఇండియన్ మార్కెట్లోకి ఈ బైక్ విడుదల కానుంది. డిజైన్ పరంగా డిజైన్ హెడ్‌ల్యాంప్, పగటి పూట వెలిగే ఎల్ఇడి ల్యాంప్, హెడ్ ల్యాంప్ మీద గిన్నెలాంటి ఆకారం ఉంటుంది. అవెంజర్ క్రూయిజర్ 220తో పోల్చుకుంటే చిన్న పరిమాణంలో ఉన్న హ్యాండిల్ బార్ ఉంది. అలాగే, అల్లాయ్ వీల్స్, సరికొత్త పిలియన్ గ్రాబ్ రెయిల్, ఇతర అవెంజర్ బైకులతో పోల్చితే విభిన్నంగా ఉండేందుకు సరికొత్త బాడీ గ్రాఫిక్స్, అవెంజర్ సిరీస్ బైకులనే పోలి ఉన్నప్పటికీ, క్రూయిజ్ 220సీసీ తరహా డిజైన్ సొబగులు ఇందులో రావడం లేదు. తాజాగా విపణిలోకి విడుదల చేసిన అవెంజర్ 150 డిజైన్‌తో అవెంజర్ 180 స్ట్రీట్ రానుంది. అవెంజర్ 150 స్ట్రీట్ తరహా సరికొత్త రోడ్‌స్టర్ డీకాల్స్, సరికొత్త పెయింట్ స్కీమ్‌లో రానుంది. ఇక ఫీచర్ల విషయానికి వస్తే, అవెంజర్ 180లో దాదాపు అవెంజర్ 150లో ఉన్న ఫీచర్లు రానున్నాయి. ఇందులో సరికొత్త డిజిటల్ ఇంస్ట్రుమెంట్ క్లస్టర్, నూతన ఎగ్జాస్ట్ మఫ్లర్, రీడిజైన్ చేయబడిన సీటువంటివి రానున్నాయి. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే బజాజ్ అవెంజర్ 180 విడుదలతో అవెంజర్ 150 బైకును మార్కెట్ నుంచి శాశ్వతంగా తొలగిస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాంకేతికంగా చూస్తే, బజాజ్ లైనప్‌లో ఉన్న 180సీసీ కెపాసిటీ గల గాలితో చల్లబడే సింగిల్ సిలిండర్ పెట్రోల్ ఇంజన్‌తో రానుంది. 5-స్పీడ్ గేర్‌బాక్స్ అనుసంధానంతో లభించే ఇది గరిష్టంగా 17బిహెచ్‌పి పవర్, 14.22ఎన్ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సరికొత్త బజాజ్ 180 స్ట్రీట్ విపణిలో ఉన్న సుజుకి ఇంట్రూడర్ 150, కొత్తగా విడుదలైన యుఎమ్ రెనిగేడ్ డ్యూటీ ఎస్, రెనిగేడ్ డ్యూటీ ఏస్ మోటార్ సైకిళ్లకు గట్టి పోటీనిస్తుంది. ★







S.LENIN BABU
LECTURER IN MATHS
GOVERNMENT
POLYTECHNIC COLLEGE
VIJAYAWADA. PH : 9985476035

MATHAMETICS FOR TET

PRACTICE PAPER - 2

Time AND Distance



Important Facts And Formulas

1. Speed = (Distance/Time), Time = (Distance/Speed), Distance = (Speed x Time)
2. X km/hr = (X x 5/18) m/sec.
3. X m/sec = (X x 18/5) km/hr.
4. If the ratio of the speeds of A and B is a:b, then the ratio of the times taken by them to cover the same distance is 1/a : 1/b or b :a
5. suppose a man covers a certain distance at X km/hr and a equal distance at Y km/hr. then, the average speed during the whole journey is (2 XY/X+y) km/hr.

1. A car moves at the speed of 80 km/hr. what is the speed of the car in meters per second?
a) 8 m/sec b) 20 1/9 m/sec
c) 22 2/9 m/sec d) none of these

2. An athlete runs 200 metres race in 24 seconds. His speed is:
a) 20 km/hr b) 24 km/hr
c) 28.5 km/hr d) 30 km/hr

3. which of the following trains is the fastest?
a) 25 m/sec b) 1500 m/min
c) 90 km/hr d) none of these

4. A person crosses a 600m long street in 5 minutes. what is his speed in km per hour?
a) 3.6 b) 7.2 c) 8.4 d) 10

5. A man walking at the rate of 5 km/hr crosses a bridge in 15 minutes. The length of the bridge (in meters) is :
a) 600 b) 750
c) 1000 d) 1250

6. How long will a boy take to run round a square field of side 35 metres, if he runs at rate of 9 km/hr?
a) 50 sec b) 52 sec
c) 54 sec d) 56 sec

7. A car is running at a speed of 108 kmph. what distance will it covers in 15 seconds?
a) 45 metres b) 55 metres
c) cannot be determined d) none of these

8. one of the two buses completes a journey of 300 km in 7 ½ hours and the other a journey of 450 km in 9 hours. the ratio of their average speed is:
a) 2:3 b) 3:4
c) 4:5 d) 8:9

9. A truck covers a distance of 550 metres in 1 minute where as a bus covers a distance of 33 kms in 45 minutes. the ratio of their spped is:
a) 3:4 b) 4:3
c) 3:5 d) 50:3

10. The ratio between the speeds of two trains is 7:8. If the second train runs 400 kms in 4 hours, then the speed of the first train is:
a) 70 km/hr b) 75 km/hr
c) 84 km/hr
d) 87.5 km/hr

11. A train travels at an average of 50 miles per hour for 2 ½ hours and then travels at a speed of 70 miles per hour for 1 ½ hours. How far did the train travel in the entire 4 hours?
a) 120 miles
b) 150 miles
c) 200 miles d) 230 miles

12. A man in a train notices that he can count 21 telephone posts in one minute. If they are known to be 50 metres apart, then at what speed is the train travelling?
a) 55 km/hr b) 57 km/hr
c) 60 km/hr d) 63 km/hr

13. Sound is said to travel in air at about 1100 feet per second. A man hears the axe striking the three, 11/5 seconds after he sees it strike the three. How far is the man from the wood chopper?
a) 2197 feet b) 2420 feet
c) 2500 feet d) 2629 feet

14. An Express train travelled at an average speed of 100 km per hour, stopping for 3 minutes after every 75 kilometres. How long did it take to reach its destination 600 km from the starting point?
a) 6 hours 21 minutes
b) 6 hours 24 minutes
c) 6 hours 27 minutes
d) 6 hours 30 minutes

15. Acertain distance is covered by a cyclist at a certain speed. If a jogger covers half the distance in double the time, the ratio of the speed of the jogger to the cyclist is:
a) 1:2. b) 2:1. c) 1:4 d). 4:1

16. A motor car starts with the speed of 70km/ hour with its speed increasing every two hours by 10km/hour. In how many hours will it covers 345 KM's?
a) 2 ¼ hours
b) 4 hours 5 minutes
c) 4 ½ hours
d) Cannot be determined
e) None of these

17. The speed of a car increases by 2 kilometres after every 1 hour. If the distance travelled in the first 1 hour was 35 kilometres, what was the total distance travelled in 12 hours.
a) 456 kilometres b) 482 kilometres
c) 552 kilometres d) 556 km
e) None of these

18. A train covers a distance of 10 kilometres in 12 minutes. If it speed is decreased by 5 kilometres per hour, the time taken by it to cover the same distance will be:
a) 10 minutes b) 11 minutes 20 seconds
c) 13 minutes d) 13 minutes 20 seconds

19. Anna left for city A from City B at 5:20 a.m. She travelled at the speed of 80 kilometres per hour for 2 hours 15 minutes. After that the speed was reduced to 60 km per hour. If the distance between two cities is 350 kms, at the what time did Anna reach City A?
a) 9:20 A.M b) 9:25 A.M
c) 9:35 A.M d) 10.5 A.M
e) None of these

20. An aeroplane covers a certain distance at a speed of 240 km per hour in 5 hours. To cover the same distance in 1 2/3 hours, it must travel at a speed of:
a) 300 km per hour b) 360 km per hour
c) 600 km per hour d) 720 km per hour

★

answers :

1.c,	2.d,	3.d,	4.b,	5.d,
6.d,	7.c,	8.c,	9.a,	10.a,
11.d,	12.c,	13.b,	14.a,	15.c,
16.c,	17.c,	18.d,	19.e,	20.d.

PRACTICE PAPER - 3

Simple Interest

Important facts and formulas

1. Principal : The money borrowed or lent out for a second period is called principal or the sum

2. Interest : Extra money paid for using others money is called interest

3. Simple interest : If the interest on a sum borrowed for a second period is there not uniformly then it is called simple interest

Let principle = p, Rate = R per annum and Time = T years. Then,

$$si = \left[\frac{P \times R \times T}{100}\right]$$

$$P = \left[\frac{100 \times si}{R \times T}\right]; \quad R = \left[\frac{100 \times si}{P \times T}\right]; \quad T = \left[\frac{100 \times si}{P \times R}\right]$$

1. At the rate of 8 1/2 percent p a simple interest a sum of rupees 4800 will and how much interest in 2 years and 3 months.
a) rupees 796 b) rupees 816
c) rupees 918 d) rupees 956

2. What will be the simple interest and on an amount of rupees 16800 in 9 months at the rate of 6 1/4% per annum?
a) Rupees 787.50
b) Rupees 812.50
c) Rupees 860
d) Rupees 887.50

3. The simple on rupees 1820 from March 9,2003 to may 21st 2003 at 7 1/2 percent the will be.
a) rupees 22.50 b) Rupees 27.30
c) Rupees 28.80 d) Rupees 29

4. A person borrows rupees 5,000 for 2 years at 4% per annum. simple interest. He immediately lends to another person at 6 1/4% per annum for 2 years. find his gain in the transaction per year.
a) Rupees one 12.50
b) Rupees 125
c) Rupees 150
d) Rupees 16 7.50

5. How much time it will take to for an amount of rupees 450 to yield rupees 81 as interest at 4.5% per annum of simple interest?
a) 3.5 years b) 4 years
c) 4.5 years d) 5 years

6. A sum of rupees 12500 amount to Rupees 15,500 in 4 years at rate of simple interest. what is the rate of interest?
a) 3% b) 4% c) 5% d) 6%
e) None

7. A sum of rupees 1,600 gives a simple interest of rupees 252 in 2 years and 4 months. the rate of interest per annum?
a) 6 % b) 6 1/4 %
c) 6 1/2 % d) 6 34 %

8. Reena took a loan of Rupees 1200 with simple interest for as many years as the rate of interest. if she paid rupees 432. as interest. at the end of loan period. what was the rate of interest?
a) 3.6 b) 6 c) 18
d) Cannot be determined
e) None of these

9. A man took a loan from a bank at the rate of 12% per annum simple interest. after 3 years. he had to pay rupees 5,400 interest only for the period. the principal amount borrowed by him was?
a) Rupees 2,000
b) Rupees 10,000
c) Rupees 15,000
d) Rupees 20,000

10. What was the percent worth of rupees 132 due in 2 years at 5% simple interest per annum?
a) Rupees 112 b) Rupees 118.80
c) Rupees 120 d) Rupees122

11. A sum fetched a total simple interest of rupees 4,016.25 at the rate of 9% per annum. in 5 years what is the sum?
a) Rupees 4,462.50 b) Rupees 8032.50
c) Rupees 8925 d) Rupees 8095
e) None of these

12. Simple interest at x % For x years. will be rupees x on a sum of?
a) Rupees x b) Rupees {100/ X}
c) Rupees 100 x c) Rupees 100/ x^2

13. Rupees 800 becomes rupees 956 in 3 years at a certain rate of simple interest. if the rate of interest is increased by 4% what amount will rupees 800 become in 3 years?
a) Rupees 1020.80
b) Rupees 1025.5
c) Rupees 1025
d) Data inadequate
e) None of these

14. A certain amount and simple interest of rupees 1750 after 7 years had the interest been 2% more, how much more interest would it have earned?
a) Rupees 35 b) Rupees 245
c) Rupees 350 d) Cannot be determined
e) None of these

15. In how many years, rupees 150 will produce the same interest @ 8%. as rupees 800 produce. in 3 years@ 4 1/2 %?
a) 6 b) 8 c) 9 d) 12

16. If rupees 64 amounts to rupees 83.20 in 2 years. what will be rupees 86 amount to in 4 years. at the same rate per annum?
a) Rupees 114.80
b) Rupees 124.70
c) Rupees 127.40
d) Rupees 137.60

17. A simple interest on a certain sum of money at the rate of 5% per annum for 8 years is 840. what interest the sum amount of interest can be received on the same sum after 5 years?
a) 6% b) 8% c) 9% d) 10%

18. Interest on a certain deposit at 4.5% per annum is rupees 202.50 in one year. how much will additional interest in one year be on the same deposit at 5% per annum?
a) Rupees 20.25 b) Rupees 22.50
c) Rupees 25 d) Rupees 42.75

19. A sum invested at 5% simple interest per annum. grows up to Rupees 504 in 4 years. the same amount of 10% simple interest per annum in 2 1/2 years will grow to?
a) Rupees 420
b) Rupees 450
c) Rupesh 525
d) Rupees 550

20. What will be the ratio of simple interest earned. by certain amount at the same rate of interest for 6 years. and that for 9 years?
a) 1:3 b) 1:4 c) 2:3
d) Data inadequate
e) None of these

★

answers :

1.c,	2.a,	3.b,	4.a,	5.b,
6.d,	7.d,	8.b,	9.c,	10.c,
11.d,	12.b,	13.b,	14.d,	15.c,
16.d,	17.b,	18.b,	19.c,	20.c.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

పర్యాటకరంగం-ప్రాధాన్యత



ఎస్.ఎం.సువర్ణకుమార్
డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్, ఏలూరు.
సెల్ : 9441169869

ఇండియన్ ఎకానమి

ఆర్థిక, సామాజిక స్థిరత్వం కోసం పర్యాటకం ఒక సాధనంగా ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. పర్యాటక రంగాన్ని ఆర్థికవ్యవస్థకు మూలస్థంబంగా అనేక దేశాలు పేర్కొన్నాయి.

పర్యాటకరంగం శ్రమాధారమైనది. ప్రత్యేక నైపుణ్యం లేనివారికి ఉపాధి కల్పిస్తుంది. ఆహారం, వసతి, రవాణా సౌకర్యాల కల్పన ద్వారా అనేక మందికి జీవనోపాధి కల్పిస్తుంది. నైపుణ్యాల లేమిగల భారతీయ శ్రామికులలో, తక్కువ నైపుణ్యంగల శ్రామికులకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో పర్యాటకరంగం రెండోస్థానంలో ఉంది. దేశంలో పేదరికాన్ని రూపుమాపేందుకు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని 'నీతి ఆయోగ్' పేర్కొంది. ఉద్యోగ అవకాశాల కల్పన ద్వారా సామాజిక ఆర్థిక పురోగతి తీసుకురావడంలో పర్యాటకరంగం కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొంది.

ఎగుమతులు మందగించి, బంగారం, చమురు దిగుమతులు పెరిగి, వాణిజ్యలోటు ఆందోళనకరస్థితికి చేరిన తరుణంలో విదేశీ మారక ద్రవ్యాన్ని సమకూర్చుకోవడానికి సులువైన మార్గాన్ని పర్యాటకరంగం కల్పిస్తుంది. మందగమన పరిస్థితుల నుంచి దేశ ఆర్థికవ్యవస్థను కాపాడే సత్తా పర్యాటక రంగానికి ఉంది.

మన దేశ జిడిపిలో ఐదు శాతానికి పైగా వాటా, ఉద్యోగాల్లో దాదాపు తొమ్మిది శాతం పర్యాటక రంగానిదే. 12వ ప్రణాళిక ప్రకారం ప్రతి పది లక్షల రూపాయల పెట్టుబడికి పర్యాటక, ప్రయాణ రంగంలో 78 మందికి ఉద్యోగాలు లభిస్తున్నాయి. ఇదే పెట్టుబడితో తయారీ రంగంలో 45 కొత్త ఉద్యోగాలు కల్పన మాత్రమే జరుగుతుంది.

మన దేశంలో వైవిధ్యభరితమైన శీతోష్ణస్థితి ప్రాంతాలు, చారిత్రాత్మక ప్రదేశాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలు, కళలు, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, పురాతన దేవాలయాలు, ప్రకృతి రమణీయ ప్రదేశాలు, జీవవైవిధ్యం, గిరిజనుల జీవన శైలి వంటివి పర్యాటకాన్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. అయితే మన పర్యాటక రంగాన్ని పరిశీలిస్తే ప్రపంచ పర్యాటకంలో భారతదేశ వాటా 0.4 శాతం మాత్రమే. విదేశీ పర్యాటకుల ద్వారా ప్రపంచ దేశాలకు లభిస్తున్న ఆదాయంలో వాటా 1.6 శాతమే. సింగపూర్, థాయిలాండ్ వంటి దేశాలు సమర్థవంతమైన చర్యలలో పర్యాటకరంగాన్ని బాగా అభివృద్ధి చేసుకుని ఆర్థికవ్యవస్థకు వెన్నుదన్నుగా పర్యాటకరంగాన్ని మలచుకున్నాయి.

భారతదేశ పర్యాటకరంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. పర్యాటకరంగానికి సంబంధించి తగినంత ప్రచారం లేకపోవడం పెద్ద లోపంగా భావించవచ్చు. విశాలమైన తీరప్రాంతం, అడవులు, అందమైన దీవులు వంటివి ఎన్నో ఉన్నా తగినంత ప్రచారం లేకపోవడం వల్ల విదేశీయులను ఆకర్షించలేకపోతున్నాము. 2016లో మొత్తం పర్యాటకులను గమనిస్తే స్వదేశీ పర్యాటకులు ఎక్కువ శాతం నమోదు కాగా విదేశీ పర్యాటకులు నామమాత్రమే. ఈ సమస్యను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం 'అతుల్య భారత్, పేరిట విదేశాల్లో భారీ ప్రచారం నిర్వహిస్తుంది. విదేశాల్లో కార్యాలయాలు ఏర్పాటు, అంతర్జాతీయ పర్యాటక ప్రదర్శనలు, ఉత్సవాల్లో పాల్గొనడం వంటి అనేక చర్యల ద్వారా పర్యాటక రంగం కృషి చేస్తుంది. ఇక్కడకు వచ్చిన తరువాత వీసాలు తీసుకునే విధంగా 'వీసా ఆన్ ఎరైవల్' విధానాన్ని కొన్ని దేశాలకు అవకాశం కల్పించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం విమానాశ్రయానికి ఈ సదుపాయం కల్పించింది.



శతాబ్దాలుగా 'అతిథి దేవోభవ' అన్న మహోన్నత విలువ ప్రచారంతో ఉన్న భారత్‌ను విదేశీయులు సురక్షిత పర్యాటక గమ్యంగా పరిగణించేవారు. అటువంటిది నేడు విదేశీ మహిళలు, పర్యాటకులపై అత్యాచారాల వల్ల పర్యాటకులు హడలెత్తిపోతున్నారు. గోవా, ఢిల్లీ, బెంగుళూరు, రాజస్థాన్ ప్రాంతాల్లో పర్యటిస్తున్న కొందరు మహిళా పర్యాటకులపై జరిగే అత్యాచారాలకు తోడు దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మాటలు, చేష్టల ద్వారా శారీరక, మానసిక వేధింపులకు గురవుతున్నారు. వీటివల్ల పర్యాటకరంగం ద్వారా ప్రతి ఏటా దేశానికి వస్తున్న లక్షల కోట్ల రూపాయల ఆదాయానికి గండిపడే ప్రమాదం ఉంది. మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించి శాశ్వత పరిష్కారం వైపు దృష్టి సారించాలి. పర్యాటక పోలీస్‌ను ఏర్పాటు చేసి, విదేశీయులకు రక్షణ కల్పించాలి. కేంద్రం, రాష్ట్రం మధ్య సమన్వయంతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిపుచ్చుకోవాలి. పర్యాటకులపై లైంగిక నేరాలతో సహా వివిధ నేరాలకు పాల్పడిన వారిపై దేశద్రోహ నేరంతో సహా అనేక కేసులను నమోదు చేసి, కఠినంగా శిక్షించాలి. విదేశీ పర్యాటకుల పట్ల అనుచితంగా ప్రవర్తించరాదన్న స్పృహ దేశ ప్రజలలో వెల్లివిరిసే విధంగా చర్యలు తీసుకోవాలి. ఢిల్లీ నిర్భయ ఘటన తర్వాత భారతదేశానికి వచ్చే పర్యాటకుల సంఖ్య 25 శాతం తగ్గినట్లు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మహిళా పర్యాటకులు 35 శాతం తగ్గినట్లు సూచిస్తున్నాయి. దీనివల్ల పర్యాటకరంగానికి శాంతి భద్రతలు ఎంత కీలకమో తేటతెల్లం అవుతుంది.

ప్రభుత్వ ఉదాసీనత, విధాన పరమైన లోపాలు, మంత్రిత్వశాఖల మధ్య సమన్వయలేమి, నిర్ణయాల్లో జాప్యం, మౌలిక సదుపాయాల కొరత వంటి కారణాల వల్ల భారత్ పర్యాటక రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతుంది.

భద్రత కొరవడటం, శుభ్రత లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత వంటి సమస్యల వల్ల కొన్ని ఆసక్తికరమైన ప్రాంతాలకు విదేశీ పర్యాటకులు దూరమవుతున్నారు.

వివిధ ప్రాంతాలకు పర్యాటక కేంద్రాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యాలు, వసతి సౌకర్యాలు కల్పించాలి. ఇందుకు భారీగా నిధులు అవసరమవుతాయి. పర్యాటకరంగానికి అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన, అభివృద్ధి పథకాలు చేపట్టాలంటే అది కేవలం ప్రభుత్వాల వల్ల అయ్యే పని కాదు. అందువల్ల ఆ దిశగా ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలి. ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి. అవసరమనుకుంటే పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి పరిచేందుకు యూజర్ ఛార్జీలను వసూలుకు అనుమతించాలి. ★

ఉద్యోగాలు

ఈస్ట్ సెంట్రల్ రైల్వేలో 1898 ఉద్యోగాలు

ఈస్ట్ సెంట్రల్ రైల్వే (ఈసీఆర్)లోని 1,898 అప్రెంటీస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తూ రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ ప్రకటన విడుదల చేసింది.

పోస్టు: అప్రెంటీస్.

డివిజన్లు/యూనిట్ల వారీ ఖాళీలు: ధనపూర్- 626, ధన్‌బాద్-142, మొగల్‌సరాయ్-844, సమస్తిపూర్-70, ప్లాంట్ డిపో (మొగల్‌సరాయ్)-116, మెకానికల్ వర్క్‌షాప్ (సమస్తిపూర్)-100.

ట్రేడ్ విభాగాల వారీ ఖాళీలు: ఫిట్టర్-826, వెల్డర్ (జీఅండ్ఈ)-117, మెకానిక్ (డీజిల్)-150, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ మెకానిక్-84, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్-20, కార్పెంటర్-18, ఎలక్ట్రానిక్ మెకానిక్-280, పెయింటర్ (జనరల్)-16, ఎలక్ట్రీషియన్-192, వైర్‌మ్యాన్-98, టర్నర్-41, మెషినిస్ట్-30, ఎంఎంటీఎం-2, లేబొరేటరీ అసిస్టెంట్ (సీపీ)-4, మెకానిక్ (ఎంవీ)-8, గ్రిండర్/ మెషినిస్ట్-12.

అర్హతలు: కనీసం 50 శాతం మార్కులతో పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు సంబంధిత ట్రేడ్ విభాగంలో ఐటీఐ (ఎన్‌సీవీటీ/ ఎస్‌సీవీటీ).

వయసు: 2018, జనవరి 30 నాటికి 16-24 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: మార్కుల (పదోతరగతి + ఐటీఐ) మెరిట్ ఆధారంగా.

దరఖాస్తు ఫీజు : రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళ అభ్యర్థులకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో

దరఖాస్తు చివరి తేదీ: ఫిబ్రవరి 28, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.rrcecr.gov.in

ఫిషింగ్ హార్బర్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. జాలారీలు భద్రపరుచుకున్న విలువైన వేట సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదవశాత్తు ఆదివారం ఒక బడ్డీలో అగ్నిప్రమాదం సంభవించి అరగంట వ్యవధిలోనే మొత్తం 40 బడ్డీలు, అందులో ఉన్న సామాగ్రి కాలి బూడిదైపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చేసరికి దాదాపు 95 శాతం బడ్డీలు కాలిపోయాయి. మిగిలిన మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టింది. ఒక్కో బడ్డీ విలువ రూ.లక్ష ఉంటుందని అంచనా వేస్తున్నారు. హార్బర్‌కు కూతవేటు దూరంలో ఉన్న జివిఎంసి 22వ వార్డులో సాగరతీరం సమీపంలో వేలాది మత్స్యకార కుటుంబాలు నివాసముంటున్నాయి.

అగ్నిప్రమాదం



విశాఖలోని ఫిషింగ్ హార్బర్‌లో జాలారీలు బడ్డీలలో భద్రపరుచుకున్న విలువైన వేట సామాగ్రి ఆదివారం జరిగిన అగ్నిప్రమాదానికి ఆహుతైంది

'ఉపాధి' రక్షణకు ఉద్యమం

మార్చిలో చలో అసెంబ్లీ - ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవాల్సిన అవసరం కూలీలపై ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. ఇందుకోసం మార్చిలో చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. ఆదివారం ఆయన విజయనగరంలోని ఎల్‌బిజి భవనంలో విలేకర్లతో మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధి నిధులతో పేదలకు పనులు కల్పించి వలసలు నివారించాల్సి ఉందని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా కాంట్రాక్టర్లతో పనులు చేయిస్తున్నారన్నారు. గతంలో మెటీరియల్ కోసం 22 శాతం ఖర్చు చేసేవారని, నేడు ఆ మొత్తాన్ని 42 శాతానికి పెంచారని తెలిపారు. రాష్ట్రంలో రూ.1,935 కోట్లను యంత్రాలకు ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. దీన్నిబట్టి కాంట్రాక్టర్లను ప్రభుత్వం ఏ విధంగా పెంచి పోషిస్తోందో అర్థమవుతోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూలీలకు ఇప్పటివరకూ రూ.445 కోట్ల బకాయిలు ఉన్నాయన్నారు. విజయనగరం జిల్లాలో రూ.36 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ పరిశ్రమలను మోడీ అమ్మేస్తున్నారు

- బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి అభిమన్యు
- స్టీల్, పోర్టు, డిసిఐ, భెల్ కార్మికుల 36 గంటల నిరాహార దీక్షలు ప్రారంభం



నిరాహార దీక్షలను ప్రారంభించి మాట్లాడుతున్న అభిమన్యు



విశాఖలో నిరాహారదీక్షలో కూర్చున్న ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ప్రధాని మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం కంటే చాలా వేగంగా దేశం గర్వించే ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అమ్మడం, పెట్టుబడులను ఉపసంహరించడం వంటి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి పి.అభిమన్యు విమర్శించారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద స్టీల్‌ప్లాంట్, డిసిఐ, పోర్టు, భెల్ పరిశ్రమల కార్మికులు చేపట్టిన 36 గంటల నిరాహార దీక్షను ఆదివారం ఆయన ప్రారంభించారు. స్టీల్‌ప్లాంటులో 10 శాతం వాటాల విక్రయాలను, డిసిఐ అమ్మకానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి బిఎస్ఎన్ఎల్ తరుపున మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి అన్ని వర్గాల ప్రజలూ కలిసిరావాలన్నారు. గత కాంగ్రెస్, ప్రస్తుత బిజెపి ప్రభుత్వాలు ఎయిరిండియా, బిఎస్ఎన్ఎల్, స్టీల్‌ప్లాంట్, రైల్వే, డిఫెన్స్ ఇలా అన్ని ప్రభుత్వ సంస్థలనూ తమ అప్రజాస్వామిక విధానాలతో నష్టాలు పాలు చేస్తున్నారని, తర్వాత నష్టాల పేరు చెప్పి ప్రయివేటుకు అమ్మేస్తున్నారని తెలిపారు. దేశంలోని సహజ వనరులను, సంపదను కార్పొరేట్లకు లూటీ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలోని కేంద్రమంత్రి ఎ.రాజా 1.57 లక్షల కోట్ల 2జి స్పెక్ట్రమ్ అవినీతికి పాల్పడితే బిజెపి ప్రభుత్వ హయాంలో అతనికి క్లీన్‌చిట్ వచ్చిందన్నారు. 122 ఎయిర్‌క్రాఫ్ట్ విమానాలను అవసరం లేకున్నా రూ.50 వేల కోట్లతో కొనుగోలు చేశారని, ఇప్పుడు ఆ అప్పులు తీర్చడానికి ఎయిరిండియాను అమ్ముతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాన్ని దేశంలోని కార్మికులు, కార్మిక సంఘాలే కాకుండా అన్ని వర్గాల ప్రజలూ ఉద్యమించడం ద్వారా అడ్డుకోగలమన్నారు.

దేశవ్యాప్త ఉద్యమానికి విశాఖలోనే భవిష్యత్ కార్యాచరణ

విశాఖలో జరుగుతున్న 36 గంటల నిరాహార దీక్షకు మద్దతిచ్చేందుకు సోమవారం సిఐటియు, ప్రభుత్వ రంగ సంస్థల యూనియన్ల జాతీయ నాయకులు హాజరవుతారని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్. నర్సింగరావు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలకు అడ్డుకట్ట వేసి వాటిని కాపాడుకునేందుకు అవసరమైన భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు ఇక్కడే జాతీయ స్థాయి స్టీరింగ్ కమిటీ భేటీ అవుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ 10 శాతం వాటాల అమ్మకం, డిసిఐ ప్రయవేటీకరణను అడ్డుకోవడంతో పాటు దేశంలోని ఇతర ప్రభుత్వరంగ సంస్థలను కాపాడేందుకు అవసరమైన ప్రజామద్దతును ఇక్కడినుండే అందించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పోర్టు అండ్ డాక్‌యార్డు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి విఎస్.పద్మనాభరాజు పాల్గొన్నారు. 36 గంటల నిరాహార దీక్షలో స్టీల్ ప్లాంట్ నుంచి కెవి సత్యనారాయణ, టివియు రాజు, పోర్టు నుంచి కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, వి.నల్లయ్య, డిసిఐ నుంచి జి.శ్రీనివాస్, పి.బాల సూర్యనారాయణ, షరీప్, జి.షాజివ్, జిజెబి.ప్రసాదరావు, భెల్ నుంచి జి.రాంబాబు కూర్చున్నారు.



శ్రీకాకుళం ర్యాలీలో పాల్గొన్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 23న తలపెట్టిన చలో గుంటూరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ పెదగొట్టిపాడు దళిత బాధితుల పోరాట సంఘీభావ కమిటీ ఆధ్వర్యాన దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యాన శ్రీకాకుళంలో ఆదివారం ర్యాలీ జరిగింది. ఆదివారం పేటలోని అంబేద్కర్ విగ్రహం నుంచి ఏడురోడ్ల కూడలి వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా దళిత, ప్రజాసంఘాల నాయకులు బొడ్డేపల్లి నర్సింహులు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి డి.గణేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, సాంఘిక బహిష్కరణలు, మహిళలపై అత్యాచారాలకు నిరసనగా చలో గుంటూరు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు దళితులపై దాడి చేసిన పెత్తందారులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, దళితులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెదగొట్టిపాడు దళితుల డిమాండ్లను

ఎస్‌సి వర్గీకరణ సాధనలో బిజెపి ప్రభుత్వం విఫలం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

ప్రజావక్తి - నందిగామ(కృష్ణా)

ఎస్‌సి వర్గీకరణ సాధనలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విమర్శించారు. కృష్ణా జిల్లా నందిగామ రైతుపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకొచ్చిన 100 రోజుల్లో ఎస్‌సి వర్గీకరణ రిజర్వేషన్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన బిజెపి పాలకులు నాలుగేళ్లవుతున్నా పట్టించుకోవటం లేదన్నారు. వర్గీకరణ సాధనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. ఎస్‌సిల ఓట్లతో అధికారంలోకొచ్చిన బిజెపి, టిడిపి ప్రభుత్వాలు దళితుల గోడు పట్టించుకోవటం లేదన్నారు. ఈ రెండు ప్రభుత్వాలు అసెంబ్లీ, పార్లమెంటులో తీర్మానాలు చేసి ఎందుకు బిల్లు పెట్టడం లేదని ప్రశ్నించారు. వర్గీకరణపై కాంగ్రెస్, వైసిపిలు నోరు మెదపకపోవటం విచారకరమని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై స్థానిక ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య కూడా స్పందించకపోవటం దారుణమన్నారు. ఎస్‌సి వర్గీకరణ సాధనకోసం ఏప్రిల్ రెండో తేదీన గుంటూరులో మహా తిరుగుబాటు గర్జన ఏర్పాటు నిర్వహించబోతున్నట్లు వివరించారు. దీనిని జయప్రదం చేయాలని దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా రెండు దఫాలుగా రథయాత్రలు ప్రారంభించబోతు న్నామన్నారు.నెరవేర్చే వరకూ దశల వారీగా పోరాటాలను కొనసాగిస్తామన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దు

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

బోయలను, వాల్మీకులను, ఇతర కులాలను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని ఆదివాసీ హక్కుల సాధన ఐక్య కార్యాచరణ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో చర్చావేదిక నిర్వహించింది. ఇందులో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఏర్పాటు చేస్తున్న గిరిజన యూనివర్సిటీకి నిధులు కేటాయించి తరగతులను ప్రారంభించాలని, గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు. చర్చా వేదికలో మాజీ ఎమ్మెల్యే, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి, విశ్రాంత ఆర్‌డిఒ ఒ.రామ్మూర్తి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.సురేష్, ఎపి గిరిజన సమాఖ్య నాయకులు టి.అప్పలరాజు, గిరిజన ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ఎం.అమర్‌నాథ్, మైదాన ప్రాంత గిరిజన నిరుద్యోగుల సంఘం నాయకులు ఆర్.శశిభూషణరావు పాల్గొన్నారు.

మహిళల్లో మరింత చైతన్యం రావాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపు



నెల్లూరు సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - నెల్లూరు అర్బన్

మహిళలు వారి సమస్యలను పరిష్కరించుకునేందుకు మరింత చైతన్యవంతులు కావాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి పిలుపునిచ్చారు. మార్చి 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పద్మావతి సెంట్రల్ హాల్లో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) జిల్లా మహిళా ఉపాధ్యాయుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం వృత్తిపరంగా నిర్వహించాల్సిన విధులకు అడ్డుతగులుతూ, రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. మహిళలకు ఆస్తిలో సమానహక్కు చట్టం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. 45 శాతం ఉన్న మహిళా ఉపాధ్యాయుల సంఖ్య రానున్నరోజుల్లో 75 శాతానికి పెరిగే అవకాశముందన్నారు. ఉపాధ్యాయ వృత్తికి మహిళలే సరైనవారని స్పష్టం చేశారు. ఉద్యోగపరంగా, ప్రభుత్వపరంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఉద్యమాలతో వారి హక్కులను సాధించుకోవాలన్నారు. శ్రీదేవి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మస్తానయ్య, నవకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ జవాబులు

1. పాట్నా (బీహార్)
2. ఆస్మితా యోజన
3. కల్లియార్ (కేరళ) (ఈ నెల 17 నుంచి 21)
4. అరుణాచల్ ప్రదేశ్
5. రోజర్ ఫెదరర్ (36 ఏళ్ల 195 రోజులు)

వర్మపై రాష్ట్ర పోలీసులు స్పందించాలి

ఐద్వా డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివాదాస్పద సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై ఆంధ్రప్రదేశ్ పోలీసులు కూడా స్పందించి కేసు నమోదు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి విడుదల చేసిన ఒక ప్రకటనలో వర్మపై రాష్ట్ర పోలీసులు ఇప్పటివరకు కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. విశాఖతో పాటు పలు ప్రాంతాల్లో రామ్‌గోపాల్ వర్మపై ఐద్వా పోలీసులకు గతంలోనే ఫిర్యాదు చేసిందని, అయినా వారిలో కదలిక లేదని తెలిపారు. రాష్ట్ర పోలీసులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సోమవారం, మంగళవారం నాడు ఆందోళనలు చేయనున్నట్లు చెప్పారు. వర్మపై చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేయాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు.

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్‌సాబ్జీ



కర్నూలు జిల్లా డోన్ సదస్సులో మాట్లాడుతున్న షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - డోన్

విద్యారంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్‌సాబ్జీ విమర్శించారు. ఆదివారం కర్నూలు జిల్లా డోన్ ఎంపిడిఒ కార్యాలయం నుంచి లక్ష్మీ ఫంక్షన్‌హాల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన విద్యా చైతన్య సదస్సులో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, ఉపాధ్యాయులు కర్తవ్యం అనే అంశంపై ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రాష్ట్ర విభజన చట్టంలోని హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నెల కొల్పాల్సిన 11 కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు రూ.11,673 కోట్లు కేటాయించాల్సి ఉండగా ఎన్‌డిఎ ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం రూ.729 కోట్లు కేటాయించి రూ.521 కోట్లు మాత్రమే విడుదల చేసిందని తెలిపారు. ఇది కేంద్రం ప్రకటించిన మొత్తంలో కేవలం 5 శాతం కూడా లేదని విమర్శించారు. ఈ విధమైన కేటాయింపులు చేస్తే విద్యాసంస్థలు నెలకొల్పడానికి 50 సంవత్సరాలు పడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన 10వ పిఆర్‌సి బకాయిలు రూ. 5400 కోట్లను మూడున్నర సంవత్సరాల నుంచి చెల్లించక పోవడంతో వడ్డీ రూపంలో రూ.200 కోట్లు నష్టపోవాల్సి వచ్చిందని చెప్పారు. తక్షణమే పిఆర్‌సి బకాయిలను చెల్లించి 11వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



సమ్మె చేస్తున్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

151 జిఒ అమలు కోసం సమ్మె

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-తెనాలి(గుంటూరు)

మున్సిపల్ కార్మికులకు జిఒ 151 అమలుకు ప్రిన్సిపాల్ సెక్రటరీ ఆదేశాలిచ్చినా మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. జిఒ అమలు కోసం గుంటూరు జిల్లా తెనాలిలో కార్మికులు రెండ్రోజులుగా సమ్మె చేపట్టిన నేపథ్యంలో ఆదివారం ఆయన సమ్మెనుద్దేశించి మాట్లాడారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని మున్సిపాల్టీల్లోనూ కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నట్లు వెల్లడించారు. తెనాలిలో కార్మికులకు కొబ్బరి నూనె, చెప్పులు, సబ్బులు, మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని ఆదేశాలున్నా నాలుగేళ్ల నుండి అమలు చేయడం లేదని చెప్పారు. ఇది ముమ్మాటికీ కార్మికులపై చిన్నచూపేనన్నారు. సమ్మెకు కెవిపిఎస్, ఆర్‌ఎంఎస్ నాయకులు మద్దతు తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, నాయకులు ఎస్‌కె హుస్సేన్‌వలి, ఎం.వెంకటేశ్వర్లు, సుధాకర్, ఆర్.వెంకటేశ్వర్లు, అంజి, నాగేంద్రబాబు, పెద్దమ్మాయి, రామయ్య, శివలక్ష్మి, జయలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

మార్క్సిజమే దేశ భవితకు దిక్సూచి

- 'సింధూరం' పుస్తకావిష్కరణ సభలో రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి



సింధూరం పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, వేదికపై వివి, ఉష తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కల్చరల్

దేశ భవితకు, పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ నుంచి విముక్తికి మార్క్సిజమే దిక్సూచి అని ప్రముఖ సాహితీవేత్త రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వివి, ఉష దంపతులు రాసిన 'సింధూరం' వచన కథా కావ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. రాచపాళెం మాట్లాడుతూ.. కార్మిక శ్రమతో వచ్చిన సంపదను పెట్టుబడిదారీ వ్యవస్థ కొల్లగొడుతోందన్నారు. నేటి ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని విమర్శించారు. పెట్టుబడిపై రచయిత వివి, ఉష రచించిన సింధూరం గ్రంథం కథా కావ్యమన్నారు. పాఠకులకు అర్థమయ్యే రీతిలో పదాల కూర్పు చేశారని అభినందించారు. సింధూరం పుస్తక రచయితల్లో ఒకరు, ప్రజాశక్తి జర్నలిజం స్కూలు పూర్వ ప్రిన్సిపల్ ఉన్నం వెంకటేశ్వర్లు (వివి) మాట్లాడుతూ.. కారల్‌మార్క్స్ రాసిన క్యాపిటల్ గ్రంథాన్ని కవితల రూపంలో తీసుకొచ్చి రచించిందే సింధూరమని పేర్కొన్నారు. పుస్తక సహ రచయిత కె.ఉష మాట్లాడుతూ.. పుస్తకావిష్కరణ రాచపాళెం చేతుల మీదుగా జరగటం ఎంతో సంతోషంగా ఉందని, పుస్తకం రచనకు రాచపాళెంతోపాటు సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ సహకరించారని తెలిపారు. విజ్ఞాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు డాక్టరు ప్రగతి, ప్రజ్ఞా సురేష్, శ్రీనివాసరావు, జిల్లా రచయితల సంఘం కార్యదర్శి గుత్తా హరి, ఆనంద్, పాత్రికేయులు సుబ్బరాయుడు, అక్బర్, శంకర్‌ప్రసాద్, ఎన్.వేణుగోపాల్, షఫీవుల్లా, రవిచంద్ర, ప్రభాకర్‌నాయుడు, పలువురు రచయితలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విజయసాయిరెడ్డి బహిరంగ క్షమాపణలు చెప్పాలి

టిడిపి ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

ప్రభుత్వ అధికారులైన సతీష్‌చంద్ర, పోలీస్ అధికారి వెంకటేష్‌ను బెదిరించేలా మాట్లాడిన వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి వారికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. గుంటూరులోని టిడిపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. సమర్థవంతమైన ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా, బ్లాక్‌మెయిల్ చేసే విధంగా వ్యవహరించటం ప్రజాస్వామిక విధానానికి విరుద్ధమన్నారు. వైసిపి నాయకులు అసెంబ్లీపై విశ్వాసం లేకపోవడంతోనే అసెంబ్లీ సమావేశాలను బాయ్‌కాట్ చేశారని ఎద్దేవా చేశారు. బిజెపి నాయకులు రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడాలే గాని రాష్ట్ర హక్కులను కాలరాసేలా మాట్లాడకూడదన్నారు.

విఆర్‌ఎ దారుణ హత్య

ప్రజాశక్తి - విశాఖప్రతినిధి

విశాఖపట్నం జిల్లా అనంతగిరి మండలంలో దారుణం చోటుచేసుకుంది. ఒక విఆర్‌ఎను అత్యంత దారుణంగా హతమార్చారు. హతుడు మొండెం నుంచి తలను వేరుచేసి తలను కిలోమీటర్ దూరంలో పడేశారు. విశాఖపట్నం జిల్లా అనంతగిరి మండలం కివర్ల పంచాయతీ జాలాడ గ్రామ సమీపంలో బాడం మచ్చులు అనే వ్యక్తి ఈ దారుణ హత్యకు గురయ్యాడు. బాడం మచ్చులు కివర్ల పంచాయతీలో జాలడ గ్రూప్ విఆర్‌ఎగా పనిచేస్తున్నాడు. హంతకులు అదే గ్రామానికి చెందిన వారుగా పోలీసులు అనుమనిస్తున్నారు.

ప్రత్యేక హోదా కోసం మార్చి 3న చలో ఢిల్లీ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలో హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 3వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నాలుగురోజుల పాటు ధర్నా చేయనున్నట్లు నాన్ పొలిటికల్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీహరినాయుడు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతి జిల్లాలోనూ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించాలని, ఢిల్లీలో రిలేదీక్ష, నిరసన, భిక్షాటనలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 20న ఒంగోలులో రౌండ్‌టేబుల్ సమావేశం, 22న శ్రీకాకుళంలో, 23న విశాఖపట్టణంలో సమావేశాలు ఉంటాయన్నారు. మార్చి 4న ఢిల్లీలోని ఎపి భవనం ముందు నిరసన, 5న భిక్షాటన, 6న కేంద్రమంత్రులకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు వివరించారు. సమావేశంలో నాన్ పొలిటికల్ జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వివి.ప్రసాద్, నవ్యాంధ్ర విద్యార్థి జెఎసి రాష్ట్ర అధ్యక్షులు అయ్యస్వామి, నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ ఎం.శ్రీనివాస్, జెఎసి ఆర్గనైజర్ సిహెచ్.అజయ్, విద్యార్థి జెఎసి జిల్లా అధ్యక్షులు జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాజ్‌మహాల్‌ను సందర్శించిన కెనడా ప్రధాని ట్రూడో

న్యూఢిల్లీ : కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో ఆయన భార్య సాఫీ గ్రెగొర్ ట్రూడో పిల్లలు జావియర్, ఎల్లే గ్రేస్, హాడ్రీన్‌లు ఆదివారం ఆగ్రాలోని తాజ్‌మహాల్‌ను సందర్శించారు. మధురలోని చుర్మురాలో ఉన్న ఏనుగుల సంరక్షణ కేంద్రమైన వైల్డ్ లైఫ్ శాంట్యూరిని కూడా వారు సందర్శించారు. ఈ నేపథ్యంలో శాంట్యూరిని రెండు గంటలపాటు మూసివేవారు. ట్రూడో ఆయన కుటుంబంతో సహా వారం పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ప్రభుత్వ, వాణిజ్య రంగ ప్రముఖలతోనూ ఆయన సమావేశమవ్వనున్నారు. ఇరు దేశాల నేతల తమ మధ్య సన్నిహిత స్నేహాన్ని ధృవీకరించుకోనున్నారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే మార్గాలను చర్చించనున్నారు.



సందర్శన
భారత్ పర్యటనలో భాగంగా ఆగ్రాలోని తాజ్ మహల్‌ను సందర్శించి కుటుంబ సభ్యులతో ఫొటో దిగుతున్న కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో

గుజరాత్‌లో నిరసనల వెల్లువ


అహ్మదాబాద్ : గుజరాత్‌లో దళితులకు భూమి కేటాయింపుల తీవ్ర జ్యాప్యాన్ని నిరసిస్తూ పటాన్ జిల్లా కలెక్టరేట్ వద్ద దళిత కార్యకర్త భాను వాంకర్ (62) నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకోవడంపై ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. వాంకార్ ఆత్మహత్యకు ప్రభుత్వానిదే బాధ్యత అని నినదించారు. గాంధీనగర్, అహ్మదాబాద్, మెహసాన్ జిల్లాలోని పటాన్ ప్రాంతాలలో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఈ ఆందోళనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న దళిత ఉద్యమ నేత, స్వతంత్ర ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానిని పోలీసులు అడ్డుకొని నిర్బంధించారు. కాంగ్రెస్ శాసన సభ్యుడు నౌషద్‌సోలాంకిని అహ్మదాబాద్ పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు.

ఇంత అనాగరికమా : మేవానీ

శాంతియుతంగా చేస్తున్న ఆందోళనల్లో పాల్గొనేందుకు వెళ్తున్న తమపై పోలీసులు అనాగరికంగా వ్యవహరించి దౌర్జన్యా నికి పాల్పడ్డారని ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ తెలిపారు. అహ్మదాబాద్‌లోని సారంగ్‌పూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న శాంతియుత ఆందోళనలో పాల్గొనేందుకు వెళ్తున్న తమను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని వాపోయారు. అత్యంత అనాగరికంగా కారులోంచి బయటకు లాగేసి, కారు తాళాలు పగలగొట్టి దాడి చేసినంత పని చేశారని మేవాని తెలిపారు. భానూజీ కుటుంబ డిమాండ్లు నెరవేర్చే వరకు తమ ఆందోళనను కొనసాగిస్తామని మేవానీ ట్వీట్ చేశారు.

21వ శతాబ్ది 'మేధో ఆర్థిక' యుగం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



న్యూఢిల్లీ: ప్రస్తుత 21వ శతాబ్ది కాలం మేధోపరమైన ఆర్థిక యుగమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభివర్ణించారు. ఆదివారం ఇక్కడ జరిగిన ఢిల్లీ యూనివర్సిటీ పిజి డిఎవి కాలేజ్ వజ్రోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పుడు వినూత్నమైన ఆలోచనా శక్తి డబ్బు కన్నా విలువైనదన్నారు. ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి సంప్రదాయక భారతీయ విలువలను జోడించినపుడు మాత్రమే మానవ సమాజం స్థిరమైన అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇ-కామర్స్, రవాణా, పర్యాటకం వంటిరంగాలలో యువత సాధిస్తున్న విజయాలను, స్టార్టప్‌లను ఆయన ప్రస్తావిస్తూ ద్రవ్య పెట్టుబడి కన్నా మానవ ప్రతిభ, నిజాయితీలే విజయానికి హేతువులన్నారు. '21వ శతాబ్ది కాలం మేధోపరమైన ఆర్థిక యుగం. ప్రస్తుత యుగంలో వినూత్న ఆలోచనలు, సిద్ధాంతాలు డబ్బుకన్నా విలువైనవి' అని ఆయన పునరుద్ఘాటించారు. ప్రస్తుత కాలంలో ఉపాధి అన్న పదానికి నిర్వచనం మారుతోందని ఉపాధి అంటే సంప్రదాయంగా ఉద్యోగం చేయటం మాత్రమే కాదని, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవటం మీకు, ఇతరులకు కూడా లాభదాయకంగా వుంటుంది' అని ఆయన సూచించారు.



దారులే వేరే..లక్ష్యం ఒక్కటే !

రజనీతో భేటీ అనంతరం కమల్

చెన్నయ్ : ప్రముఖ విలక్షణ నటదిగ్గజం కమల్ హాసన్ సూపర్ స్టార్ రజనీకాంత్‌తో ఆదివారం సమావేశమయ్యారు. తమిళనాడులో కమల్ హాసన్ బుధవారం నుంచి మెగా యాత్ర చేపట్టనున్న నేపథ్యంలో చెన్నయ్‌లో పోయెస్‌గార్డెన్‌లోని రజనీ నివాసంలో వీరిరువురు భేటీ అయారు. తాము ఎంచుకున్న దారులు వేరైనా ఇద్దరీ లక్ష్యమూ ప్రజలకు మంచి జరగాలన్నదేనని తమ ధ్యేయమని భేటీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇరువురు సూపర్ స్టార్లు వ్యాఖ్యానించారు. దాదాపు పదిహేను నిమిషాల సేపు సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్ మాట్లాడుతూ... రజనీని మర్యాదపూర్వకంగానే కలిశానని చెప్పారు. ఇద్దరి మధ్య రాజకీయాంశాలేమీ చర్చలోకి రాలేదన్నారు. రజనీతో కలిసి పనిచేస్తారా అనే ప్రశ్నకు ఎప్పటిలాగే సమాధానమిస్తూ.. దానిని కాలమే నిర్ణయిస్తుందన్నారు. ఈ నెల 21న మధురైలో కమల్ ప్రకటించనున్న పార్టీ ప్రారంభోత్సవానికి రావాలని రజనీని ఆహ్వానించానన్నారు. రజనీకాంత్ మాట్లాడుతూ.. డబ్బు, పేరు, అధికారం కోసం కమల్ రాజకీయాల్లోకి రావడం లేదని, కేవలం ప్రజలకు సేవ చేయాలనే గొప్ప సంకల్పంతో వస్తున్నారన్నారు. ఆయన విజయవంతమవ్వాలని రజనీ ఆకాంక్షించారు. ఇదిలా ఉంటే రజనీ, కమల్‌లు వేర్వేరుగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయడం గమనార్హం.

15 నగరాలు..45 ప్రాంతాల్లో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరం (ఈడీ)15 నగరాలు,45 వేర్వేరు చోట్ల సోదాలు నిర్వహించింది.ఇందులో గీతాంజలి,నక్షత్ర సంస్థలకు చెందిన కోల్‌కతాలో ఉన్న ఆరు షోరూమ్‌లలోనూ తనిఖీలు నిర్వహించారు.ఈడీ,సీబీఐ సంయుక్తంగా దోషులను పట్టుకోవటం,సాక్ష్యాధారాలను సేకరించేపనిలో భాగంగా ఆదివారం విస్తృతంగా ఆకస్మిక సోదాలు జరిపాయి.పీఎన్బీ అక్రమాలకు సంబంధించి లెటర్ ఆఫ్ అండర్ టేకింగ్(ఎల్ఓయూ) జారీ చేయటానికి బ్యాంకు అధికారులకు కమీషన్లు ముట్టజెప్పినట్టు గుర్తించామని సీబీఐ అధికారులు తెలిపారు.

శ్వేతపత్రానికి కాంగ్రెస్ డిమాండ్

కుంభకోణాలతో సతమతమౌతున్న దేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థ ప్రస్తుత స్థితి, గతులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మనిష్ తివారీ ఆదివారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో చోటు చేసుకున్న కుంభకోణాలతో మన దేశ బ్యాంకింగ్ వ్యవస్థ దాదాపు రు.61 వేల కోట్ల మేర నష్టపోయిందన్నారు. బిజెపి నేతృత్వంలోని ఎన్డీయేలో ఉన్నత స్థాయిలో వున్న కొందరు వ్యక్తులతో బ్యాంకులను మోసం చేసిన 'ఫ్రాడ్‌స్టర్స్'కు సంబంధాలున్నాయని ఆయన ఆరోపించారు.



మహామస్తకాభిషేకానికి పోటెత్తిన జైనులు

హస్సన్ : కర్ణాటకలోని శ్రావణబెలగోలలోని 'బాహుబలి' 88వ మహామస్తకాభిషేకానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది జైనులు తరలివచ్చారు. 12 ఏళ్లకు ఒక సారి నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొన్న తొలి ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య రికార్డులకెక్కారు. ఈ వేడుకకు హాజరయ్యేవారికి పదవీగండం ఉంటుందనే భయంతో గతంలో ముఖ్యమంత్రులెవ్వరూ పాల్గొనలేదని చెబుతారు. ప్రస్తుత సిఎం సిద్ధరామయ్య తానే వింధ్యగిరి పర్వత ప్రాంతం పైకెక్కి జలాభిషేకాన్ని నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమానికి హాజరైన సుమారు 360 మంది జైన మునుల నుండి సిద్ధరామయ్య దీవెనలు అందుకున్నారు.

ఎవరు జట్టు కట్టినా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేరు : సిద్ధ రామయ్య

రాష్ట్రంలో జెడి(ఎస్), బిఎస్పీ ఎన్నికల పొత్తు కాంగ్రెస్‌పై ఎటువంటి ప్రభావమూ చూపబోదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేంత ప్రభావం ఈ రెండు పార్టీలలో ఏ ఒక్కదానికీ లేదని ఆదివారం ఆయన తనను కలిసిన మీడియా ప్రతినిదులకు చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై స్పందిస్తూ 'మన దగ్గరున్న డబ్బును బ్యాంకుల్లో దాచుకోమంటున్న ప్రధాని నీరవ్ మోడీ వంటి వారు దానిని తీసుకెళ్తుంటే ఏం చేస్తున్నార'ని ప్రశ్నించారు.

ప్రశాంతంగా ముగిసిన త్రిపుర పోలింగ్

- 80 శాతం పైచిలుకు ఓటింగ్
- 15 శాతం ఇవిఎంల మోరాయింపు

ప్రజాశక్తి ప్రతినిధి - అగర్తల

స్వల్ప ఘటనలు మినహా త్రిపుర అసెంబ్లీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. దాదాపు 90 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే అధికారికంగా అందిన సమాచారం మేరకు 78 శాతం పైచిలుకు పోలింగ్ నమోదైందని ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎన్నికల కమిషన్ ప్రకటించింది. 2013 ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం 92గా ఉంది. దాంతో పోలిస్తే ప్రస్తుత ఎన్నికల్లో ఓటింగ్ తగ్గింది. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని, చెప్పుకోతగ్గ హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోలేదని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీరామ్ తరనికాంత తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ ప్రారంభమైన రెండు గంటల్లోనే అన్ని కేంద్రాల్లోనూ సగటున 23 శాతం పోలింగ్ నమోదైంది. గిరిజన ప్రాంతాలలో కూడా ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాదాపు 2, 3 గంటల పాటు ఓపికగా నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గుజరాత్, మధ్యప్రదేవ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ నుంచి ఎన్నికల పరిశీలకులుగా వచ్చిన ఐఎఎస్, ఊపిఎస్ అధికారులు కూడా ఎన్నికల ప్రక్రియపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. పలుచోట్లు ఓటింగ్ యంత్రాలు మోరాయించాయి. దాదాపు 15 శాతం వరకు ఇవిఎంలు, ఓటు నిర్ధారణ యంత్రాలు పని చేయలేదు. 3174 పోలింగ్ కేంద్రాల్లోని ఓటింగ్ యంత్రాల్లో 519 యంత్రాలు పనిచేయలేదు. సాయంత్రం 4 గంటల వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాల్లో బారులు తీరికనిపించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 5 గంటలకు కూడా ఓటర్లు బారులు తీరి నిలుచున్నారు. గోలఘుట ప్రాంతంలోని 18/8 సుభాష్‌నగర్ స్కూల్ కేంద్రం వద్ద సిపిఎం కార్యకర్తలపై బిజెపి గూండాలు దాడికి చేయడంతో ఇద్దరు సిపిఎం కార్యకర్తలు గాయ పడ్డారు. టకర్జోలాలోని మూడు పోలిం గ్ కేంద్రాల్లో తిరిగి పోలింగ్ జరపాలని సిపిఎం ఎన్నికల కమిషన్‌ను కోరింది. బిజెపి 9 పోలింగ్ కేంద్రాల్లో తిరిగి పోలింగ్ జరపాలని కోరింది.



త్రిపురలో ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు

భారీ మెజార్టీతో విజయం తథ్యం : సిపిఎం

సిపిఎం నాయకులు ఎంపి జితేంద్ర చౌదరి ప్రజాశక్తి ప్రతినిధితో మాట్లాడుతూ భారీ మెజార్టీతో లెఫ్ట్ గెలుస్తుందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల సందర్భంగా సిపిఎం అభ్యర్థులు అమల్ చక్రవర్తి, మనరంజన్ దేవ్ బర్మలు ఎంతో ఉత్సాహంగా కనిపించారు. ఓటింగ్ సమయంలో నెలకొన్న శాంతి, సామరస్య వాతావరణం వామపక్ష కూటమి విజయాన్ని సూచిస్తుందన్నారు. రామ్‌నగర్ వంటి నియోజక వర్గంలో సిపిఎం అభ్యర్థి రతన్ దేవ్ ఉప్పొంగే ఉత్సాహంతో తమదే గెలుపని ప్రజాశక్తి ప్రతినిధికి చెప్పారు. సబ్రూమ్, ధర్మనగర్, మనోనరంజన్ దేవ్ వర్మ పోటీ చేస్తున్న మందాయన్‌గర్‌లో నూటికి నూరు శాతం లెఫ్ట్ విజయం సాధించనున్నదని వారు చెప్పారు.

ఎన్నికల ప్రక్రియ ఆధునికం మాణిక్ సర్కార్

ఆధునిక ఎన్నికల సంఘం ఆధునిక పద్ధతుల్లో ఎన్నికల ప్రక్రియను నిర్వహించిందని త్రిపుర ముఖ్యమంత్రి మానిక్‌సర్కార్ అన్నారు. అగర్తలలో ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన పై విధంగా స్పందించారు. గిరిజన పర్వత ప్రాంతాలలో లెఫ్ట్ కార్యకర్తలు ఓటర్లకు అవసరమైన సహాయాన్ని అందించారు.



అగర్తలలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్

గుజరాత్‌లో నీటికి కటకట

పొదుపుగా వాడాలని పోలీసులకు హోంశాఖ ఆదేశం

అహ్మదాబాద్ : గుజరాత్ నీటి కోసం కటకటలాడుతోంది. తీవ్రమైన నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గత ఏడాది భారీ వర్షాలు కురిసినప్పటికీ రాష్ట్రానికి ప్రధాన నీటి వనరైన నర్మదా నదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ డామ్ (ఎస్ఎస్‌డి) వద్ద నీటి స్థాయి పడిపోవడంతో గుజరాత్‌లో నీటి కొరత ఏర్పడింది. మధ్యప్రదేశ్‌లోని నర్మదా పరీవాహక ప్రాంతంలో తగినంతగా వర్షపాతం లేని కారణంగా రాష్ట్రంలో నీటి కొరత ఏర్పడింది. సౌరాష్ట్ర, ఉత్తర గుజరాత్ ప్రాంతాలలో తాగునీటి అందించడంలో రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమౌతోంది. నీటి పొదుపు పాటించాలని ప్రజలకు హితవచనలు వల్లిస్తూ ప్రభుత్వం ఇప్పుడే చేతులెత్తేస్తుంటే వేసవిలో ఇంకెన్ని కష్టాలో పడాలో అర్థంకావడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలోనే నీటిని పొదుపు చేయాలని, అవసరం మేరకే వినియోగించాలని గుజరాత్ హోం శాఖ తన పోలీసు అధికారులకు అదేశాలు జారీ చేయడం విశేషం. పోలీసు స్టేషన్లలోనూ, స్టాఫ్ క్వార్టర్స్‌లలోనూ, జైళ్ళలోనూ నీటిని వృధా చేయొద్దని సూచించింది. తమతమ కార్యాలయాల లోనూ, పోలీసు స్టేషన్లలోనూ, స్టాఫ్ క్వార్టర్లలోనూ పైప్‌లైన్లలోనూ, వాటర్ టాంక్‌లలోనూ లీకేజ్‌లు ఉంటే మరమ్మ తులు చేయించాలని పేర్కొంది. నీటి ట్యాంకులు పొండి పొర్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాని తెలిపింది.

ప్రజాస్వామ్యం బిజెపి మౌలిక సూత్రం

బిజెపి ప్రధానకార్యలయ భవనం ప్రారంభోత్సవంలో మోడీ



న్యూఢిల్లీలో నూతనంగా నిర్మించిన బిజెపి ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోడీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా

న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యం అన్నది బిజెపి మౌలిక సూత్రమని, దీనితోనే మిత్రపక్షాలతో కలిసి విజయవంతంగా ప్రయాణిస్తున్నామని బిజెపి సీనియర్ నేత, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ కొత్తగా నిర్మించిన బిజెపి ప్రధాన కార్యాలయ భవన సముదాయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత బిజెపి కానీ, దాని పూర్వరూపమైన జనసంఘ్ కానీ స్వాతంత్ర్యా నంతరం దేశ ప్రయోజనాల కోసం అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించాయని మోడీ చెప్పుకొచ్చారు. 1951లో భారతీయ జనసంఘ్ ఆవిర్భావ నుండి ఇప్పటి వరకూ వ్యవస్థాపక సిద్ధాంతాల నుండి కానీ, దేశభక్తి నుండి పక్కకు జరగలేదని వివరించారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది నేతలకు కాంగ్రెస్ పార్టీతో సంబంధం వున్నప్పటికీ తరువాత వారు తమ రాజకీయ విలువల ప్రచారం కోసం కొత్త పార్టీలను ఏర్పాటు చేశారన్నారు.

స్వాతంత్ర్యా నంతరం జాతీయ స్థాయిలో ఒకటి లేదా రెండు గట్టి పార్టీలుం డాలన్న అవసరం ఏర్పడటంతో జనసంఘ్ ఆవిర్భవించింద న్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, పార్టీ ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

జెఎన్‌పిటి 4వ టెర్మినల్‌ను ప్రారంభించిన ప్రధాని

ముంబయి : మహారాష్ట్రలో ముంబయి నౌకాశ్రయంలో రు.7,900 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన జవహర్‌లాల్ నెహ్రూ పోర్టు (జెఎన్‌పిటి) నాల్గవ టెర్మినల్ తొలిదశను ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆదివారం జాతికి అంకితం చేశారు. ఈ టెర్మినల్ ద్వారా దేశం మొత్తం కార్గో కంటెయినర్ ట్రిఫిక్‌లో 50 శాతం మేర నిర్వహిస్తారని అధికారులు చెప్పారు. ఈ రేవు ద్వారా ప్రస్తుతం కొనసాగుతున్న కార్గో కంటెయినర్ ట్రాఫిక్ దాదాపు కోటి స్టాండర్డ్ కంటెయినర్ యూనిట్లు కాగా, తాజాగా ప్రారంభించిన నాల్గవ దశ ప్రాజెక్టుతో ఈ ట్రాఫిక్ రెట్టింపు కావటంతో ఇది ప్రపంచంలోని అతి పెద్ద ఓడరేవుల్లో 33 వస్థానంలోకి వస్తోంది. ఇందుకు విరుద్ధంగా చైనాలో ఇప్పటికే దాదాపు 2 కోట్లకు పైగా టిఇయు సామర్ధ్యంతో 15 రేవులు పనిచేస్తు న్నాయి. దేశంలోనే అతి పెద్ద ఓడరేవు అయిన జెఎన్‌పిటి ప్రస్తుతం 48 లక్షల స్టాండర్డ్ కంటెయినర్ యూనిట్ల సామర్ధ్యం తో వుండగా తాజా ప్రారంభంతో మరో 24 లక్షల యూనిట్ల సామర్ధ్యం జతపడుతుంది. రిమోట్ కంట్రోల్ ద్వారా ఈ నాల్గవ టెర్మినల్ తొలిదశ ప్రాజెక్టును ప్రారంభించిన ప్రధాని మోడీ రు.16,700 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయ తొలి దశ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు.

వెంటాడుతున్న నోట్ల రద్దు

సంఘటిత రంగంపైనా నోటు పోటు!

- నోట్ల రద్దు సమయంలో బాగా తగ్గిపోయిన ఉద్యోగాలు
- తయారీ రంగంలో 87,000, రవాణా రంగంలో 3,000 ఉద్యోగాలకు కోత
- లేబర్‌బ్యూరో నివేదిక

న్యూఢిల్లీ: ప్రధాని మోడీ తీసుకున్న పెద్ద నోట్లరద్దు నిర్ణయం సంఘటిత రంగంపైనా తీవ్ర ప్రభావం చూపినట్టు అధికారిక గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. దేశంలోని 80 శాతం ప్రయివేట్ ఉద్యోగాలను కల్పిస్తున్న సంఘటిత రంగంలో 2017 ఏప్రిల్-జూన్ త్రైమాసంలో నూతన ఉద్యోగాల సృష్టి బాగా నెమ్మదించినట్టు లేబర్‌బ్యూరో నివేదిక వెల్లడించింది. ఈ త్రైమాసంలో మొత్తమ్మీద 64,000 కొత్త ఉద్యోగాల కల్పన జరిగినట్టు నివేదిక పేర్కొన్నది. ఇది అంతకుముందు త్రైమాసం(జనవరి-మార్చి)కన్నా 65 శాతం తక్కువ. జనవరి-మార్చిలో 1,85,000 నూతన ఉద్యోగాల సృష్టి జరిగింది. 2016 ఏప్రిల్-జూన్‌తో పోల్చినా ఉద్యోగాల కల్పన తక్కువే కావడం గమనార్హం. 2016లో ఇదే కాలానికి 77,000 నూతన ఉద్యోగాల కల్పన జరిగింది. సంఘటిత రంగంలో 81 శాతం వాటా ఉన్న 8 రంగాల్లో లేబర్ బ్యూరో నివేదిక ఇచ్చింది. ఈ 8 రంగాల్లో ప్రతి కంపెనీ కనిష్టంగా కనీసం 10మందికైనా ఉద్యోగాలు కల్పిస్తాయి.

గతేడాది ఏప్రిల్-జూన్‌లో ఎక్కువగా నష్టపోయింది తయారీ రంగమేనని నివేదిక తెలిపింది. ఈ కాలంలో ఈ రంగం కొత్తగా ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగుల్లోనే 87000మందికి ఉద్వాసన పలికింది. అంతకుముందు త్రైమాసం (జనవరి-మార్చి)లో ఈ రంగం 1,02,000 నూతన ఉద్యోగాలు కల్పించింది. ఏప్రిల్-జూన్‌లో రవాణా రంగంలో 3000 ఉద్యోగాలకు కోత పడగా, అంతకుముందు త్రైమాసంలో 3000 ఉద్యోగాలు కల్పించింది.

ఏప్రిల్-జూన్‌లో వాణిజ్యం,ఐటీ-బీపీవో రంగాల్లోనూ ఉద్యోగాల కల్పన నెమ్మదించింది. ఇదే కాలంలో కాంట్రాక్ట్ ఉద్యోగాల కల్పన, దినసరి కార్మికుల ఉపాధి కూడా బాగా దెబ్బతిన్నట్టు అధికారిక అంచనా. 64,000 కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ కాలంలో కోత పడింది. ఇదే త్రైమాసంలో 2016లో కోత పడిన 48,000కన్నా ఇది అధికం. కాంట్రాక్ట్, దినసరి,కాజువల్ కార్మికులు ఎక్కువగా ఉపాధి కోల్పోయింది కూడా తయారీ రంగంలోనేనని లేబర్‌బ్యూరో తెలిపింది. సాంకేతికంగా వచ్చిన మార్పుల వల్ల నైపుణ్య కార్మికుల అవసరం పెరుగుతున్నదని.. దాంతో, స్వల్ప నైపుణ్య కార్మికులు ఉపాధి కోల్పోతున్నారంటూ కేంద్ర గణాంకశాఖ మాజీ చీఫ్, ఇంటర్నేషనల్ గ్రోత్ సెంటర్(ఐజీసీ) డైరెక్టర్ ప్రొనబ్‌సేన్ విశ్లేషించారు.



సంక్షిప్తం

రాజస్థాన్‌లో ట్రక్కు బోల్తా పడి నలుగురి మృతి

సికార్: రాజస్థాన్‌లోని సికార్ సమీపాన నీమ్‌కా పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం ఒక బోరింగ్ యంత్రానికి సంబంధించిన ట్రక్కు బోల్తా పడిన ఘటనలో నలుగురు వ్యక్తులు మరణించారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో డ్రైవర్ వాహనంపై అదుపు కోల్పోవటంతో ట్రక్కు బోల్తా పడిందని నీమ్‌కా ఠాణా అధికారి రంజిత్ సింగ్ చెప్పారు. మృతులలో ముగ్గురిని ఛత్తీస్‌గఢ్‌చెందిన కూలీలు రతిరామ్, దినేష్ మాసురామ్‌గాను, ద్విచక్రవాహన చోదకుడు సుదేష్ జాట్‌గాను గుర్తించారు.

జనాభా నియంత్రణకు సుప్రీంలో పిల్ దాఖలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని హస్తినలో కాలుష్య, జనాభా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ మూడు వేర్వేరు పిటిషన్లు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలుగా ఆదివారం నాడు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు దాఖలు చేసిన న్యాయవాదులు అనుజ్ సక్సేనా, పృథ్వీరాజ్ చౌహాన్, ప్రియా శర్మ మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం 2022 నాటికి దేశ జనాభా 150 కోట్ల దాటుతుందన్నారు. దేశంలో కొనసాగుతున్న నిరుద్యోగిత, పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం, కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ వంటివి జనాభా విస్ఫోటనానికి సంబందించిన కొన్ని ప్రభావాలు మాత్రమేనని వారు వ్యాఖ్యానించారు.

రసాయనిక ఆయుధాలు ప్రయోగించలేదు : టర్కీ

అంకారా : సిరియాలోని ఆఫ్రిన్ నగరంపై తాము రసాయనిక ఆయుధాలు ప్రయోగించలేదని టర్కీ పేర్కొన్నది. అంకారా సైన్యం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడటమే కాకుండా సిరియాలో రసాయనిక ఆయుధాల ప్రయోగానికి పాల్పడుతోందనే విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. సైన్యంపై వచ్చిన విమర్శలను టర్కీ అధ్యక్షుడి ప్రధాన సలహాదారు యాసిన్ అక్తే ఖండించారు. కాగా, సిరియాలోని కుర్దు తిరుగుబాటుదారుల లక్ష్యంగా టర్కీ సైన్యం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

హజ్ వాలంటీర్లుగా ట్రాన్స్‌జెండర్లు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ చరిత్రలో తొలిసారిగా హజ్ యాత్రికులకు వాలంటీర్లుగా సేవలందించేందుకు హిజ్రా(ట్రాన్స్‌జెండర్ల)లను పాక్ ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఈ ఏడాది హజ్ యాత్రికుల బృందంతో కొంతమంది ట్రాన్స్‌జెండర్ యువకులను వాలంటీర్లుగా పంపేందుకు పాక్‌ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్థానిక మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. ఖుద్దముల్ హుజాజ్ (హజ్ వాలంటీర్లు)గా సేవలందించేందుకు కొంతమంది ట్రాన్స్ జెండర్ యువకులను సౌదీ అరేబియాకు పంపేదుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐపిసి సింధ్ బోయ్స్ స్కౌట్స్ కమిషనర్ ఆతిఫ్ అమీన్ హుస్సేన్‌ను ఉటంకిస్తూ పాక్ పత్రిక ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తా కథనాన్ని వెలువరించింది.



సాయం చేసేందుకు వెళ్తూ..

మెక్సికో దక్షిణ ప్రాంతంలో భూకంప బాధితులను కాపాడేందుకు వెళ్తున్న సైనిక హెలిక్టాపర్ తీరప్రాంతంలోని పినోటెపా నేషనల్ పట్టణంలో లాండింగ్‌కు కొద్ది ముందు కూలిపోయిన దృశ్యం.

మెక్సికోలో హెలీకాప్టర్ కూలి 13 మంది మృతి

ప్రాణాలతో బయటపడ్డ హోంమంత్రి

మెక్సికో సిటీ: మెక్సికో దక్షిణ ప్రాంతంలో ఒక సైనిక హెలీకాప్టర్ కూలిన ఘటనలో 13 మంది మరణించారని అధికారులు చెప్పారు. మెక్సికో దక్షిణ ప్రాంతంలో సంభవించిన భూకంపం అనంతరం అక్కడి ప్రజలకు సాయం చేసేందుకు సైనిక సిబ్బందితో పాటు ఆ దేశ హోం మంత్రిని కూడా తీసుకెళు తున్న ఈ హెలీకాప్టర్ తీర ప్రాంతంలో వున్న పినోటెపా నేషనల్ పట్టణంలో లాండింగ్‌కు కొద్ది సేపటి ముందు ప్రమాదవశాత్తూ కూలిపోయినట్లు ఆక్సాకా స్టేట్ అధికారులు చెప్పారు. ఇందులో ప్రయాణిస్తున్న మెక్సికో హోంమంత్రి అల్ఫాన్సో నవరెట్, ఆక్సాకా గవర్నర్ అలెజాండ్రో మురాట్‌లో ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు. ప్రమాద ఘటనా స్థలంలోనే 12 మంది మరణించగా తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించటంతో మృతుల సంఖ్య 13కు చేరిందని అధికారులు చెప్పారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరో 15 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు.

ఐక్యతను కాపాడుకోవాలి

పాలస్తీనా ప్రధాని పిలుపు



రమల్లా : ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన అవసరం వుందని పాలస్తీనా ప్రధానమంత్రి రమీ హందల్లా పిలుపునిచ్చారు. శనివారం నాడు ఆయన అకాబా నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఐక్యతగా వున్నపుడే అన్ని కుట్రల నుండి మన దేశాన్ని రక్షించుకోగలమని, చట్టబద్ధమైన హక్కులను వినియోగించుకోగలమని అన్నారు. ఐక్యంగా వున్నపుడే అమెరికా తీసుకునే అన్యాయమైన నిర్ణయాలను, ఇజ్రాయిల్ ఉల్లంఘనలను సమర్ధవంతంగా ఎదుర్కోగలమని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు కావల్సిందల్లా పాలస్తీనా ప్రజల మధ్య ఐక్యతను బలోపేత ంచేయటంతో పాటు గాజా స్ట్రిప్‌పై పాలస్తీనా నేషనల్ అథారిటీ పూర్తి స్థాయి అధికారాలను దక్కించుకునేలా చూడాల్సి వుందని ఆయన అన్నారు. ప్రభుత్వానికి ఆర్థిక సాధికారికతతో పాటు సరిహద్దులపై అదుపు, శాంతి, భద్రతల పరిరక్షణాధికారం, న్యాయవ్యవస్థకు సంపూర్ణ అధికారం వంటివాటిని సాధించగలిగితే గాజా ప్రజల బాధలకు తెరదించవచ్చన్నారు. అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విదేశీ ఆర్థిక సాయం తగ్గిందని, ఇది మరింత తగ్గే అవకాశం వున్నందున దీనిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించటం కోసం ప్రభుత్వం అందుబాటులో వున్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటున్నదని ఆయన చెప్పారు.

తుపాకీ సంస్కృతికి కళ్లెం వేయండి...!

ఫ్లోరిడా కాల్పుల తరువాత అమెరికాలో పెరుగుతున్న డిమాండ్




తుపాకుల వినియోగాన్ని తక్షణమే నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఫ్లోరిడాలో ఆందోళన చేస్తున్న ప్రజలు

పార్క్‌లాండ్/వెస్ట్ పామ్‌బీచ్ (అమెరికా): పలువురు అమాయక విద్యార్థులను పొట్టన పెట్టుకున్న ఫ్లోరిడా హైస్కూల్ కాల్పుల ఘటన అనంతరం అమెరికాలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న తుపాకీ సంస్కృతికి కళ్లెం వేయాలన్న డిమాండ్ క్రమంగా ఊపందుకుంటోంది. ఫ్లోరిడా కాల్పుల ఘటన విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ, విచ్చలవిడిగా కొనసాగుతున్న తుపాకీ సంస్కృతిని కట్టడి చేయాలన్న డిమాండ్‌తో అనేక రాష్ట్రాల్లో వేలాది మంది ప్రదర్శనలు నిర్వహించారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ భారీయెత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ మార్చి 14న 17 నిముషాల పాటు దేశవ్యాప్తంగా విద్యాసంస్థల నుండి వాకౌట్ చేయాలని వుమెన్స్ మార్చ్ అనే సంస్థ నిర్వాహకులు టీచర్లు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వమే స్కూళ్లను నిర్వహించాలన్న డిమాండ్‌తో ఉద్యమిస్తున్న నెట్‌వర్క్ ఫర్ పబ్లిక్ ఎడ్యుకేషన్ అనే సంస్థ ఏప్రిల్ 20న దేశవ్యాప్తంగా వున్న స్కూళ్లు, విద్యాసంస్థలన్నింటిలో వాకౌట్‌లు, సిట్‌లు వంటి వాటితో నిరసన తెలియచేయాలని పిలుపునిచ్చింది. 1999లో ఇదే రోజు కొలరాడోలోని కొలంబియన్ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో 12 మంది విద్యార్థులు ఒక టీచర్ మరణించిన విషయం తెలిసిందే. దీనితో పాటు ఫ్లోరిడా కాల్పులపై నిరసన వ్యక్తం చేస్తూ దేశవ్యాప్తంగా శనివారం నాడు సోషల్ మీడియా వేదికగా నిరసనలు వెల్లువెత్తాయి. తుపాకీ సంస్కృతిని కట్టడి చేయాలని, అందుకు ప్రత్యేకంగా చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేస్తూ కాల్పుల ఘటన జరిగిన పార్క్‌లాండ్‌లోని మార్జోరీ స్టోన్‌మన్ డగ్లస్ హైస్కూల్, అక్కడికి 40 కి.మీ దూరంలో వున్న ఫోర్ట్ లాడర్‌డేల్, సెంట్ పీటర్స్‌బర్గ్ తదితర ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఫ్లోరిడా కాల్పుల ఘటనకు సంబంధించిన అనుమానితుడు నికొలస్ క్రుజ్‌కు సంబంధించిన తాజా వివరాలు వెల్లడి కావటంతో దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి.

ఎఫ్‌బిఐది తప్పు

డొనాల్డ్ ట్రంప్



ఫ్లోరిడా స్కూల్ కాల్పుల ఘటనలో అనుమానితుడికి సంబం ధించిన అనేక సంకేతాలను ఎఫ్‌బిఐ జారవిడు చుకున్నదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శించారు. ఈ ధోరణి ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన ట్విట్టర్‌లో స్పష్టగం చేశారు. ట్రంప్ ఎన్నికల ప్రచారంలో రష్యన్‌ల జోక్యాన్ని నిరూపించేందుకు వారు సమయాన్నంతా వెచ్చిస్తు న్నారు తప్ప ఇతర విషయాలేవీ పట్టించుకోవటం లేదని ఆయన మండిపడ్డారు. మళ్లీ సాధారణ విధుల్లోకి వచ్చి దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆయన ఎఫ్‌బిఐ అధికారులకు పిలుపుని చ్చారు. ఫ్లోరిడా హైస్కూల్ కాల్పుల ఘటన అనుమా నితుడికి 'చంపాలన్న కోరిక' బలంగా వుండేదని, అతడికి తుపాకులు అందుబాటులో వున్నాయని, స్కూల్‌పై దాడికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడని ఎఫ్‌బిఐకి గత నెలలోనే సంకేతాలు అందినట్లు తెలు స్తోంది. అయితే ఈ సమాచారాన్ని పరిశోధించ టంలో తమ ఏజెంట్లు విఫలమయ్యారని ఎఫ్‌బిఐ వెల్లడించింది. ప్రజలకు భద్రత కల్పించటంలో విఫల మైన ఎఫ్‌బిఐ డైరెక్టర్ క్రిస్టోఫర్ రే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఫ్లోరిడా గవర్నర్ రిక్ స్కాట్ డిమాండ్ చేశారు.

ప్రజాదరణ కోల్పోతున్న ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్

పారిస్: ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్‌కు లభిస్తున్న ప్రజాదరణకు క్రమంగా గండిపడుతోంది. తాజాగా నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో ఆయనకు లభిస్తున్న ప్రజామోదం 50 శాతానికి తక్కువగా నమోదు కావటం విశేషం. గత ఏడాది అక్టోబర్‌లో లభించిన ప్రజామోదానికి ఇది అత్యంత కనిష్టస్థాయిలో వున్నట్లు తెలుస్తోంది. ఫ్రాన్స్ ప్రభుత్వ సేవలను వ్యయభరితం చేసేందుకు మాక్రాన్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సమయంలో ఆయనకు లభిస్తున్న ప్రజామోదం దిగజారుతుండటం గమనార్హం. ప్రముఖ వారపత్రిక లే జర్నల్ డు, డిమాంచే దినపత్రికల కోసం ఈ నెల 7-17 తేదీల మధ్యలో ఐఫాప్ సంస్థ నిర్వహించిన ఈ సర్వేలో దాదాపు 44 శాతం మంది మాత్రమే మాక్రాన్ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గత జనవరిలో నిర్వహించిన ఒపీయిన్ పోల్‌లో 50 శాతం మంది సంతృ ప్తి వ్యక్తం చేయగా కేవలం నెలరోజుల వ్యవధిలో ఆరుశాతం మేర పడిపోవటం విశేషం. గత అక్టోబర్‌లో నిర్వహించిన సర్వేలో మాక్రాన్ పాలనపై 42 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో ప్రభుత్వ పాలనను ఆధునీ కరించేం దుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాక్రాన్ ప్రభుత్వం ఈ నెలార ంభం లో ప్రకటి ంచిన విషయం తెలిసిందే. ప్రజల నుండి వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ ప్రభుత్వ రంగంలో మార్పులు చేసే విషయంలో తమకు ఎటువంటి సంకోచాలు లేవని ప్రధా ని ఎడురాడ్ ఫిలిప్ ప్రకటించారు. త్వరలోనే ప్రభుత్వ ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఆర్థిక మంత్రి గెరాల్డ్ దర్మానిన్ కూడా చెబుతున్నారు.

బ్రెగ్జిట్ చర్చల వైఫల్యంపై వెల్లువెత్తుతున్న ఆగ్రహం

లండన్: ఐరోపా కూటమి నుండి బ్రిటన్ నిష్క్రమించే ప్రక్రియ (బ్రెగ్జిట్)పై బ్రస్సెల్స్‌లో జరుగుతున్న చర్చలు ఇప్పటికీ ఓ కొలిక్కి రాకపోవటంపై బ్రిటన్ ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనితో తమ భవితపై భయాందోళనలు వ్యక్తం చేస్తున్న బ్రిటన్‌లు, తమపై పడే ఆర్థిక భారం ఎంత వుంటుందోనన్న లెక్కల్లో మునిగిపోయారు. కొంతమంది యూరోపియన్లు ఇప్పటికే తమ జీవితాలను మార్చే నిర్ణయాలను తీసేసుకుంటున్నారు. ఆఫీస్ వర్కర్లు, రైతులు, ఇతర వృత్తి నిపుణులు కొత్త భాగస్వాముల కోసం అన్వేషిస్తూ తమ వ్యాపారాలను కొత్త చోటికి మార్చే ప్రయత్నాలను కొనసాగిస్తూ, కొత్త వ్యాపారావకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. రాజకీయ నేతలు తమ భవితకోసం తాజా ప్రణాళికలను రూపొందించుకునే పనిలో నిమగ్నమయ్యారు. బ్రెగ్జిట్ ప్రక్రియపై బ్రిటిష్, ఇయు దౌత్యవేత్తలు గత వారంలో బ్రస్సెల్స్‌లో చర్చలను పునఃప్రారంభించిన నేపథ్యంలో బ్రెగ్జిట్ అనంతర పరిస్థితిపై సంతృప్తికరమైన అవగాహన వెలువడుతుందని బ్రిటన్ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే బ్రెగ్జిట్ తరువాత బ్రిటన్-ఇయు మధ్య భావి సంబంధాలపై పూర్తి అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఏ విధంగా ముందడుగు వేయాలన్న అంశంపై బ్రిటన్ సర్కారులో తీవ్ర విభేదాలు నెలకొన్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో బ్రిటన్‌లో నివశిస్తున్న దాదాపు 30 లక్షల మంది ఐరోపా వాసుల భవిత ప్రశ్నార్థకంగా మారింది. బ్రెగ్జిట్ తమ జీవితాలలో ప్రతి భాగాన్ని ప్రభావితం చేస్తోందని బ్రిటన్‌లో నివశిస్తున్న పోలిష్ పౌరుల్లో ఒకరైన రేడియో ప్రజంటర్ గోసియా ప్రోచల్ ఆందోళన వ్యక్తం చేశారు.



'ఉపాధి'లో విజయనగరం అగ్రస్థానం

1,92,95,702 పని దినాలతో ముందంజ

ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో విజయనగరం జిల్లా అగ్రస్థానంలో నిలుస్తోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా అత్యధిక పనిదినాలు నమోదు చేస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకూ 1,92,95,702 పనిదినాలు కల్పించి ముందంజలో నిలిచింది. శ్రీకాకుళం జిల్లా 1,83,54,768, విశాఖ జిల్లా 1,72,51,959 పనిదినాలు కల్పించి రెండు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఉత్తరాంధ్ర వెనుకబడిందనడానికి ఇక్కడి ప్రజలు ఉపాధి పనులపై ఎక్కువగా ఆధారపడుతుండడం అద్దం పడుతోంది. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర ఒకటి. ఇందులో విజయనగరానిది అట్టడుగు స్థానం. ఈ జిల్లాలో పరిశ్రమలు మూతపడడం, వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో ఎక్కువమంది పేదలు ఉపాధి పనులపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా రోజుకు 1,69,551 మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. ఆ తర్వాత స్థానంలో విశాఖ జిల్లా ఉంది. గుంటూరు జిల్లాలో అతి తక్కువగా 22,778 మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. విజయనగరం జిల్లాలో ప్రతిసారీ రికార్డు స్థాయిలోనే ఉపాధి పనులు నమోదవుతున్నాయి. గతంలో రెండు దఫాలు జాతీయ పురస్కారం కూడా దక్కింది. ఈసారి కూడా అదే వేగంతో పనులు జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 40 రోజులు మిగులుండడంతో ఈసారి నాలుగు, ఐదు జిల్లాల్లో రెండు కోట్లు దాటి పని దినాలు నమోదయ్యే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

రాష్ట్రంలో ఉపాధి పనుల తీరు

జిల్లా పేరు	జాబ్‌కార్డులు	రోజుకు పని దినాలు	మొత్తం పనిదినాలు
విజయనగరం	5,03,328	1,69,551	1,92,95,702
శ్రీకాకుళం	5,64,668	69,377	1,83,54,768
ప్రకాశం	7,24,607	85,076	1,83,30,200
విశాఖ	4,80,916	1,24,789	1,72,51,959
తూర్పుగోదావరి	8,13,209	91,111	1,50,69,601
అనంతపురం	7,84,294	63,431	1,31,88,083
పశ్చిమగోదావరి	7,23,790	50,649	1,14,93,734
కర్నూలు	7,72,276	51,292	97,34,361
నెల్లూరు	5,83,967	43,948	96,22,065
గుంటూరు	7,81,188	22,778	87,70,873
కడప	5,52,689	38,133	86,51,972
చిత్తూరు	6,61,437	76,604	84,18,833
కృష్ణా	6,10,840	24,819	71,17,849

మానిటరింగ్ సెల్‌తో ఫలితాలు

విజయనగరం జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్ సత్ఫలితాలను ఇస్తోంది. అధికారులతో నిరంతరం పర్యవేక్షించి పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపడుతున్నాం. అందుకే రాష్ట్రంలోనే ముందున్నాం.

- బి.రాజగోపాల్, డ్వామా పీడీ

నాలుగేళ్లయినా అవేనా

పెరగని డైట్, కాస్మోటిక్ ఛార్జీలు

ప్రతిపాదనలపై స్పందించని ప్రభుత్వం

పరిశీలన పేరుతో పదినెలలుగా కాలయాపన




ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమ శాఖల పరిధిలోని ప్రీ మెట్రిక్, కళాశాలల హాస్టళ్లు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఉంటున్న ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. మెరుగైన మౌలిక సదుపాయాలు, పోషకాహారం అందించి, చదువుకోవడానికి ఆరోగ్య కరమైన వాతావరణాన్ని కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందింది. విద్యార్థులకు మెస్ ఛార్జీలతో పాటు కాస్మోటిక్ ఛార్జీల్ని ఇంత వరకు పెంచకపోవడమే దీనికి నిదర్శనం. నాలుగేళ్ల నుంచి పాత వాటినే అమలు చేస్తూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో 188 ఎస్సీ, 179 ఎస్టీ, 37 బిసి గురుకుల పాఠశాలలు, 984 సాంఘిక సంక్షేమ, 139 గిరిజన సంక్షేమ, 897 బిసి సంక్షేమ ప్రీమెట్రిక్ ప్రభుత్వ హాస్టళ్లున్నాయి. వీటితో పాటు 287 సాంఘిక సంక్షేమ, 156 గిరిజన, 354 బిసి సంక్షేమ కళాశాల హాస్టళ్లు, 389 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో లక్షలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రీమెట్రిక్ హాస్టళ్లలో చదువుకుంటున్న 7వ తరగతి పిల్లలకు రూ. 750, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు రూ. 850లు డైట్ ఛార్జీల కింద చెల్లిస్తోంది. అలాగే బాలురకు రూ. 62, బాలికలకు రూ. 75 చొప్పున కాస్మోటిక్ ఛార్జీలిస్తున్నారు. కళాశాల హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు మెస్ ఛార్జీల కోసం నెలకు రూ. 1050 చెల్లిస్తోంది. అయితే ప్రస్తుతం నిత్యావసర ధరలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయే కానీ తగ్గడం లేదు. ధరల కనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీల్ని పెంచాల్సి ఉంటుంది. కానీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదు. పాత ఛార్జీలనే ప్రభుత్వం చెల్లిస్తోంది. విద్యార్థులు వాడే సబ్బులు, నూనెలతో పాటు హేర్ కటింగ్ ఛార్జీలు కూడా విపరీతంగా పెరిగిపోవడంతో ప్రస్తుతం అందించే కాస్మోటిక్ ఛార్జీలు కూడా సరిపోవడం లేదు.

ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ ఛార్జీల్ని పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని ఆయా సంక్షేమ శాఖాధికారుల్ని ఆదేశించింది. ప్రస్తుతం అందించే రూ. 750లను రూ. 1000లకు, రూ. 850లను 1200కి, రూ. 1050లను 1500లకు పెంచేలా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో పాటు బాలుర కాస్మోటిక్ ఛార్జీల్ని రూ. 62 నుంచి రూ. 125, బాలికల కాస్మోటిక్ ఛార్జీల్ని రూ. 75ల నుంచి రూ. 150 లకు పెంచాలని ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి పది నెలలవుతున్నా, ఇంత వరకు ప్రభుత్వం ఎటువంటి నిర్ణయాన్నీ తీసుకోలేదు. పరిశీలన పేరుతో ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి కూడా అమలవుతాయో లేదో అని ఆయా శాఖల అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఒంటిమిట్ట చెరువులో 5 మృత దేహాలు

ప్రజాశక్తి - కడప సిటీ ప్రతినిధి



కడప జిల్లా ఒంటిమిట్ట చెరువులో ఐదు మృతదేహాలు బయట పడ్డాయి. ఆదివారం స్థానికులు చెరువులో తేలుతున్న మృతదేహాలను గుర్తించడంతో విషయం బయట పడింది. పోలీసులకు సమాచారం తెలియజేయడంతో జిల్లా పోలీసు, రెవెన్యూ, ఫారెస్టు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి మృతదేహాలను వెలికితీసే చర్యలు ప్రారంభించారు. బోట్లు, ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటికి తెచ్చారు. ప్రాథమిక వివరాల ప్రకారం మృతి చెందిన వారంతా తమిళనాడుకు చెందిన ఎర్రచందనం అక్రమ రవాణా కూలీలుగా అధికారులు భావిస్తున్నారు.

కడప-రేణిగుంట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఒంటిమిట్ట చెరువులో ఐదుగురి మృతదేహాలు తేలియాడటంపై పలు కథనాలు వినవస్తున్నాయి. శుక్రవారం రాత్రి కొంతమంది ఎర్రచందనం కూలీలు లారీలో వచ్చి చెర్లోపల్లి - ఒంటిమిట్ట మధ్య చెరువు కట్ట మీద దిగి అడవిలోకి వెళ్లే యత్నం చేసినట్లు తెలిసింది. అడవుల్లోకి వెళు తున్న క్రమంలో పోలీసులు తారసపడిన సందర్భంగా ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. పోలీసుల బారి నుంచి తప్పించుకోవడానికి హైవేకు అనుకుని ఉన్న చెరువులోకి దూకినప్పుడు చెరువులోని ముళ్లపొదల్లో చిక్కుకుని చనిపోయారా, ఎవరైనా హత్య చేసి చంపి చెరువులో పడేశారా, అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. మృతదేహాలపై గాయాలు కనిపిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు గాయపరిచారా లేక చేపలు కొరకడంతో గాయాలయ్యాయా? అనేది విచారణలో తేల్చాల్సి ఉంది. ఇటీవల పోలీసులు, ఫారెస్టు అధికారులు ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధంపై దృష్టి సారించారు. శనివారం పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఘటన చోటుచేసుకుని ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంఘటనా స్థలానికి ఓఎస్‌డి నయీం హస్మీ, ఆర్‌డిఒ వీరబ్రహ్మం, రెవెన్యూ, పోలీసులు, ఫారెస్టు, అగ్నిమాపక అధికారులు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాలను వెలికితీసిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. దీనిపై ఓఎస్‌డి, ఆర్‌డిఒ స్పందిస్తూ మృత్యు ఘటనపై విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడిస్తామని పేర్కొనడం గమనార్హం.

మొదటి పేజీ తరువాయి

ఇరాన్‌లో ఘోర విమాన ప్రమాదం

రాజధాని టెహ్రాన్‌కు 780 కి.మీ దూరంలో కుప్పకూలిపోయింది. రాజధాని టెహ్రాన్ నుండి యాసూజ్ నగరానికి వెళ్తున్న ఈ విమానం టేకాఫ్ అయిన కొద్దినిముషాలలోనే రాడార్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఇరాన్ స్టేట్ ఎమర్జెన్సీ సర్వీసెస్ విభాగం ఈ విమానం కోసం గాలింపు ప్రారంభించింది. ఇసఫాన్ ప్రావిన్స్‌కు దక్షిణాన వున్న జుగ్రోస్ పర్వత ప్రాంతంలో ఈ విమానం కూలిపోయి నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో మంచు ఎక్కువగా కురుస్తుండటంతో ఈ ప్రమాదం జరిగిందని, మంచు ప్రభావంతో సహాయక చర్యలకు కూడా విఘాతం ఏర్పడుతోందని అధికారులు చెప్పారు. సహాయక చర్యలకు సంబంధించిన విమానాలు ఘటనా స్థలికి చేరుకోలని పరిస్థితి నెలకొన్నదని అధికారులు వివరించారు. ఇటీవలే రష్యాకు చెందిన ఓ విమానం హిమపాతం కారణంగా కూలిపోయిన ఘటనలో 71 మంది మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే.

మరొకరు పరార్

నిబంధనలను సైతం విస్మరించాయని సంబంధిత వర్గాలు ధృవీకరించాయి. కొఠారి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి రు.485 కోట్లు, అలహాబాద్ బ్యాంక్ నుండి రు.352 కోట్లు రుణం తీసుకున్నారు. ఏడాది గడిచిన తరువాత అతడు తీసుకున్న రుణం సొమ్ముకానీ, దానికి సంబంధించిన వడ్డీ కానీ బ్యాంకుకు చెల్లించలేదని తెలుస్తోంది. గత వారం రోజులుగా కాన్పూరులోని కొటారికి చెందిన కేంద్ర కార్యాలయం తాళం వేసి దర్శనమిస్తోంది. అప్పటి నుండి కొఠారీ జాడ కూడా తెలియటం లేదు. ఇదిలా వుండగా కొఠారీ ఆస్తులను విక్రయించటం ద్వారా తమ రుణ బకాయిలను రాబట్టుకోగలమని అలహాబాద్ బ్యాంక్ మేనేజర్ రాజేష్ గుప్తా తెలిపారు.

సౌదీలో వ్యాపారానికి భర్త అనుమతి అక్కర్లేదు...

రియాద్ : సౌదీలో మహిళలు వ్యాపారాలు ప్రారంభించాలంటే ఇకపై భర్త లేదా కుటుంబంలోని మగవ్యక్తుల అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదు. ఈ దిశగా విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని సౌదీ ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. ప్రయివేట్ రంగాన్ని శరవేగంతో అభివృద్ధి చేయాలని సౌదీ సర్కార్ భావిస్తున్నది. దానిలో భాగంగా గార్డియన్‌షిప్ విధానంలో సంస్కరణలు చేపట్టాలని కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టం ప్రకారం ఏ మహిళ అయినా వ్యాపారం చేయాలంటే కచ్చితంగా భర్త, తండ్రి లేదా సోదరుడి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో, ఉద్యోగాలు చేయాలన్నా లేదా వ్యాపారం ప్రారంభించాలన్నా మహిళలు వెనుకంజ వేస్తున్నారు.


ఎన్టీఆర్

కొత్త గెటప్

పాత్ర కోసం ప్రాణం పెట్టే నటుల్లో ఎన్టీఆర్ ఒకరు. 'నాన్నకు ప్రేమతో', 'జై లవ కుశ' చిత్రాల్లో ఆయన చేసిన పాత్రలు విభిన్నమైనవి. అందులో ఆయన గెటప్‌లు కూడా కొత్తగానే ఉన్నాయి. 'నాన్నకు ప్రేమతో'లో వేషధారణ అయితే ఓ ట్రెండ్‌ను సృష్టించింది. ఎప్పుడూ లేనిది 'టెంపర్'లో కూడా కండలు చూపించాడు. ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కనున్న తాజా చిత్రం కోసం ప్రత్యేకంగా ముంబాయిలో తర్ఫీదు పొందుతున్నాడు. దాని కోసం బరువు కూడా తగ్గాడు. ఈ చిత్రం కొత్తగా కనిపించాలని ప్రముఖ జిమ్ ట్రైనర్ లాయిడ్ స్టీవెన్స్‌తో శిక్షణ ఇప్పిస్తున్నారు. తర్ఫీదు ఎలా జరుగుతోంది అన్నదానిపై ట్రైనర్ సామాజిక మాధ్యమంలో ఆపడేట్స్ ఇచ్చాడు. 'ఓపిక పట్టండి. మేము చాలా కష్టపడుతున్నాం. ఎన్టీఆర్‌కు సంబంధించిన లుక్ గురించి త్వరలోనే అప్‌డేట్స్ ఇస్తాం. మేము పడిన కష్టానికి మంచి ప్రతిఫలం దక్కిందని మాత్రం చెప్పగలను' అని పేర్కొన్నాడు. ఈ చిత్రం హీరోయిన్ ఎవరు? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. పూజా హెగ్డే, అను ఇమ్మాన్యుయేల్ పేర్లను పరిశీలిస్తున్నారు. త్రివిక్రమ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు.

స్నేహితుడు, భాగస్వామి

శ్రుతి హాసన్ చాలా రోజుల నుంచి సినిమాలకు దూరంగానే ఉంటుంది. ఇక్కడ దక్షిణాదిలోగానీ, అక్కడ బాలీవుడ్‌లోగానీ సినిమాలు చేయడం లేదు. శ్రుతి మైఖేల్ క్రాసల్‌తో ప్రేమాయణం నడుపుతుందని గతంలో ప్రచారం జరిగింది. దాన్ని ఆమె ఖండించనూ లేదు. అవునని చెప్పనూలేదు. ఇటీవల శ్రుతి స్నేహితురాలు వివాహ వేడుకలో వీరిద్దరూ కలసి కనిపించారు. మైఖేల్ తమిళ సంప్రదాయంలో దుస్తులు ధరించి ఆ వివాహానికి హాజరయ్యారు. వీరితో కమల్ కూడా ఉన్నారు. మైఖేల్, శ్రుతి త్వరలో వివాహం చేసుకోబోతున్నారని అప్పట్లో ప్రచారం మొదలైంది. ఇప్పుడు మైఖేల్‌తో ఉన్న సంబంధాన్ని బహిర్గతం చేసిందీ భామ. మైఖేల్ జన్మదినోత్సవం శుభాకాంక్షలు తెలుపుతూ తన బెస్ట్ ఫ్రెండ్, పాట్నర్ అని పేర్కొంది.


శ్రుతి హాసన్

మే 11న 'సాక్ష్యం'

దర్శకుడు శ్రీవాస్, బెల్లంకొండ శ్రీనివాస్ కాంబినేషన్‌లో 'సాక్ష్యం' చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం తాజా షెడ్యూల్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగుతోంది. ఇందులో పూజా హెగ్డే హీరోయిన్. అభిషేక్ పిక్చర్స్ పతాకంపై అభిషేక్ నామా నిర్మిస్తున్నారు. ఈ డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను మే 11న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రేమికుల రోజున విడుదల చేసిన చిత్రం లోగోకు విశేష స్పందన వచ్చిందని నిర్మాతలు చెబుతున్నారు. ప్రస్తుతం రామోజీ ఫిలిమ్ సిటీలో భారీ సెట్స్ వేసి షూటింగ్ జరుగుతోందని పేర్కొన్నారు. ప్రతి సన్నివేశాన్ని అత్యద్భుతంగా మలుస్తున్నాడు శ్రీవాస్ అని తెలిపారు. ఈ చిత్రం ఆఖరి షెడ్యూల్ కోసం అమెరికా వెళ్లనున్నారు. ఇందులో జగపతిబాబు, శరత్ కుమార్, మీనా, వెన్నెల కిషోర్, జయప్రకాష్, పవిత్ర లోకేష్, బ్రహ్మాజీ, రవికిషన్, అశుతోష్ రాణా, మధు గురుస్వామి, లావణ్య తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు.


బెల్లంకొండ శ్రీనివాస్

అక్షయ్‌తో నటించాలన్నది నా కల

- పరిణీతి చోప్రా


అక్షయ్ కుమార్

పరిణీతి చోప్రా త్వరలో అక్షయ్ కుమార్ హీరోగా చేస్తున్న 'కేసరి' చిత్రంలో నటించనుంది. ఆమెకు ఈ అవకాశం రావడం, అందులోనూ సూపర్ స్టార్ అక్షయ్‌తో కలసి పని చేయబోతుండడంపై చాలా ఎగ్జైట్ అవుతున్నట్టు పేర్కొంది. అనురాగ్ సింగ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హవిల్దార్ సింగ్ పాత్రలో అక్షయ్, ఆయనకు భార్యగా పరిణీతి కనిపించనుంది. దీనిపై ఆమె మాట్లాడుతూ ' అక్షయ్‌తో కలిసి పనిచేయడానికి చాలా ఆతృతగా ఎదురు చూస్తున్నా. మరో మూడు రోజుల్లో నేను ఇప్పుడు చేస్తున్న 'నమస్తే ఇంగ్లాండ్' షూటింగ్ పూర్తవుతుంది. అక్షయ్ పక్కన నటించడం నా కల. అందులోనూ నేను మెయిన్ హీరోయిన్‌గా కావడంతో మరింత సంతోషంగా ఉంది. షూటింగ్ ఎప్పుడు ప్రారంభమవుతుందా? అని ఆతృతగా ఎదురు చూస్తున్నా. ఈ అమ్మడు ఇప్పుడు వరకూ అమృత్‌సర్‌లో చేస్తున్న 'నమస్తే ఇంగ్లాండ్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది.


పరిణీతి చోప్రా

దెయ్యాలతో సరదా ఆట

హీరో శ్రీకాంత్ , నాజియా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'రా రా'. విజి చరిష్ విజన్స్ పతాకంపై నిర్మితమవుతుంది. గిరిబాబు, సీత, నారాయణ, అలీ, రఘుబాబు, పోసానికృష్ణమురళి, పృథ్వీ, జీవ, చంద్రకాంత్, అదుర్స్ రఘు,హేమ, షకలక శంకర్, నల్లవేణు తదితరులు నటిస్తున్నారు. శ్రీ మిత్ర చౌదరి సమర్పణలో విజి చెర్రీస్ విజన్స్ నిర్మించిన ఈ చిత్రం ఈనెల 23న విడుదలవుతుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు.

శ్రీకాంత్ మాట్లాడుతూ ' ఇది హాస్యంతో కూడిన హర్రర్ థ్రిల్లర్ చిత్రం. మనుషులకు, దెయ్యాలకు మధ్య సాగే సరదా ఆటలు సగటు సినిమా ప్రేక్షకుడిని వినోదాల తీరంలో విహరింపజేస్తాయి. హర్రర్ కామెడీ థ్రిల్లర్ చిత్రం నేను తొలిసారి చేస్తున్నాను. 'రా..రా 'చిత్రం ప్రేక్షకుల ఆదరణకు నోచుకుంటుదని ఆశిస్తున్నాను' అని తెలిపారు.

నాని మాట్లాడుతూ "నాకు అష్టాచమ్మా' నుండి శ్రీకాంత్‌తో మంచి పరిచయం ఉంది. నటుడిగా ఆయనేంటో అందరికీ తెలుసు. ఇప్పుడు హర్రర్ మూవీ 'రా రా' చేస్తున్నారు. ఈ సినిమా ఆయనకు మరో పెద్ద హిట్ చిత్రంగా నిలవాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. శ్రీకాంత్‌కు ఇది125వ సినిమా అని, అందరూ కమెడియన్స్ కలిసి ఈ సినిమాలో నటించారని తరుణ్ చెప్పారు.

నిర్మాత శ్రీమిత్ర చౌదరి మాట్లాడుతూ ' ఈ కథ విన్న తర్వాత విజయ్ డైరెక్ట్ చేయాలని అనుకున్నాం. శ్రీకాంత్ వంటి సీనియర్ హీరో ఇలాంటి సినిమా చేయడం గొప్ప విషయం. సినిమా తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది' అని తెలిపారు.


నాని, శ్రీకాంత్, తరుణ్

మే నుంచి మొదలవుతుంది


సాయి ధరమ్ తేజ్

సాయిధరమ్ తేజ్, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో ఓ చిత్రం రూపొందనుంది. శ్రీబాలాజీ సినీ మీడియా పతాకంపై తెరకెక్కనున్న ఈ సినిమా రెగ్యుల్ షూటింగ్ మే నుంచి మొదలు కానుంది. జె.భగవాన్-జె.పుల్లారావు సంయుక్తంగా నిర్మించనున్నారు. 'కొత్త జోనర్‌లో ఈ సినిమా ఉండబోతోంది. ఇదివరకూ సాయి ధరమ్ తేజ్ చేయని కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందనుంది. లేటెస్ట్ మ్యూజికల్ సెన్సేషన్ ఈ చిత్రానికి బాణీలు సమకూర్చనున్నాడు' అని నిర్మాతలు తెలిపారు.

హైదరాబాద్ లవ్ స్టోరీ

రాహుల్ రవీంద్ర, రేష్మి మీనన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'హైదరాబాద్ లవ్ స్టోరీ'. జియా, రావు రమేష్, సూర్య, సన ముఖ్య తారాగణంగా నటిస్తున్నారు. రాజ్ సత్య దర్శకత్వం వహిస్తున్నారు. సునీల్ కశ్యప్ బాణీలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ఫ్యామిలీ ఆడియెన్స్‌లో మంచి క్రేజ్ సంపాదించుకొందని చిత్రబృందం చెబుతుంది. ఈ సినిమాను ఈ నెల 23న ప్రేక్షకుల ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం అని నిర్మాతలు తెలిపారు. ఎడిటింగ్ :ఎంఆర్ వర్మ, కెమెరా : బీబీ అమర్ నాథ్ రెడ్డి, నిర్మాతలు : ఎంఎల్ రాజు, ఆర్ఎస్ కిషన్, వేణుగోపాల్ కొడుమగుల్ల.



నా పేరు అమితాబ్



జాబ్ కోసం అప్లికేషన్

పేరు : అమితాబ్ బచ్చన్.

పుట్టిన తేదీ :11.10.1942.

వయసు : 76 సంవత్సరాలు.

అనుభవం : 49 ఏళ్ల సినీ పరిశ్రమలో పని చేశా- సుమారు 200 సినిమాల్లో నటించాను.

మాట్లాడే భాష : హిందీ,

ఎత్తు : 6.2 అడుగులు.

ఇవన్నీ చూస్తుంటే ఏదైనా జాబ్ కోసం అప్లికేషన్ పెట్టినట్టుంది కదా. నిజమే ఇది జాబ్ కోసం ట్విట్టర్‌లో అమితాబ్ పెట్టుకున్న రెజ్యూమ్. ఇదేంటి ఆయన ఇప్పుడు జాబ్ కోసం దరఖాస్తు పెట్టడమేంటి? అనుకుంటున్నారా? సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే బిగ్ బీ తన ట్విట్టర్ ఖాతా నుంచి ఓ రెజ్యూమ్‌ను పోస్టు చేశారు. దీపికా పదుకొనే, కత్రినా కైఫ్ వద్ద పని చేయడానికి అని. దీనితో పాటు ఇంగ్లీష్ పత్రికలో వచ్చిన ఓ వార్త క్లిప్పింగ్‌ను కూడా జత చేశారు. అమిర్ ఖాన్, షాహిద్ కపూర్ కంటే దీపికా పదుకొనే, కత్రినా కైఫ్ పొడవుగా ఉన్నారన్నది ఆ వార్త సారాంశం. దీని వల్ల వీరితో సినిమాలు చేయడం కష్టంగా మారిందన్నది అసలు విషయం. వీరిద్దరితో అమితాబ్ కలసి పని చేయడానికి ఎత్తు సమస్య ఎప్పటికీ రాదని ఆ ట్విట్టర్ పోస్టులో పేర్కొన్నారు. కత్రినా, దీపికా ఈ పోస్టు చూసి చిన్ననవ్వుతో ఉన్న పిక్‌ను పోస్టు చేశారు.


దీపికా పదుకొనే


కత్రినా కైఫ్





సిబిల్ నివేదికలో క్రెడిట్ స్కోర్

షాపులో.. కేవలం పదివేల రూపాయల ఖరీదుగల సెల్‌ఫోన్‌ని వాయిదా పద్ధతిలో కొనాలన్నా.. సిబిల్‌స్కోర్ చెక్‌చేసి.. ఆమోదముద్ర వేస్తేగానీ.. రుణసంస్థలు లోన్ ఇవ్వడంలేదు. ఇక పర్సనల్‌లోన్, గృహరుణాలు, క్రెడిట్‌కార్డ్స్, వాహనరుణాలు.. ఇలా ఎలాంటి రుణం తీసుకోవాలన్నా.. ఇవ్వాలన్నా సిబిల్‌స్కోర్ లేదా క్రెడిట్‌స్కోర్‌పైనే ఆధారపడుతున్నాయి రుణసంస్థలు. గతంలో వ్యక్తిగత పూచీ, ఆదాయం, ధృవపత్రాలు, ఖాతాదారునిపట్ల నమ్మకం ఆధారంగా రుణాలు మంజూరు చేసేవి. ప్రస్తుతం సామాన్యులు మొదలుకొని కోటీశ్వరుడి వరకూ ఎవరైనా రుణసంస్థల నుంచి రుణాలు పొందాలంటే సిబిల్‌స్కోర్ అప్రూవల్ అనేది తప్పనిసరి. అసలు సిబిల్‌స్కోర్ అంటే ఏమిటి? క్రెడిట్‌స్కోర్‌ను ఎలా కొలమానంగా చూస్తారు? ఇదే ఇవాల్టి 'రూపాయి' కథనం..

ఇక మీదట ఆర్థికసంస్థల నుంచి ఎలాంటి రుణం (లోన్) తీసుకోవాలన్నా.. కచ్చితంగా సిబిల్ స్కోర్ మెరుగ్గా ఉండాల్సిందే అని.. ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. ఇప్పటిదాకా.. సిబిల్ స్కోర్ బాగున్నా.. లేకున్నా.. బ్యాంకులు.. ఖాతాదారుడి వ్యక్తిగత సామర్థ్యంపై నమ్మకం ఉంచుకుని, వివిధ రకాల రుణాలు ఇచ్చేవి. కానీ ఇప్పుడు ఏ రుణం పొందాలన్నా.. సిబిల్ రిపోర్ట్ అందజేసే క్రెడిట్ స్కోరే కీలకంగా మారనుంది.

ఆర్బీఐ ఏమందంటే?!

రూ.50 వేలకు పైన రుణ మంజూరుకు సంబంధించి తప్పనిసరిగా సిబిల్ స్కోరును పరిగణనలోకి తీసుకోవాలని, కనీసం 700పైన క్రెడిట్ స్కోరు ఉన్న వారికే రుణాలు ఇవ్వాలని రిజర్వ్‌బ్యాంకు చెబుతోంది. అంతేకాదు, ప్రభుత్వ, ప్రభుత్వేతర బ్యాంకులన్నీ సిబిల్ పరిధిలోకి రావాలని ఆర్బీఐ సూచన చేసింది. అలాగే రైతులు తీసుకునే స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల మంజూరు, చెల్లింపు ప్రక్రియను సిబిల్‌లో నమోదు చేసేలా చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి కచ్చితంగా సిబిల్ స్కోరును ప్రామాణికంగా తీసుకోవాలని బ్యాంకింగ్ రంగాలన్నింటికీ ఆర్బీఐ ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం ఆ ఆదేశాలకు లోబడే రుణసంస్థలు ఖాతాదారులకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. అందుకే సిబిల్ నివేదిక, క్రెడిట్‌స్కోర్ పట్ల అవగాహన ఉంటే మంచిది.






స్కోర్ ఎంత ఉండాలి?

వ్యక్తిగత అవసరాల నిమిత్తం తీసుకునే రుణాలతో పాటు ఇళ్ళు, వాహనం, విద్య, ఆస్తి తాకట్టు రుణాలకూ సిబిల్ స్కోర్‌ను ప్రామాణికంగా చూస్తున్నారు. ఏ ఖాతాదారుడైనా రుణానికి దరఖాస్తు చేసినప్పుడు ముందుగా వారి సిబిల్ స్కోరును పరిశీలిస్తారు. స్కోరు 700 కంటే తక్కువగా ఉంటే దరఖాస్తును ప్రారంభదశలోనే తిరస్కరిస్తారు. 700 దాటి ఉంటే రుణ మంజూరుకు అవసరమైన ఇతర పరిశీలన నిమిత్తం పరిగణనలోకి తీసుకుంటారు. సిబిల్ స్కోరు 700 నుంచి 750 మధ్య ఉన్న ఖాతాదారులకు సంబంధించి అన్ని లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. రుణాలు ఎగవేయడం, వన్‌టైమ్ సెటిల్‌మెంట్లు చేసుకోవడం వంటివి కనిపిస్తే.. అర్హతలున్నాగానీ ఆవ్యక్తికి రుణం ఇవ్వరు. స్కోరు 750 నుంచి 850 మధ్య ఉంటే దరఖాస్తుదారు అర్హతలను బట్టి 48 గంటల్లో రుణం మంజూరు చేస్తారు.



గతంలోనూ స్కోరే కీలకం

సాధారణంగా ఏదైనా రుణం(లోన్) కావాలంటే.. బ్యాంకులు ఎంత క్రెడిట్‌స్కోర్‌ని ప్రామాణికంగా తీసుకుంటాయనే విషయలోకి వెళితే? కనీసంగా 730 స్కోర్ దాటాలి. గతంలోనూ ప్రభుత్వ పరిధిలోని బ్యాంకులన్నీ.. సిబిల్ స్కోర్‌నే పరిగణనలోకి తీసుకునేవి. ప్రయివేట్ బ్యాంకులు, సహకార బ్యాంకులు వంటివి.. సిబిల్‌స్కోర్‌ని పెద్దగా పరిగణనలోకి తీసుకొనేవికావు. గృహరుణాల విషయంలో సిబిల్‌స్కోర్ ప్రస్తావన లేకుండానే రుణాలు అందజేసేవి. ఇటీవల రిజర్వ్‌బ్యాంకు తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ, ప్రయివేట్, సహకార బ్యాంకులు ఇలా అన్ని ఆర్థికసంస్థలూ.. రుణాలు ఇచ్చేముందు సిబిల్‌స్కోర్ పరిగణనలోకి తీసుకోవాల్సిందే అని స్పష్టం చేసింది. దీంతో.. రుణ మంజూరు




విషయంలో కొంత పారదర్శకత, నిక్కచ్చితనం కనిపించే అవకాశాలు ఉన్నాయి.

క్రెడిట్ స్కోర్ ఎలా గుర్తిస్తారు?

గతంలో ఏదైనా రుణం తీసుకుని, దాని చెల్లింపుల హిస్టరీ (చెల్లింపుల ట్రాక్ రికార్డ్) ఆధారంగా సిబిల్ సంస్థ ఈ క్రెడిట్ స్కోరింగ్ ఇస్తుంటుంది. పర్సనల్, హౌసింగ్, కారు, క్రెడిట్‌కార్డ్స్ ఇలా తమ రుణాలను మంజూరు చేసే ముందు ఆయా బ్యాంకులు దరఖాస్తుదారుడికి సంబంధించిన స్కోరింగ్ వివరాలను సిబిల్ సంస్థ (క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా లిమిటెడ్) నుంచి తెప్పించుకుంటాయి. వాటి ఆధారంగా దరఖాస్తుదారుడికి లోన్ ఇవ్వాలా? వద్దా? అని నిర్ణయానికి వస్తాయి. గతంలో చాలా బ్యాంకులు 750 క్రెడిట్‌స్కోర్‌ని మినిమమ్ అర్హతగా పెట్టుకుని, రుణాలు ఇచ్చేవి. ఇప్పుడది నూరుశాతం ప్రామాణిక అర్హతగా మారుతోంది.


క్రెడిట్ స్కోర్ లేదంటే?

రకరకాల రుణాలు కోసం అప్లై చేశాక.. బ్యాంకుల నుంచి చాలామంది మొదటిగా వినేమాట. 'మీ క్రెడిట్‌స్కోర్ బావుంటే. రెండురోజుల్లో లోన్ మంజూరు అవుతుంది?' అంటుంటారు. లేదంటే 'మీ క్రెడిట్‌స్కోర్ చాలా పూర్‌గా ఉండటం వల్ల.. మీకు లోన్ రావడం కష్టం సార్!' అనేస్తారు. అసలు క్రెడిట్‌స్కోర్ లేకపోవడానికి చాలాకారణాలుంటాయి. స్థిరమైన ఆదాయ వనరులు ఉన్నవాళ్ళు, ముఖ్యంగా బ్యాంకుల ద్వారా జీతాలను అందుకునేవాళ్ళు చాలామంది క్రెడిట్‌కార్డ్ హోల్డర్స్ అయి ఉంటారు. బ్యాంకులూ నెలసరి జీతం ఆధారంగా క్రెడిట్‌కార్డులు ఆఫర్ చేస్తుంటాయి. ఇవ్వడం, తీసుకోవడం వరకూ అంతా సవ్యంగానే జరిగిపోతుంది. అయితే క్రెడిట్‌కార్డ్ వాడాక తిరిగి చెల్లింపులు సక్రమంగా లేనప్పుడు, అంటే నిర్ణీత సమయంలో చెల్లించకపోవడం, కొంతమంది ఎగవేతకు పాల్పడటం ఇవన్నీ క్రెడిట్‌స్కోర్‌లో నమోదయ్యే కీలకాంశాలు. ఒక్కమాటలో చెప్పాలంటే.. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపులు సక్రమంగా ఉంటే క్రెడిట్‌స్కోర్ బావున్నట్టే!



చెల్లిస్తే సరిపోదు

బ్యాంకుల నుంచి తీసుకున్న వివిధ రకాల రుణాలు, క్రెడిట్‌కార్డ్‌ల బకాయిలు చెల్లించడంలో రెండు, మూడు నెలలు ఆలస్యం జరిగినా, లేదంటే వ్యక్తిగత ఇబ్బందులు కారణంగా చెల్లించలేకపోయినా, ఆ తర్వాత ఏకమొత్తంగా చెల్లించి, సమస్య నుంచి బయటపడేందుకు బ్యాంకుకు కట్టాల్సిన సొమ్మును సెటిల్‌మెంట్ రూపంలో కట్టేసినాగానీ.. క్రెడిట్‌స్కోర్ అనుకూలంగా ఉండదు. సిబిల్ రిపోర్ట్‌లో 'సెటిల్డ్' అని చూపిస్తూ ఏయే బ్యాంకుల్లో అప్పులు తీసుకుని, సరిగ్గా కంతులు చెల్లించక, సెటిల్‌మెంట్‌ని ఆశ్రయించారనే వివరాలన్నీ అందులో ఉంటాయి. దీంతో బ్యాంకులు రుణం ఇవ్వడానికి జంకుతాయి. ఫర్వాలేదు.. అప్పులు చెల్లించాడు కదా.. అని.. అంతో ఇంతో బ్యాంకులు నమ్మి, తిరిగి రుణాలు ఇవ్వడానికి ముందుకొచ్చేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్నీ, అలా వ్యవహరించే బ్యాంకుల్నీ కట్టడి చేయడానికి రిజర్వ్‌బ్యాంకు మరింత కఠిన నిర్ణయాలు తీసుకునే ప్రయత్నంలో ఉంది.



క్రెడిట్ స్కోర్ ఉండాల్సిందే

"మేమెప్పుడూ బ్యాంకుల్లో రుణాలు తీసుకోము. అవసరం లేదు" అని మడికట్టుకు కూర్చుంటే.. క్రెడిట్‌స్కోర్ బ్రహ్మాండంగా ఉంటుందని అనుకోవడం తప్పులో కాలేసినట్టే. ఎప్పుడూ ఏ బ్యాంకు నుంచీ రుణాలు తీసుకోకపోయినా, క్రెడిట్‌కార్డులు వాడకపోయినా.. అలాంటివారిని క్రెడిట్‌బ్యూరో సంస్థ ఉత్తములుగా గుర్తించి "వీళ్ళు చాలా మంచివాళ్ళు.. రుణాలిచ్చేయండి" అని అలాంటివారికి మద్దతు పలకదు. ఎందుకంటే అలాంటివారి ఫైనాన్షియల్ ట్రాక్ రికార్డ్ బ్యూరోలో ఉండదు. ఉండాలంటే లోన్లు తీసుకోవాలి. అందుకు తగ్గట్టుగానే క్రమశిక్షణతో చెల్లింపులు చేస్తూ ఉండాలి. అప్పుడే క్రెడిట్‌స్కోర్ విషయంలో గుడ్ సర్టిఫికెట్ దక్కుతుంది.

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ బ్యాంకులతో లావాదేవీలు జరపడం అనివార్యం. కొన్ని సందర్భాల్లో అత్యవసరం కూడా. రుణాలు ఏ రూపంలో తీసుకున్నా.. నిర్ణయించిన, నిర్దేశించిన సమయాల్లో క్రమం తప్పకుండా చెల్లిస్తూ ఉంటే క్రెడిట్‌స్కోర్ వెన్నుదన్నుగా ఉంటుంది. బ్యాంకుల నుంచి రుణాలు పొందాలంటే.. క్రెడిట్‌బ్యూరో సంస్థ మనల్ని వెరీగుడ్ అనాల్సిందే! సో.. బ్యాంకు రుణాలు, క్రెడిట్‌కార్డ్ చెల్లింపుల విషయంలో బకాయిలు లేకుండా జాగ్రత్తపడాలి.

- వి. చైతన్య

'రూపాయి'కి మీరూ రాయండి!



బ్యాంకు, పోస్టాఫీసు, షేర్ మార్కెట్, మ్యూచువల్ ఫండ్స్, ఎల్ఐసీ, ఇతర బీమాపథకాలు, ఇన్‌కంటాక్స్ వంటి ఆర్థిక విషయాలపై మీరూ మీ అనుభవాలను 'రూపాయి' ఫీచర్‌కి పంపండి. సంబంధిత విషయాలపై సలహా, సూచనల్ని తెలియజేయండి. ఏవైనా సందేహాలు ఉంటే రాయండి.

మా చిరునామా

**రూపాయి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com
ఫోన్ నెం. 9490099006**



చిన్నారి

పొడుపు కథ

చల్లని గాలి పైపైకి,
నీటిఆవిరి శీతల ప్రాంతానికి,
నీరు మంచుగడ్డల్లోకి,
వర్షంతో పాటు భూమి పైకి?

జవాబు : వడగండ్లు

జోక్ :

తండ్రి : ఏరా చింటూ! ఇవాళ పరీక్షలో ఎన్ని ప్రశ్నలిచ్చారు?
చింటూ: అయిదు
తండ్రి : నువ్వెన్ని రాశావు?
చింటు : మొదటి రెండు, చివరి మూడు తప్ప అన్నీ రాసేశాను నాన్నా!

చుక్కలు కలపండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కలను కలిపి, ఆ బొమ్మకు రంగులు వేయండి!

ఆహారం కడిగి తింటుంది!



పిల్లలూ! మనం రోడ్డుమీద వెళుతున్నప్పుడు.. ఆకలివేస్తే ఏ కాయో, పండో కొనేసి, తింటాం. కానీ, అలా తినకూడదు. ఎందుకంటే దానిలో కంటికి కనిపించని సూక్ష్మక్రిములు ఉంటాయి. అందుకే వాటిని నీళ్లతో కడుక్కుని, తినాలి. ఈ అలవాటును మనం కేవలం మనుషుల్లోనే చూస్తుంటాం. కానీ ఒక జంతువు ఆహారాన్ని కడుక్కుని తింటుందట! మీరు నమ్మటం లేదు కదా! ఇది నిజమే పిల్లలూ..! ఆ జంతువు పేరే రెకూన్. వాటికి ఎంత ఆకలిగా ఉన్నా ఆహారం కడగడానికి నీరు లభించకపోతే ఆ పదార్థాలను అవి ముట్టవట. ఇంకొక చిత్రమైన విషయం ఏమిటంటే నీటిలో దొరికిన ఆహారాన్నీ ఇవి కడుగుతాయి. అవి ఆహారాన్ని ఎందుకు కడుగుతాయో స్పష్టమైన కారణాలు ఇప్పటికీ తెలియలేదు. రెకూన్ పాలిచ్చే జంతువు. ఇవి దక్షిణ కెనడా నుంచి పనామా వరకూ గల ఎత్తయిన కొండల్లో నివసిస్తాయి. బూడిద రంగులో ఉండి, పచ్చని లేదా గోధుమరంగు మచ్చలుంటాయి. దీని తోక సుమారు 25 సెంటీమీటర్ల పొడవు ఉండి, వెంట్రుకలు కుచ్చులా ఉంటాయి. ఇవి ఆహారం కోసం పదునైన పంజాను ఉపయోగిస్తాయి. బురద, మురికినీళ్ళల్లో ఆహారాన్ని వేటాడతాయి. పశ్చిమ దేశాలలో కనిపించే రెకూన్ జనవరి-జూన్ నెలల మధ్య జతకడతాయి. ఆడ రెకూన్ తొమ్మిది వారాల తర్వాత ఒకటి నుంచి ఏడు పిల్లలను పెడుతుంది. స్థానం మారినప్పుడు ఆడ రెకూన్ పిల్లలను ఒక్కొక్కటిగా కొత్త స్థానానికి చేరవేస్తుంది. వీటిని మాంసం, చర్మంపై ఉండే జుట్టు కోసం వేటగాళ్ళు వేటాడతారు. ★





ఉల్లిపాయ కథ



అనగనగా ఒక ఊర్లో నలుగురు స్నేహితులున్నారు. వారే మిరపకాయ, టమాటా, ఐస్, ఉల్లిపాయ. ఒకరోజు అందరూ కలిసి సినిమాకు వెళ్లాలని ప్లాన్ చేసుకున్నారు. సినిమాకు వెళుతుంటే దారిలో భజ్జీలు వేసుకునే అతను మిరపకాయని తీసుకుని భజ్జీ వేసుకొని తింటాడు. అప్పుడు టమాటా, ఐస్, ఉల్లిపాయ ఏడుస్తూ సినిమాకెళ్ళి సినిమా చూస్తున్నారు. అప్పుడే ఒకతను హడావిడిగా వచ్చి టమాటా మీద కూర్చున్నాడు. దాంతో టమాటా చనిపోయింది. తర్వాత ఐస్, ఉల్లిపాయ ఏడుస్తూ ఇంటికి బయలుదేరారు. అప్పుడు దారిలో వాటికి ఒక నది కనిపించింది. ఆ నదిలోకి ఇద్దరూ దిగారు. వెంటనే ఐస్ కరిగిపోయింది. అప్పుడు ఉల్లిపాయ ఏడుస్తూ దేవుడి దగ్గరికి వెళ్లి 'దేవుడా! మిరపకాయ చనిపోతే నేను, ఐస్, టమాటా ఏడ్చాం. టమాటా చనిపోతే నేనూ, ఐస్ ఏడ్చాం. ఐస్ చనిపోతే నేను ఏడ్చాను. అయితే ఒకవేళ నేను చనిపోతే ఎవరు ఏడుస్తారు?" అని దేవుడిని వేడుకొంది. అప్పుడు దేవుడు "నిన్ను ఎవరయితే కోస్తారో వాళ్లే ఏడుస్తారు..!" అని చెప్పాడు. ఆ రోజు నుంచి ఎవరు ఉల్లిపాయను కోసినా వాళ్లు ఏడుస్తూనే ఉన్నారు.



కథ సేకరణ: పి .పూజిత,
5వ తరతి, శ్రీ సాయి విజేత యూపీ స్కూలు,
పుట్లూరు (గ్రా), అనంతపురం(జిల్లా)

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

**చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com**

తొలి టీ20లో భారత్ గెలుపు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ భువనేశ్వర్

- ధావన్ 72 పరుగులు

జొహెనెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన తొలి టీ20లో భారత్ 28 పరుగులతో ఘన విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో బోణి చేసింది. కోహ్లి సేన విధించిన 204 పరుగుల లక్ష్యాన్ని చేధించడానికి బరిలోకి దిగిన సఫారీలు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు మాత్రమే చేయగలిగారు. జట్టులో హెండ్రిక్స్ రాణించిన మిగిలిన వారు భారత బౌలర్లను ఎదుర్కొలేకపోయారు. ముఖ్యంగా భువనేశ్వర్ దాటికి నిలవలేకపోయారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ భువనేశ్వర్ నాలుగు ఓవర్లలో 24 పరుగులు ఇచ్చి 5 వికెట్లు సాధించాడు. దక్షిణాఫ్రికా జట్టులో హెండ్రిక్స్ 70 పరుగులు (50 బంతుల్లో సిక్స్, 8 ఫోర్లు) చేయగా, బెహర్డిన్ 39 పరుగులు (27 బంతుల్లో 2 సిక్స్‌లు, 3 ఫోర్లు) చేశాడు. ఈ మ్యాచ్‌తో టీ20 మ్యాచ్‌లో 5 వికెట్లు తీసిన తొలి భారత్ ఫాస్ట్ బౌలర్‌గా భువనేశ్వర్ నిలిచాడు. ఆదివారంతో మూడు ఫార్మట్ల మ్యాచ్‌ల్లోనూ అతను 5 వికెట్లు సాధించాడు.



ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా టీమిండియాను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి ఓవర్ నుంచి భారత్ దాటిగా ఆడింది. ఈ ఓవర్‌లోనే 18 పరుగులు లభించాయి. తరువాత ఓవర్‌లోనే రోహిత్ శర్మ (21 పరుగులు, 9 బంతుల్లో 2 సిక్స్‌లు, 2 ఫోర్లు) అవుటైనా, మరో వైపు శిఖర్ ధావన్ జోరు కొనసాగింది. రైనా 15 పరుగులు (7 బంతుల్లో సిక్స్, రెండు ఫోర్లు), కోహ్లి 26 పరుగులు (20 బంతుల్లో సిక్స్, రెండు ఫోర్లు) అవుటైనా, మనీష్ పాండే, ధావన్‌కు మంచి సహకారం ఇచ్చాడు. దాటిగా ఆడిన ధావన్ 15వ ఓవర్‌లో నాలుగో వికెట్‌గా అవుటయ్యాడు. 69 బంతులు ఎదుర్కొన్న ధావన్ రెండు సిక్స్‌లు, 10 ఫోర్లతో 72 పరుగులు చేశాడు. ధోని 16 పరుగులు (11 బంతుల్లో రెండు ఫోర్లు) రాణించాడు. మనీష్ పాండే 29 పరుగులు (27 బంతుల్లో ఒక సిక్స్), హర్థిక్ పాండ్య 13 పరుగులు (7 బంతుల్లో రెండు ఫోర్లు) నాటౌట్‌గా నిలవడంతో 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది.

దక్షిణాఫ్రికాపై టీ20ల్లో 200కు పైగా పరుగులు చేయడం భారత్‌కు ఇదే మొదటిసారి. ఇప్పటి వరకూ సఫారీలతో 11 టీ20ల్లో భారత్ పాల్గొంది. ఈ సిరీస్‌లో రెండో టీ20 ఈ నెల 21న జరుగుతుంది.

కాగా, ఆదివారం మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు చివరి నిమిషంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ట్వంటీ 20 స్పెషలిస్టు ఏబీ డివిలియర్స్ గాయం కారణంగా మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇప్పటికే ఈ సిరీస్‌లో డు ప్లెసిస్ సేవల్ని కోల్పోయిన దక్షిణాఫ్రికాకు మరో కీలక ఆటగాడు కూడా దూరంగా కావడంతో సిరీస్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మరొకవైపు భారత జట్టులోకి చాలాకాలం తర్వాత సురేశ్ రైనా పునరాగమనం చేశాడు. మనీష్ పాండే, ఉనాద్కత్‌లకు కూడా జట్టులో చోటు దక్కింది. కుల్దీప్ గాయం కారణంగా దూరం కావడంతో ఉనాద్కత్‌కు తుది జట్టులో చోటు కల్పించారు. భువనేశ్వర్ కుమార్ తిరిగి జట్టులో చేరాడు. భారత జట్టు ముగ్గురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగింది.

సకినా ఖతౌన్‌కు రజతం



న్యూఢిల్లీ : దుబాయ్‌లో జరుగుతున్న పారా వెయిట్‌లిఫ్టింగ్ ప్రపంచకప్‌లో భారత్‌కు చెందిన సకినా ఖతౌన్‌కు రతజ పతకం లభించింది. 45 కేజీలో విభాగంలో 80 కేజీల బరువునెత్తి సకినా ఈ పతకాన్ని గెలుచుకుంది.కాగా, గత నెలలో సకినా ఆత్మహత్యా యత్నాకి ప్రయత్నించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆస్ట్రేలియాలో జరిగే కామెన్వెల్త్ గేమ్స్‌లో పాల్గొనే జట్టులోకి తనను ఎంపిక చేయకపోవడంపై సకినా ఈ ప్రయత్నం చేసింది. ప్రధాని మోడికీ లేఖ రాసినా స్పందించకపోవడంతో ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది. కామెన్వెల్త్ గేమ్స్‌లో పతకం సాధించిన ఏకైక పారా అథ్లెట్‌గా సకినా నిలిచినా, ఈ ఏడాది గేమ్స్‌కు ఆమెను ఎంపిక చేయలేదు. గ్లాస్కో కామెన్వెల్త్ గేమ్స్‌లో లైయిట్ వెయిట్ విభాగంలో ఆమె కాంస్య పతకం సాధించింది.



మూడో టీ20లో మహిళల ఓటమి

జొహెనెస్‌బర్గ్ : దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన మూడో టీ20లో భారత మహిళా క్రికెట్ జట్టు ఓటమి చవిచూసింది. ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 5 వికెట్లతో విజయం సాధించింది. ఈ సిరీస్‌లో దక్షిణాఫ్రికాకు ఇదే తొలి గెలుపు. భారత్ విధించిన 134 పరుగుల లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా ఇంకా ఆరు బంతులు మిగిలి ఉండగా, ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ప్రస్తుతం ఈ సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో ఉంది. నాలుగో టీ20 ఈ నెల 21న జరుగుతుంది. ఈ పర్యటనలో భారత మహిళలు ఇప్పటికే వన్డే సిరీస్‌ను 2-1తో గెల్చుకున్నారు. ఈ టీ20 సిరీస్‌లో కూడా విజయం సాధిస్తే దక్షిణాఫ్రికా గడ్డపై ఒకే పర్యటనలో రెండు సిరీస్‌లు గెలుచుకున్న తొలి మహిళా జట్టుగా రికార్డు సృష్టిస్తారు. ఆదివారం మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 17.5 ఓవర్లకు 133 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మిథాలీ రాజ్ (0) విఫలమైంది. సారథి హర్మన్‌ప్రీత్ కౌర్ (48 పరుగులు, 30 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్మ తి మంధాన (37 పరుగులు, 24 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), వేద క ష్ణమూర్తి (23 పరుగులు, 14 బంతుల్లో 4 ఫోర్లు) రాణించారు. దూకుడుగా ఆడారు. అయితే షబ్నిమ్ ఇస్మాయిల్ (5/30) బౌలింగ్ ధాటికి టెయిలెండర్లు, మిడిలార్డర్ అంతగా రాణించలేదు. దీంతో 17.5 ఓవర్లలోనే భారత్ 133కు ఆలౌటయింది. ఈ తరువాత లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా దూకుడుగా ఆడింది. సన్ లూస్ (41 పరుగులు, 42 బంతుల్లో 5 ఫోర్లు), క్లో ట్రైయన్ (34 పరుగులు, 15 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేన్ వాన్ నికెర్క్ (26 పరుగులు, 20 బంతుల్లో 5 ఫోర్లు) వేగంగా ఆడి జట్టుకు విజయం అందించారు. చివర్లో టీమిండియాకు అవకాశాలు వచ్చినా అప్పటికే ఆలస్యమైంది. భారత్ మరో 20 పరుగులు చేసుంటే అవకాశాలు ఉండేవి. పూజా 2, రాజేశ్వరి గైక్వాడ్, అనుజ పాటిల్, పూనమ్ యాదవ్ తలో వికెట్ తీశారు. 5 వికెట్లు తీసిన షబ్నిమ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.



గుంటూరు ఎఎన్‌యూలో ఖోఖో పోటీల్లో తలపడుతున్న బాలికలు

క్రీడలతో సత్తా చాటే అవకాశం

- రెండోరోజుకు ఎస్ఎఫ్ఐ క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

క్రీడల ద్వారా మహిళలు తమ సత్తా చాటేందుకు అవకాశం ఉందని జన విజ్ఞాన వేదిక గుంటూరు జిల్లా నాయకులు శ్రీదేవి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. మహిళల ఖోఖోలో ఇంజినీరింగ్ సిఎస్ఇ, ఇఇఇ విభాగాల జట్లు విజయం సాధించాయి సోమవారం సెమీఫైనల్స్ నిర్వహిస్తారు. క్రికెట్‌లో రెండోరోజు 18 జట్లు తలపడ్డాయి. పోటీలను అనిల్, బాషా, రవి, సురేఖ పర్యవేక్షిస్తున్నారు.



20 కిమీ నడకలో సౌమ్య రికార్డు

న్యూఢిల్లీ : 20 కిమీ నడకలో ఢిల్లీకి చెందిన బి సౌమ్య నూతన జాతీయ రికార్డు సృష్టించింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఈనెర్జల్ జాతీయ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో మహిళల విభాగంలో సౌమ్య 1:31:28.72 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసింది. దీంతో 2014లో కుష్బీర్ కౌర్ (1:31:40.00) రికార్డును సౌమ్య తిరగరాసింది. ఈ విజయంతో సౌమ్య బంగారు పతకంతో పాటు, ఈ ఏడాది జరిగే కామెన్వెల్త్ గేమ్సుకు అర్హత సాధించింది. ఏప్రిల్ 4 నుంచి 15 వరకూ ఆస్ట్రేలియాలో కామన్వెల్త్ గేమ్స్ జరుగనున్నాయి. 'కామన్వెల్ గేమ్స్ నాకు పెద్ద పరీక్ష. ప్రస్తుతం భారత్ దృష్టి నాపైన వుంటుంది. రష్యా కోచ్ వద్ద శిక్షణ తీసుకుంటున్న నేను గేమ్స్‌లో పతకం సాధిస్తానే నమ్మకంతో వున్నాను' అని విజయం అనంతరం సౌమ్య వ్యాఖ్యానించింది.

ఢిల్లీలో సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్స్‌లో సౌమ్య బాధ్యతలు నిర్వహిస్తుంది.కాగా, ఆదివారం రేసులో కుష్బీర్ కౌర్ రెండో స్థానంలో నిలిచింది. ఆమె 1:32:16.96 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసింది. మూడో స్థానంలో కుష్బీర్ కౌర్ సోదరి కరమ్‌జీత్ కౌర్ (1:34:08.60 సెకన్లు) నిలిచింది. అలాగే ఈ చాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో కెటి ఇర్ఫాన్ విజేతగా నిలిచాడు. ఇతను 1:21:31.25 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేశాడు. రెండో స్థానంలో మనీష్ సింగ్ రావత్, మూడో స్థానంలో నీరజ్ నిలిచాడు. వీరంతా కామెన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించారు. ఈ గేమ్స్‌కు అర్హత సాధించాలంటే పురుషులు ఒక గంట 22 నిమిషాల్లోనూ, మహిళలు ఒక గంట 35 నిమిషాల్లోనూ రేసును పూర్తి చేయాల్సి ఉంటుంది.



ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్ర జట్టుకు బహుమతులందిస్తున్న బుడోకాన్ కరాటే ఆఫ్ ఇండియా ఛైర్మన్, సినీ నటుడు సుమన్

ఆలిండియా కరాటే విజేత ఆంధ్రా

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వేదికగా మూడురోజులుగా నిర్వహిస్తున్న 16వ ఆల్ ఇండియా బుడోకాన్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఓవరల్ ఛాంపియన్ షిప్‌గా ఆంధ్రా జట్టు విజయం సాధించింది. 91 బంగారు పతకాలు, 91 రజిత, 131 కాంస్య పతకాలతో తొలి స్థానం దక్కించుకుంది. 34 బంగారం, 29 రజితం, 65 కాంస్య పతకాలతో తెలంగాణ ద్వితీయ స్థానం సంపాదించింది. 22 బంగారం, 9 రజితం, 7 కాంస్య పతకాలతో కర్ణాటక జట్టు మూడోస్థానంలో నిలిచింది. ఎపి, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, మణిపూర్, జమ్ము, హరియాణ, మేఘాలయ, పశ్చిమబెంగాల్, అసోం వంటి 12 రాష్ట్రాలకు చెందిన 750 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో తలబడ్డారు. కేడెట్ నుంచి సీనియర్ కేటగిరి వరకూ కుమిటి, కాటా అంశాల్లో ఈ పోటీలను విశాఖ బుడోకాన్ ఓపెన్ కరాటే అసోసియేషన్ నిర్వహించింది. విజేతలకు బుడోకాన్ కరాటే ఆఫ్ ఇండియా చైర్మన్, సినీ నటుడు సుమన్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడల నిర్వహణకు విశాఖలో అనువుగా ఉంటుందన్నారు. సంఘాలు, అసోసియేషన్‌ల మధ్య ఉన్న బేదాభిప్రాయాలను పోటీలపై చూపించడం సమంజసం కాదన్నారు. అందరూ కలిసి కట్టుగా పోటీలను నిర్వహించాలని కోరారు. అనంతరం ఆయనతో పాటు పలువురు సీనియర్ క్రీడాకారులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ అల్తీఫ్ అలిమ్, సురక్షా గ్రూపు సిఎమ్‌డి బొడ్డేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.



ఓల్గా | ఆనంద్ | సింగారెడ్డి జింగ్రాస్ | కెఎం యాదవ్

25న 'స్ఫూర్తి అవార్డుల' ప్రదానం

ప్రజాశక్తి-గుంటూరు

వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారికి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ ఈనెల 25న గుంటూరులో 'స్ఫూర్తి అవార్డులు' ప్రదానం చేయనుంది. ఈ మేరకు ఆదివారం గుంటూరు విద్యానగర్‌లో అలహాబాద్ హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి, స్ఫూర్తి అవార్డుల జ్యూరీ చైర్మన్ జస్టిస్ అంబటి లక్ష్మణరావు, కమిటీ సభ్యులు అవార్డు గ్రహీతల పేర్లను వెల్లడించారు. తెలుగు సాహిత్య రంగంలో ప్రముఖ రచయిత్రి ఓల్గా (పోపూరి లలితకుమారి), విద్యారంగంలో సిలికాన్ ఆంధ్ర సిఇఒ, చైర్మన్ కూచిబొట్ల ఆనంద్, గ్రామీణాభివృద్ధి రంగంలో సోపార్ బాలవికాస్ వ్యవస్థాపకులు బాలథెరిసా సింగారెడ్డి జింగ్రాస్, సామాజిక సేవా రంగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన సమాచారహక్కు చట్టం కార్యకర్త కెఎం యాదవ్‌కు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు లక్ష్మణరావు తెలిపారు. ఆయా రంగాల్లో వారు అందిస్తున్న సేవను స్ఫూర్తిగా తీసుకోవాలని అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. అవార్డుల ప్రదానోత్సవానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, రాష్ట్ర శాసన సభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ హాజరవుతారన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఇద్దరు జవాన్లు సహా నలుగురు మృతి

ఆరుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చింతూరు (తూర్పుగోదావరి)

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో ఆదివారం పోలీసులకూ, మావోయిస్టులకూ మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు పోలీసు జవాన్లు, రోడ్డు పనులు నిర్వహిస్తున్న మరో ఇద్దరు మృతి చెందారు. ఆరుగురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఐజి సుందర్ రాజ్ కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యమైన బెజ్జి గ్రామం నుంచి చింతగుప్ప గ్రామం వరకు రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు పనులను అడ్డుకునేందుకు పలుమార్లు వాహనాలు తగులబెట్టారు. అయినప్పటికీ పనులు ఆగలేదు. ఆగ్రహించిన మావోయిస్టులు ఆదివారం పనులు చేస్తున్న వారిపై కాల్పులు జరిపారు. దీంతో కాంట్రాక్టరు అనిల్, మరో కూలి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలో కూంబింగ్ చేపడుతున్న పోలీసులకు మావోయిస్టులు తారసపడ్డారు. ఆ సందర్భంగా నాలుగు గంటలపాటు కాల్పులు జరుపుకున్నారు. ఈ కాల్పుల్లో సిఆర్‌పిఎఫ్ జవాను మడకం హందా, మరో జవాను మహేష్ తడతి మృతి చెందారు. సమాచారం అందుకున్న ఐజి సుందర్‌రాజ్ సమాచారం తెలుసుకుని హుటాహుటీన సంఘటన స్థలానికి హెలికాప్టర్‌ను పంపారు. నలుగురి మృతదేహాలతోపాటు గాయపడిన జవాన్లను రాయపూర్ తరలించారు.



రాయపూర్ ప్రభుత్వాసుపత్రిలో మృతదేహాలు

తెలుగుపై చిత్తశుద్ధి ఉండాలి

- ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రామలింగేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్రాజపురం (విజయవాడ)



సదస్సులో మాట్లాడుతున్న ఎ.రామలింగేశ్వరరావు

సాక్షి చెప్పిన భాషలోనే సాక్ష్యాన్ని న్యాయమూర్తులు నమోదు చేసి అదే భాషలో తీర్పునివ్వాలని ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. 'న్యాయస్థానాలలో తెలుగు వినియోగం కోసం ఉద్యమ సమాలోచన' అనే అంశంపై ఆదివారం సదస్సు జరిగింది. బెజవాడ బార్ అసోసియేషన్ హాల్‌లో తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు సామల రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామలింగేశ్వరరావు మాట్లాడారు. మాతృభాష తెలుగుపై న్యాయవాదులకు, న్యాయమూర్తులకు ప్రేమ, చిత్తశుద్ధి ఉండాలన్నారు. న్యాయస్థానాలలో డిటిపి, తర్జుమా వ్యవస్థ ఉండాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ సర్వీస్ కమిషన్ సభ్యులు మంగారి రాజేందర్ మాట్లాడుతూ మాతృభాషలో మన భావాన్ని వ్యక్తీకరించడానికి వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య ఉపాధ్యక్షులు బి.హనుమారెడ్డి న్యాయస్థానాలు, తెలుగు భాషా వినియోగంపై కీలకపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి వై.లక్ష్మణరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సోము కృష్ణమూర్తి, అఖిలభారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ ప్రసంగించారు. సదస్సు ప్రారంభానికి ముందు ప్రజానాట్య మండలి కళాకారులు రాజేష్ బృందం తెలుగు భాష గొప్పదనంపై ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లా కలికిరి మండలం పోరాకుల పల్లె గ్రామ దళిత మహిళ అపర్ణపై శివరాత్రి జాతర సందర్భంగా అవమానపరిచి, ప్రతిఘటించిన దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 13న శివరాత్రి సందర్భంగా జరిగిన జాతరకు కుటుంబ సభ్యులతో వెళ్లిన అపర్ణ తిరిగి వస్తుండగా అదే గ్రామానికి చెందిన అగ్రకుల దురహంకారులు దూషించారని తెలిపారు. దీనిని ప్రతిఘటించిన కుటుంబ సభ్యులపై మూకుమ్మడి దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ముద్దాయిలకు తలొగ్గిన ఎస్సై కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. దీనికి కారణం ముద్దాయిలకు మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డి సోదరుడు కిషోర్ కుమార్ రెడ్డి అండగా ఉండటమేనని తెలిపారు. ఆడవారిని అల్లరి చేశారని బాధితులపైనే కౌంటర్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. దాడిలో 75 మంది పాల్గొంటే, కేవలం 25 మందిపై కేసులు పెట్టడమేమిటని ఆయన ప్రశ్నించారు. డిజిపి, సిఎస్ జోక్యం చేసుకుని ఈ ఘటనపై విచారణ చేపట్టాలని, ముద్దాయిల్ని ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసు ప్రకారం శిక్షించాలని, కౌంటర్ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కులవివక్ష , అంటరానితనం నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే తీవ్ర స్థాయిలో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

గ్రామాల్లో ఎల్ఇడి వెలుగేదీ?



- లక్ష్యానికి దూరంగా పనులు
- పెట్టింది 3 లక్షల బల్బులే
- మార్చి నాటికి 10 లక్షలు సాధ్యమేనా?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎల్ఇడి వీధి దీపాలను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్తు బిల్లుల భారం నుంచి మినహాయింపు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినా వీటి ఏర్పాటు మాత్రం లక్ష్యాలకు దూరంగా ఉంది. మరోవైపు విద్యుత్తు బిల్లులు చెల్లించని పలు పంచాయతీలకు విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గతేడాది ఎల్ఇడి వీధి దీపాల ఏర్పాటు కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందుకు న్యూ అండ్ రెనెవబుల్ ఎనర్జీ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (నిడ్‌క్యాప్), ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసు లిమిటెడ్ (ఇఇఎస్ఎల్)లకు ఈ పనులు అప్పగించారు. ఈ సంస్థలు వారికి కేటాయించిన జిల్లాల్లో ఎల్ఇడి వీధి దీపాల పనులు ప్రారంభించాయి. గతేడాది నవంబరు నాటికి 3 లక్షలు, ఈ ఏడాది మార్చికి 10 లక్షల వీధి దీపాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యం నెరవేరే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఇప్పటి వరకూ రెండు సంస్థలు కలిపి కేవలం 3 లక్షల వీధి దీపాలను మాత్రమే ఏర్పాటు చేశాయి. పనుల్లో జాప్యానికి కారణం వీధి దీపాలకు అవసరమైన ఇతర ఎలక్ట్రికల్ పరికారాలు అందుబాటులో లేకపోవడం, అలాగే థర్డ్‌వైర్‌ను కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు సంస్థలు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని తెలుస్తోంది. పనుల తీరుపై ఇటీవల మంత్రి లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో ప్రతి రోజూ 10 వేల వీధి దీపాల్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇఇఎస్ఎల్ సంస్థ ప్రతినిధులు ఇటీవల వెల్లడించారు. ఈ సంస్థకు కేటాయించిన ఎనిమిది జిల్లాల్లో 5,237 గ్రామాలకు కేవలం 256 గ్రామాల్లో మాత్రమే ఇప్పటి వరకూ వంద శాతం ఎల్ఇడి వీధి దీపాల్ని ఏర్పాటు చేసింది. ఏర్పాటు చేసిన 1,56,773 వీధి దీపాల్ని రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు సిసిఎంఎస్ బాక్సులకు అనుసంధానం చేసింది.

ఈ ఏడాది నవంబరు నాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తామని చెబుతోంది. మరోవైపు నెడ్‌క్యాప్‌కు కేటాయించిన ఐదు జిల్లాలో 5 లక్షల ఎల్ఇడి వీధి దీపాల్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా 1.50 లక్షల్ని మాత్రమే ఏర్పాటు చేసింది. ప్రస్తుతం విశాఖపట్నం, పశ్చిమ గోదావరి జిల్లాలో పనులు కొనసాగిస్తోంది. ఎల్ఇడి బల్బుల వల్ల గ్రామ పంచాయతీల్లో 59 శాతం విద్యుత్తు ఆదా అవుతుందని విద్యుత్తు సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇందుకోసం సుమారు రూ.800 కోట్లకుపైగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68